# "శివానందలహరి"

## శ్రీ ఆది శంకరాచార్య స్వామి విరచిత



శ్రుతి స్మృతి పురాణానా మాలయం కరుణాలయం|

నమామి భగవత్పాదం శంకరం లోక శంకరమ్||

శ్రీ ఉయ్యాల కామేశ్వరీ దేవి భక్తులందరికీ నమస్కారము

శ్రీ ఆది శంకరాచార్య స్వామి విరచిత "శివానందలహరి" లోని భక్తి ని ఆశ్వాదిద్దాము. శివానందలహరి భక్తి రస ప్రధానమైన స్తోత్రము.

"పూజ కోటి సమం స్తోత్రం" అన్నారు పెద్దలు. అనగా కోటి పూజలతో సమానం స్తోత్రం అని అర్థము."భక్త్యర్థం కల్పితం ద్వైతం-అద్వైతాదపి సుందరం" అనగా, భక్తి కోసం ద్వైత కల్పన చేయబడినా అది అద్వైతాని కన్నా బహు సుందరమైనది అని స్వయంగా శంకరులే అన్నారు.

శివానందలహరి లో పూర్తిగా భక్తికి, శరణాగతికి సంభందించిన విషయాలే ఉంటాయి గాని సౌందర్య లహరి లో లాగ సాంకేతిక పదాలతో వివిధ శాస్త్ర జ్ఞాన విషయాలుండవు.

ఇంకో ముఖ్యమైన విషయం శంకరాచార్య స్వామి ఆంధ్ర దేశంలో పర్యటనలో శ్రీ శైల క్షేత్రాన్ని సందర్శించారు. అచ్చట కొంతకాలం తపస్సు చేశారు. అప్పుడే శ్రీ శైల మల్లికార్జున స్వామి ని దర్శించి రెండు అద్భుత మైన శ్లోకాలు చెప్పారు. ఆ రెండు శ్లోకాలు ఇందు 50, 51 శ్లోకాలు గా మధ్య లో కూర్పు చేశారు.

కొత్త దిశలో, సరికొత్త కోణంలో విషయాన్ని అందించాలన్న తపన ఈ రచన వివరణ లో జి.ఎల్.ఎన్. శాస్త్రిగారిలో కనిపిస్తుంది. రేపటినుండే ప్రారంభం.

---

Sri Maha Kameswari Seva Trust





**1. కలాభ్యాం చూడాలంకృత శశి కలాభ్యాం నిజతపః**
**ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతు మే |**
**శివాభ్యా మస్తోక త్రిభువన శివాభ్యాం హృది పున**
**ర్భవాభ్యా మానందస్ఫురదనుభవాభ్యాం నతి రియమ్.**

సకల విద్యా స్వరూపులును, సిగలచే అలంకరింపబడిన చంద్రరేఖలు గలవారును, తమతమ తపః ఫలములుగా ఒకరికొకరు పొందబడిన వారును, భక్తులకు కర్మ ఫలాదులను ప్రసాదింప జేయువారును,ముల్లోకము

లకు అత్యంత శుభ దాయకులుగా నుండువారును, తలచినంతనే హృదయమందు మరల మరల ప్రసన్నులగు వారును, ఆనందముతో పాటు స్వరూప సాక్షాత్కారాను భవమును గూడా కలుగజేయు వారును అగు - ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల కొరకు ఇదే నా నమస్కారము.

ఈ "శివానందలహరి" జగత్పిత అయిన శివునికి సంబంధించిన స్తోత్రమే అయినప్పటికీ, ప్రధమ శ్లోకం - జగత్తు యొక్క ఆవిర్భావానికి కారణంగా ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులిద్దరినీ ఉద్దేశించి చేసిన ప్రార్థన.

Sri Maha Kameswari Seva

భౌతికంగా వ్యక్తమవడానికి అయ్యవారు అమ్మవారి పైనే ఆధారపడతారని, ఆ అమ్మ వారిగా భౌతిక దేహంతో ఏర్పడడానికి ఆ అయ్యవారి సంకల్పమే కారణమని అర్థం చేసుకుంటే - వీరిద్దరి మధ్య వుండే పరస్పరాధార సంబంధం అర్థమౌతుంది.

ప్రపంచ తత్త్వానికి,పరమాత్మ తత్త్వానికి సంబందించిన ఏ విద్య అయినా, ఏ శాస్త్రమైనా ప్రకృతి పురుషులకు చెందినదే. కాబట్టి సకల విద్యల స్వరూపంగా ప్రకృతి పురుషులైన పార్వతీ పరమేశ్వరులిద్దరినీ కలిపి ధ్యానించే ఉద్దేశ్యంతో శంకరాచార్యుల వారు ఆ ఇద్ధరినీ "కలాభ్యాం" అని సంబోధించేరు. ఆమె "జ్ఞాన ప్రసూన" అయితే ఆయన "జ్ఞాన మూర్తి" కాబట్టి ఈ ఇద్దరూ జ్ఞాన ప్రదాతలే అని ఈ "కలాభ్యాం" పద ప్రయోగము సూచిస్తుంది.

పార్వతి శివుని కోసం తపస్సు చేసింది, శివుడు కూడా సతీ వియోగానంతరం ఆమెను పొందాలని తపించాడు. ఈ ఇరువురి తపస్సుల ఫలితంగా ఒకరినొకరు పొందారు. ఇదే విషయం - "నిజ తపః ఫలాభ్యాం"  అనే సంబోధన సూచిస్తుంది.

భక్తులు కోరేవి కాకుండా వాళ్ళకు అవసరమైన వాటిని భగవంతుడు ఇస్తాడు. భక్తులకు వారివారి పూర్వ కర్మలను బట్టి కర్మ ఫలాలుగా అవసరమైన వాటిని అవసరమైనంత మేరకు అవసరమైనంత కాలానికి ప్రసాదిస్తాడు. భక్తుల నిష్కల్మష నిష్కామ భక్తికి మెచ్చి చివరకు ముక్తిని గూడా ప్రసాదిస్తాడు. ఇదే "భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం" సూచిస్తుంది.

జగత్ప్రళయం లో గూడా సమస్త సృష్టిని తన కుక్షిలో ఉంచి రక్షించే భద్రమూర్తి ఈ శివుడు.అందుకే ఆయన లయకారుడు. తనయందు లయము చెందించి రక్షించేవాడే గాని వినాశం చేసేవాడు గాదు.

ఉదాహరణకు: వేసవి కాలం సెలవల్లో అధ్యాపకులు, విద్యార్థులు, నౌకర్లు, హాజరుపట్టీలు పాఠాలు వగైరా ఇవన్నీ చనిపోయి ఉండవు. మరల విద్యాలయాలను తెరచినపుడు వెంటనే అందరూ  ప్రత్యక్షమవుతారు గదా ! అలాగే ప్రళయానంతరం సమస్త సృష్టి కి సంబందించిన అన్ని జాతుల జీవరాశులు బయటపడతాయి.

Sri Maha Kameswari Seva Trust

ఒకే నామంతోఉండి, ఒకే రూపంలో ఉండి, ఒకే పదంలో పిలువబడే ఆది దంపతులు ను, జగజ్జననీ జనకులును - జగన్మాత, జగన్నేతలును అయిన పార్వతీపరమేశ్వరులను ఉద్దేశించి శుభసూచకంగా "శివాభ్యాం" అనే పద ప్రయోగముతో నమస్కరిస్తూ ఈ శివానందలహరీ స్తోత్రాన్ని ఆదిశంకరులు భక్తి తో ప్రారంభించారు.

---

**2. గళంతీ శంభో త్వచ్చరిత సరితః కిల్బిష రజో**
**దళంతీ ధీకుల్యా సరణిషు పతంతీ విజయతామ్ |**
**దిశంతీ సంసార భ్రమణ పరితాపోపశమనం**
**వసంతీ మచ్చేతోహ్రదభువి శివానందలహరి ||**

శాంతి సుఖములకు ఉత్పత్తి స్థానమైన ఓ శివా! నీ చరిత్ర మనెడి నది నుండి స్రవించి ప్రవహించుచు, పాపములనెడు ధూళిని అణచుచున్న ఈ శివానందలహరి - బుద్ధి అను పిల్లకాలువ గుండా వచ్చి, సంసార తాపమును చల్లార్చుచూ, నా హృదయము అను మడుగులో పడినది. ఈ ఆనంద ప్రవాహము ఇక ఈ మడుగును వదిలి పోకుండా స్థిరముగా నుండునట్లు అనుగ్రహింపుము.

శివుని చరిత్ర శివుని లీలలు మహిమాన్వితమైనవి, అందరికీ మహోపకారకము లైనవి, మంగళకరమైనవి. అట్టి శివుని చరిత్ర అనే మహానదీ ప్రవాహం - అది ప్రవహించే ప్రదేశాల లోని ధూళి ధూసరములనే పాపాలను కడిగేస్తుందిట! అంటే అంతకు పూర్వం జీవుడు ఆశ్రయించిన కపట వ్యక్తులను, అనుసరించిన వృధా విధానాలను, అందువల్ల ఏర్పడిన కష్టనష్టాలను పరిష్కరించడంతో బాహ్యారంగ ప్రక్షాళన జరుగుతుంది.

Sri Maha Kameswari Seva Trust

బాహ్యరంగం చక్కబడిన తరువాత జీవునికి అంతరంగం చక్కబడటం రెండవ మెట్టు.

ఏవిషయమైనా పంచ జ్ఞానేంద్రియముల ద్వారా మనస్సుకు చేరుతుంది. మనస్సు గ్రహించిన విషయాల్లోని మంచి చెడ్డలను వివేకంతో బుద్ధి నిర్ణయిస్తుంది. ఇటువంటి బుద్ధి అనే పిల్లకాలువ ద్వారా శివానందలహరీ స్తోత్రమనే మహానది ప్రవహించి అంతరంగ ప్రక్షాళనం చేస్తుంది.

బాహ్యరంగ అంతరంగ ప్రక్షాళన వలన జీవుని యొక్క సాంసారిక పరితాపాలకు ఉపశమనం కలుగుతుంది.

మన బాహ్యరంగ అంతరంగ క్షాళనం జరిగిన తరువాతనే శాశ్వత సుఖానికి ఉత్పత్తి స్థానమైన శివుని సాన్నిధ్యము లభించడం, శివునితో సాయుజ్యం చెందటం జరుగుతుంది. ఇది హృదయంలోనే జరగవలసిన ఒక అనుభూతి ప్రదమైన ప్రక్రియ.

ఈ శివానందలహరీ స్తోత్రమనే మహానదీ ప్రవాహం చివరకు మన హృదయమనే మడుగు లోనికి ప్రవేశించి మనకు శాశ్వత మైన, స్థిరమైన ఆనంద స్థితిని కలుగజేస్తుంది. అంటే శివనామ స్మరణం, శివ చరిత పఠనం, శివపాద భజనం మహదానంద స్థితిని పొందడానికి ఉత్తమమైన, సులువైన మార్గాలని శంకరులు చెప్పుచున్నారు.

శివుడంటే మనలోని ఆత్మకు ప్రతీక కాబట్టి ఈ మహదా నందమే ఆత్మానుభూతికి సంబంధించిన బ్రహ్మానందం కూడా అవుతుంది.

---

**3. త్రయీవేద్యం హృద్యం త్రిపుర హరమాద్యం త్రినయనం**

**జటాభారోదారం చలదురగహారం మృగధరమ్।**

**మహాదేవందేవం మయి సదయభావం పశుపతిం**

**చిదాలంబం సాంబం శివమతి విడంబం హృది భజే ||**

Sri Maha Kameswari Seva Trust

మూడు వేదములలో తెలియబడు వాడును, హృదయము నందు స్ఫురించు వాడును, స్థూల సూక్ష్మ కారణ శరీరములను నియంత్రించి నిర్మూలించు వాడును, సృష్టికి ముందే నుండు వాడును, మూడు కన్నులు గలవాడును, జటాజూట సర్పహారములు గలవాడును, చేతిలో లేడిని ధరించినవాడును, ప్రకాశానందములు తన రూపముగా వెలుగొందు వాడును, నాయందు దయగలవాడును, స్వ స్వరూప జ్ఞానము నకు ముఖ్య సాధనమైన వాడును సకల లోక పాలకుడును, సమయావ సారములను బట్టి ప్రవర్తించు వాడును, పార్వతీ సమ్మోహుండును అగు - పరమేశ్వరుని హృదయములో సేవించుచున్నాను.

"త్రయీ " శబ్దాన్ని ప్రధానమైన మూడు వేదాల పరంగానే అన్వయిస్తారు. అవే - సామవేదం, ఋగ్వేదం, యజుర్వేదం. ప్రాణః సామవేదః అన్నదాన్ని బట్టి మనలో ప్రాణమే సామవేదం. ప్రాణం శ్వాసాధారం కాబట్టి సామవేదాన్ని శ్వాసతో సమన్వయ పరుచుకోవాలి.

ఈ శ్వాస ఉచ్ఛ్వాస నిశ్వాసలతో కూడినది. దీనిని జాగ్రత్తగా గమనిస్తే సోహం అక్షర ఉచ్చారణ ధ్వని ఉంటుంది. ఈ రెంటి కలయిక తో ఓం అనే ఏకాక్షరం ఏర్పడుతుంది.దీనినే "ప్రణవం" అంటారు. కాబట్టి సామవేదం ద్వారా తెలియబడేవాడు అంటే "ఓం "ద్వారా తెలియబడేవాడు అని అర్థం. పతంజలి కూడా పరమాత్మకు సంబంధించిన వాచక రూపం ప్రణవమనే విషయాన్ని - "తస్యవాచకః ప్రణవః" అనే సూత్రం ద్వారా చెప్పాడు.

వాగేవ ఋక్ అన్నదాన్ని బట్టి మన వాక్కుతో ఋగ్వేదాన్ని సమన్వయ పరుచుకోవాలి.

మనో యజుర్వేదః అన్న దానిని బట్టి మనస్సుతో యజుర్వేదాన్నిసమన్వయించు కోవాలని తెలుస్తోంది. సంకల్పానికి సంబంధించినది మనస్సు.

"మనశ్శివసంకల్పమస్తు" - అని మహన్యాస రుద్రాభిషేకం లో వస్తుంది. అంటే మనలో మనస్సు ద్వారా సంకల్పించే వాడు శివుడన్న మాటే గదా ! కాబట్టి

Sri Maha Kameswari Seva Trust

అటువంటి శివుణ్ణి మనస్సుకు సంబంధించిన యజుర్వేదం ద్వారా తెలియ బడేవాడు అని అర్థం చేసుకోవాలి. పురుషుడంటే -పురమునందు ఉండువాడు అని అర్థం. జీవుని శరీరమే ఈ పురం. ఈ శరీరం మూడు విధాలుగా ఉంటుంది. స్థూల సూక్ష్మ కారణ శరీరం. మనలోని భౌతిక పదార్థాన్ని స్థూల శరీరం గాను దీనిని ఆసరాగాచేసుకుని వ్యక్తమయే జీవుణ్ణి సూక్ష్మ శరీరం గాను జన్మజన్మల లోను వివిధ జీవుల ద్వారా వ్యక్తమవడానికి కారణమైన దాన్ని కారణ శరీరం గాను అర్థం చేసుకోవాలి. "ఇటువంటి  త్రిపుర సంబంధమైన జీవుని తత్త్వాన్ని తెలిపే ముడిని విప్పి అసలు విషయాన్ని అవగతం చేసేవాడు" - అనే అర్థంలో శివుణ్ణి ఒక విధంగా "త్రిపుర హరుడు" అని అనవచ్చును.

శివుని కి మూడు కళ్ళు. వామనేత్రం - చంద్రునికి, ఫాల నేత్రం - అగ్నికి, దక్షిణ నేత్రం సూర్యునికి ప్రతీకలు. ఇవి వరుసగా రాత్రిని సాయంసంధ్య ను పగటి కాలాలను సూచిస్తాయి. ఫాల నేత్రం - ఎదురుగా కనబడని వారిని, వారి మనోగతాన్ని, భవిష్యత్తు ను కూడ చూడగలుగుతుంది. ఇది ఆజ్ఞాచక్ర కేంద్రస్థానము వద్ద ఉంటుంది. అందుకే దీనిని "జ్ఞాననేత్రం"అని గూడా అంటారు.

ఆకాశం లోని మేఘాల కూటమి- శివుని జటాజూటాన్ని సర్పం - కాలాన్ని సూచిస్తాయి. అందరూ కాలానికి ఆహారమైతే - కాలం ఆయనకు హారం కాలకూట విషం ఆహారం ఔతాయి. అంటే శివుడు కాలాతీతుడు, సదాశివుడు అన్నమాట!

ఏమీ లేనట్టుగా కనపడేది ఆకాశము.అలాంటి ఆకాశాన్ని ప్రళయంలో తాను ముందు చేతిలోకి తీసుకుంటాడు. అటుపైన మిగిలిన నాలుగు భూతాలు ఆ ఆకాశాన్ని అనుసరించి శివుని చేతిలో లీనమౌతాయి. మనలో గూడా ఏమీ లేకుండా మనం మాత్రమే వుంటే మనలను తన చేతిలోకి తీసుకుని సాయుజ్యాన్నిస్తాడు

"తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి తన్నో రుద్రః ప్రచోదయాత్ " అని, "పురుషస్య విద్మ సహస్రాక్షస్య మహాదేవస్యధీమహి, తన్నోరుద్రః ప్రచోదయాత్" - అనీ రెండుసార్లు మహాదేవ శబ్దంతో శివునికి గాయత్రీ ఛందస్సుతో మంత్రాలు (మహా నారాయణీయంలో) వుంటాయి.

జీవులందరూ కట్టుగుంజకు కట్టబడిన పశువుల లాంటి వారే ! స్వేచ్ఛగా వున్నట్లు అనిపించినా ఆ స్వేచ్ఛకు పరిమితి లేకుండా లేదుకదా! ఇటువంటి పశువులకు నాధుడు అయినవాడు పశుపతి.

Sri MahaKameswari Seva Trust

సాంబం అంటే - అంబతో కూడినవాడు.శ్మశానంలోవున్నా గజచర్మం కట్టుకున్నా, విషము, విషసర్పాలు తనవద్ధ ఉన్నా ,ఆయన మంగళకరుడే!

సమయానుసారంగా అవసరాన్ని బట్టి వివిధ ములైన ఆకారాల్లోను, రూపాల్లోను ఉండగలవాడని అర్థం. భక్తుల్ని పరీక్షించడానికి ఎన్నోరకాల వేషాలు వేస్తాడు. రుద్రనమకం చదివితే విశ్వం లో వున్న అన్ని రకాల పాత్రలు ఆయన ధరించినట్లు తెలుస్తుంది. శివుడు సర్వాంతర్యామి అని చెప్పడమే ఈ నమకం యొక్క లక్ష్యం.

---

**4 . సహస్రం వర్తంతే జగతి విబుధాః క్షుద్రఫలదాః**

**న మన్యే స్వప్నేవా తదను సరణం తత్క్రుత ఫలమ్ ।**

**హరి బ్రహ్మాదీనామపి వికటరాజా మసులభం**

**చిరం యాచే శంభో శివ తవ పదాంభోజ భజనమ్ ।।**

కొంచెము కొంచెము ఫలమిచ్చు దేవతలెందరో కలరు. వారి సేవ, వారిచ్చు ఫలములు నాకు కావలయునను కోరిక కలనైన లేదు. శివా! ఎల్లప్పుడును సమీపవర్తులైన బ్రహ్మాదులకు గూడ దొరకని నీ పాద సేవయే దయ చేయుమని నిన్ను ఎల్లవేళల వేడుకొను చున్నాను.

తెలివితేటలను పొందటానికి ఒక దేవత, ధనాన్ని పొందడానికి ఇంకో దేవత - ఈ విధంగా ఒక్కొక్క విధమైన ఫలాన్ని పొందడానికి ఒక్కొక్క దేవతను ఆరాధించి అర్చించి, ఆశ్రయించి అన్ని విధాలైన సౌకర్యాలను పొంది కోర్కెలను తీర్చు కోవచ్చును. కాని, ఈ విధంగా పొందిన వన్నీ తాత్కాలిక సుఖాలను పరిమిత కాలానికే ఇస్తాయి కాని - శాశ్వతానందాన్ని ప్రసాదించలేవు. దేనిని పొందితే ఇక పొందవలసినది వుండదో- అటువంటి శాశ్వత మైన ఆనందాన్ని పొందడమే ప్రతి జీవి యొక్క పరమావధి. సులభసాధ్యం కాని ఇట్టి శాశ్వతానందాన్ని పొందడానికి శివుని దగ్గర పైన తెలిపిన బ్రహ్మేంద్రాది దేవతలందరూ కాచుకొని

Sri Maha Kameswari Seva Trust

ఉంటారు.శివుని సాన్నిధ్యముతో, సేవనంతో పోలిస్తే - జన్మ రాహిత్య ఫలం సైతం అంత సంతృప్తిని ఆనందాన్ని ఇవ్వలేవు. అందువలన శంకరుల వంటి సద్భక్తులు మిగిలినవారి సేవను గాని, అందువలన వచ్చే తాత్కాలిక క్షుద్ర లాభాలను గాని కోరరని ఈ శ్లోకము తెలుపుతుంది." నిధి చాల సుఖమా రాముని సన్నిధి సుఖమా" అన్న త్యాగ రాజ కీర్తనను ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి.

**5. స్మృతౌ శాస్త్రే వైద్యే శకున కవితా గాన ఫణితౌ**

**పురాణే మంత్రే వా స్తుతి నటన హాస్యే ష్వచతురః |**

**కథం రాజ్ఞాం ప్రీతిర్భవతి మయి కోఽహం పశుపతే**

**పశుం మాం సర్వజ్ఞ ప్రథిత కృపయా పాలయ విభో ||**

**సర్వజ్ఞుడవైన ఈశ్వరా !**

శాస్త్ర పాండిత్యము లేదు. వైద్యము చేత గాదు. కవిత్వము చెప్పలేను. సంగీతము రాదు. పురాణము చెప్పలేను.మంత్రములెరుగను.

ఆటపాటలయందునేర్పులేదు.


హాస్యము చెప్పలేను. ఇట్టి నాయెడ రాజులకెట్లు దయ గల్గును. వారిచ్చు ఫలములు నాకేల ? సర్వజ్ఞ ! నన్ను నేనే యెరుగని పశువుని. నీవు పశుపతివి గదా! నన్ను నీవే దయతో రక్షింపుము.

మనస్సు, బుద్ధి, జ్ఞానేంద్రియ, కర్మేంద్రయాలను ఉపయోగించి ఏదో ఒక ఉపాధిని కల్పించు కోవాలి. "కూటి కోసమే కోటి విద్యలు" అని కదా సామెత. పురాణోపన్యాసాలను చెప్పడానికి - మన్వాది ధర్మ శాస్త్రములు, ఇతర ఆర్ష గ్రంథాలు చదివి వుండాలి. జ్యోతిశ్శాస్త్రశకునశాస్త్రములు చెప్పాలంటే శాస్త్ర విజ్ఞానము నేర్చుకొని వుండాలి. మంత్రశాస్త్ర, తంత్రశాస్త్ర, సంగీత శాస్త్రాలలో ప్రవేశమే గాక వాటిలో ప్రావీణ్యం ఉంటేనే తప్ప అవతలి వారిని రంజింప చెయ్యలేము. రాజాశ్రయాన్ని పొందలేము. ఒకవేళ ప్రావీణ్యాన్ని సంపాదించినా విద్యా గర్వం, ధనమదం కలిగి పరమేశ్వరుని కృపకు దూరమౌతాము. పరమేశ్వరుని మెప్పించడానికి 'తానెంత' అని ముందు తెలుసుకోవాలి. మనం

Sri Maha Kameswari Seva Trust

పశువుల మైతే పరమేశ్వరుడు పశుపతి. అంటే మనలను జాగ్రత్త గా కాపాడే కాపరి వాడన్న మాట ! కాబట్టి , అటువంటి పశుపతిని సేవించి తరించడానికి వేదశాస్త్ర జ్ఞానం అక్కరలేదు. శరణాగత లక్షణమే ప్రధానం. దాసత్వమే శరణ్యం. ఈశ్వరాయత్త చిత్తమే తప్ప ఇతరమైన విద్యా విజ్ఞానాలు పరమేశ్వరుని మెప్పించలేవని ఈ శ్లోక సారాంశము.

---



Sri Ma... Trust

**6. ఘటో వా మృత్పిండో2 ప్యణురపి చ ధూ2మోగ్ని రచలః**

**పటో వా తంతుర్వా పరిహరతి కిం ఘోరశమనమ్|**

**వృథా కంఠ క్షోభం వహసి తరసా తర్క వచసా**

**పదాంభోజం శంభోర్భజ పరమ సౌఖ్యం వ్రజ సుధీః ||**

కుండలు చేయుటకు మట్టి సాధనము. దానికి పరమాణువులు కారణము. కొండమీద పొగ కనపడు తున్నది కావున నిప్పెక్కడ ఉండును. బట్టలు దారముల వలన కలుగును.

యీ మొదలగు తర్క శాస్త్ర వాక్యములలో నొక్కటి గూడ మృత్యువున కడ్డు పడునది కాదు. ఓ మంచి బుద్ధీ! ఇవి పిడివేసి వల్లించి కంఠక్షోభ మేల కలిగించు కొనెదవు.వద్దు. శివ భజన చేసి మోక్షమును పొందుము.

వివిధ జ్ఞానాలతో ఎన్నో రకాలుగా మనం విజ్ఞానులమైనా అవసానకాలం ఆసన్న మైతే ఆ శాస్త్రజ్ఞానం నిరుపయోగమే! మృత్యుంజయుని బారి నుండి అది మనల్ని రక్షించలేదు. వ్యాకరణ వేత్తకు అన్ని రకాల సంధి సూత్రాలు కంఠతః వచ్చినా ఏ సూత్ర మడిగినా తడుముకోకుండా వెంటనే సరిగా చెప్పగలిగినా - ఆ సమాధానాలు, ఈ విజ్ఞానం యముణ్ణి మభ్యపెట్టి ఆయన కర్తవ్యాన్ని మరుగుపరచలేవు. ఆయన మనస్సునిమార్చలేవు.

కొన్ని కొన్ని పడిగట్టు పదాల ద్వారా ఒక్కొక్క శాస్త్రం పరిచయమై పలువురి ద్వారా ప్రసిద్ధి చెందుతుంది. తర్క శాస్త్ర పదాలు పలికినంత మాత్రాన వృధా శ్రమ తప్ప కాలుణ్ణి, కాల నిర్ణయాన్ని మార్చలేవు. ఇంతకన్నా ఆ పరమశివుని పాదపద్మాలను ఆశ్రయించి, ఆరాధించి పరమ సౌఖ్యాన్ని, శాశ్వతానందాన్ని పొందడం ఎంతో మేలు గదా!

(ఉదా: మార్కండేయుని కధ )

'డు కృ ఞ్ కరణే ' వంటి వ్యాకరణ పారిభాషిక పద స్మరణతో కొట్టుమిట్టాడే పండితుని ఉద్దేశించి గోవింద పదభజనం చేయడం గొప్ప ముక్తి మార్గమని ఆది శంకరులు భజ గోవింద శ్లోకాల్లో చెప్పిన విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలి.

---

**7. మనస్తే పాదాబ్జే నివసతు వచః స్తోత్ర ఫణితౌ**

**కరశ్చాభ్యర్చాయాం శ్రుతిరపి కథా 22కర్ణన విధౌ ।**

**తవ ధ్యానే బుద్ధి ర్నయన యుగళం మూర్తి విభవే**

**పరగ్రంథాన్ కైర్వా పరమ శివ జానే పరమతః ।।**

Sri Maha Kameswari Seva Trust

మనస్సు, వాక్కు, హస్తము, శ్రవణము, బుద్ధి, నేత్రము అను ఆరు ఇంద్రియములు సర్వకాల సర్వావస్థల యందు నీ కైంకర్యములందే మునిగి యున్నచో గ్రంధాంతర ప్రసక్తి కలుగదు కదా! ( కనుక శివా! అట్లనుగ్రహింపుమని భావము.)

ఆలోచించడానికి మనస్సు ఉంది కాని దేనిలో నిమగ్నమై ఆలోచించాలో మనకు తెలియదు. మాట్లాడటానికి నాలుక వుంది గాని దేనిని ఈ నాలుక స్మరిస్తే సార్ధకమౌతుందో తెలీదు. పనులు చేయడానికి చేతులున్నాయి గాని, ఏ పని చేస్తే ఈ చేతులకు ముక్తి కలుగుతుందో తెలియదు. వినగలగడానికి వీనులున్నాయి కాని వేటిని వింటే వీనులకు విలువ పెరుగుతుందో తెలీదు. చూచి తరించాలంటే దేన్ని చూడాలో మనకు తెలీదు. దేన్ని ధ్యాన్నం చేస్తే ఈ బుద్ధి పెడత్రోవలు త్రొక్కకుండా స్థిరత్వం చెందుతుందో తెలుసుకోవాలి. ఆది శంకరులు ఈ ఆరింద్రియాలకు సార్ధకత చేకూరి, మనం తరించడానికి ఈ శ్లోకములో ఆరు వ్యాపారాల్ని చెబుతున్నారు.

మనస్సుని మహేశ్వరుని పాదారవిందాల పై - నిమగ్నం చెయ్యటంలోను, వాక్కులతో వామదేవుని - స్తుతించడం లోను, హస్తాలతో హరుని - అర్చించడం లోను, వీనులతో విశ్వేశ్వరుని లీలలు - వినడం లోను, కన్నులతో - ఆ కామేశ్వరుణ్ణి - కాంచడంలోను, స్థిరంగా బుద్ధిని స్థాణుని పై లగ్నం చెయ్యటం లోను నిమగ్నమైతే - ఆరింద్రియాలు మనల్ని పాపలోకం లోకి - పెడ త్రోవలు త్రొక్కించి - అణగద్రొక్కే

అవకాశం వుండదు గదా ! అని ఆవిధంగా చేసి ఆ ఆదిదేవుని కృపకు పాత్రులు కావాలని ఈ శ్లోకములో శంకరులు సలహా ఇచ్చేరు.

భాగవతంలో ప్రహ్లాదుడు గూడా ఇదే విధంగా - కమలాక్షునర్చించు కరములు కరములు - శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ అని పలికిన పద్య భాగాన్ని ఇక్కడ సమన్వయం చేసుకోవాలి.

---

**8. యథా బుద్ధి శ్శుక్తౌ రజతమితి కాచాశ్మని మణి**

**ర్జలే పైష్టే క్షీరం భవతి మృగతృష్ణాసు సలిలమ్ ।**

Sri Maha Kameswari Seva Trust

**తథా దేవ భ్రాంత్యా భజతి భవదన్యం జడజనో**

**మహాదేవేశం త్వాం మనసి చ న మత్వా పశుపతే ||**

మహాదేవా ! ముత్యపు చిప్పలను వెండి యనియు, గాజురాళ్ళను మణులనియు, పిండి నీళ్ళను పాలనియు, ఎండ మావులను నీళ్ళనియు భ్రమించు నట్లుగా నిన్ను తెలియనేరని మనుజుడు ఇతరుని దేవునిగా భ్రమించి సేవించుచున్నాడు.

బుద్ధి భ్రష్టు పడితే అసలుకు, నకిలీకి భేదాన్ని గుర్తించలేము. నజరుగా వుండే నకిలీ వాటినే అసలు గా భ్రాంతి పడి అసలుకు ఎసరు పెట్టి అగచాట్లు పడుతూ వుంటాం. ఇది లోకంలో సర్వ సాధారణ మైన విషయం.

ముద్దుగా వెన్న ముద్ద వలె కనపడే ముత్యపు చిప్పలే నిజమైన వెండి అని బండ పడిన బుద్ధి అనుకుంటుంది. రెండు కళ్ళతో చూచి కూడా పిండి నీళ్ళను పాలను కుంటుంది పాడుబుద్ధి. ఎండమావుల్లో నిండు నీళ్ళను వెదుక్కుంటుంది వికసించని బుద్ధి. మెరమెరలాడే గాజు మెరుపులను చూచి మందబుద్ధి, మణుల్ని కూడా ప్రక్కన పెడుతుంది. బుద్ధి సరిగా లేనిచో ఈ విధంగానే ఉంటుంది. లేకపోతే హృదయం లోనే ఈశ్వరుణ్ణి ఉంచుకుని ఊరూరా తిరుగుతూ, ఎక్కడెక్కడ వారికి మ్రొక్కు బడులు దేనికి - అని ఈ శ్లోకము లో అంటున్నారు ఆది శంకరులు.

సంస్థ యొక్క యజమానిని నేరుగా దర్శించి విన్నవించు కుంటే పనులు జరుగుతాయి కాని దారిలో తారసపడే దానయ్య లందరికీ విన్నవించు కోవటం వలన ఏం ఫలం వస్తుంది? అలాగే అన్య పరివారం దేవతల్ని , ఆశ్రయించడం, అర్చించడం కన్న అసలు దేవుణ్ణి ఆశ్రయించడం శ్రేయమని ఈ శ్లోక సారాంశము.

---

**9. గభీరే కాసారే విశతి విజనే ఘోర విపినే**

**విశాలే శైలేచ భ్రమతి కుసుమార్థం జడమతిః |**

Sri Maha Kameswari Seva Trust

**సమర్ప్యైకం చేతస్సరసిజ, మమానాథ భవతే**

**సుఖేనావస్థాతుం జన ఇహ న జానాతి కిమహో ||**

ఆహా! మానవులెంత వెఱ్ఱి వారు ! పుష్పముల కొరకు అడవులలోను, కొండలలోను తిరుగులాడుచు, లోతైన చెఱువులలో నీదులాడుచు చిక్కులు పడుచున్నారు. తమతమ మనస్సను పద్మమును పరమేశ్వరుని పాదారవిందముల యందు సమర్పించిన యెడల నెంత సుకరముగా నుండును?

షోడశోపచార పూజలో పుష్పానికి ఒక ప్రత్యేకత ఉంది. రాబోయే ఫలం యొక్క అంకురాన్ని - పింద, కాయ స్థాయిలో నుండి ఫల రూపం లోకి తీసుకురావటానికి కావలసిన పోషణ పుష్పం ద్వారా జరుగుతుంది. ఈ ఫలాంకురాన్ని పురుషాంకురం గాను పుష్పాన్ని ప్రకృతిమాత గాను సమన్వయ పరచుకో వచ్చును. ఈ కారణం మూలం గానే పరమాత్మ కు పుష్పమంటే ఎక్కువ ప్రీతి. ఈ పుష్పాన్ని నేరుగా కాక,మంత్రపూతం చేసి సమర్పించడాన్నే " మంత్రపుష్ప సమర్పణ "యొక్క అర్ధం.

పుష్పం అంటే " ఐదు" అని గూడా నిగూఢార్థం వుంది. అందుకే "పుష్పోత్సవం" అంటే ఐదు రోజులు జరుగు ఉత్సవాలని అర్ధం వచ్చింది. "ఐదు" - అనంగానే పంచ జ్ఞానేంద్రియాలు గుర్తుకు రావాలి. మంత్రపుష్పాన్ని సమర్పించడం అంటే "మనలోని పంచేంద్రియ ప్రవృత్తులను సంధానించే మనస్సును మంత్రాలతో నియంత్రించి సమర్పణ చేయడం" అని అర్ధం.పూజలో పుష్ప సమర్పణ అంటే - ఇంతటి అర్ధం ఉందని గ్రహించాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాహ్యంగా పుష్పాలను సమర్పించడం జరగాలి. ఈ అంతరార్ధం తెలియక పుష్పాలను సమర్పించడం లో ఎవరెవరి అర్ధబలాన్ని, అంగ బలాన్ని బట్టి వారు వారు వారి స్థాయిని బట్టి పుష్పాలకై ధనాన్ని, శక్తిని, కాలాన్ని వెచ్చిస్తూ వుంటారు.

ఎన్నో విధాల కష్టపడి పుష్పాల కోసం, శ్రమపడి తిరుగుతారు. తమచెంతనే , తమదే అయిన మనస్సనే పుష్పాన్ని సమర్పింపకుండా ఈ రకంగా ఎంత శ్రమ పడితే మాత్రం ఏం ప్రయోజనం? అంటున్నారు, ఈ శ్లోకములో ఆది శంకరులు .

" మనః పుష్పం సమర్పయేత్ " ఇదీ ఈ శ్లోక సారాంశము.

---

Sri Mala Kameswari Seva Trust

**10. నరత్వం దేవత్వం నగ వన మృగత్వం మశకతా**

**పశుత్వం కీటత్వం భవతు విహగత్వాది జననమ్ |**

**సదా త్వత్పాదాబ్జ స్మరణ పరమానంద లహరీ**

**విహారాసక్తం చే ద్ధృదయ మిహ కిం తేన వపుషా ||**

మనస్సు పరమేశ్వర స్మరణము గలదై శివానందలహరి యందు ఓలలాడుచున్నచో దేవ, నర, కీటకాదిజన్మలలో ఏ జన్మ మెత్తినను కొదువలేదని తాత్పర్యము.

"జంతూనాం నరజన్మ ఉత్తమమ్" అనడం మానవాహంకారాన్ని తెలియజేస్తుంది. భక్తి విషయంలో గూడా ఇలా అనడం మరింత తప్పిదమే ఔతుంది. పిపీలికాది బ్రహ్మ పర్యంతం భక్తి విషయంలో ఏ జన్మ అయినా అవరోధం కాదు - అనే విషయాన్ని ఆది శంకరులు ఈ శ్లోకములో నొక్కి వక్కాణించారు. నర, దేవ, రాక్షస, నగ, మృగ, వన, పర్వత ,మశక, పశు,తరు, కీటక, విహంగ, జన్మలలో ఏ జన్మకు చెందిన జీవి అయి నప్పటికీ వచ్చే నష్టం ఏదీ లేదు. హృదయం కనుక ఈశ్వర పాదారవిందయుగళ స్మరణ అనే ప్రవాహం లో నిమగ్న మై ఆనందించడానికి ఆసక్తి కలిగినదైతే చాలు. తరించడానికి అవేమీ అడ్డుకావు.

ఉదా : సాలెపురుగు (కీటకం), సర్పము లేదా కాళము , ఏనుగు (పశువు) ఈ మూడూ కూడా ఈశ్వరుని ఆరాధించి, అర్చించి ఈశ్వర క్షేత్రాన్ని తమ పేర్లతోనే "శ్రీ కాళహస్తి" అనే పుణ్యక్షేత్రంగా విరాజిల్ల చేసిన సంగతి తెలిసిందే కదా!

భక్తి కి కావాల్సింది నిరంతర ఈశ్వరాయత్తమైన హృదయం గాని నజరు గొలిపే నాణ్యమైన జన్మలు కాదు. రమణీయమైన ఆకృతులు కాదు" అని ఈ శ్లోక సారాంశము.

---

Sri Maha Kameswari Seva Trust



Sri Ma

**11. వటు ర్వా గేహీ వా యతిరపి జటీ వా తదితరో**

**నరో వా యః కశ్చి ద్భవతు భవ కిం తేన భవతి |**

యదీయం హృత్పద్మం యది భవ దధీనం పశుపతే

తదీయ స్త్వం శంభో భవసి భవభారం చ వహసి .

శివా ! ఏయే వర్ణముల యందున్నను, ఏ యాశ్రమ మందున్నను, ఎన్నెన్ని జడలు పెంచుకొన్నను ఎంతవాడైనను సరే ఈశ్వర భక్తి లేనిదే లాభ మిసుమంతయును లేదు.

హృదయపద్మము నందు నిన్ను ధ్యానించుచు మనస్సును నీయందర్పించి భజించు వానికి వాని భారమంతయు నీపై వేసికొని కాపాడుదువు.

మానవ జన్మను 1. బ్రహ్మ చర్యాశ్రమం 2. గృహస్థాశ్రమం 3. వానప్రస్థాశ్రమం

4. సన్యాసాశ్రమం - అని నాలుగు విభాగాలుగా విభజించారు.

వివాహం కానంత వరకు వున్న కాలాన్ని బ్రహ్మచర్యాశ్రమ కాలంగాను, వివాహానంతరం సంసారం సాగించే దశను గృహస్థాశ్రమ కాలం గాను వృత్తి నిర్వహణానంతరం జరిగే జీవన కాలాన్ని వానప్రస్థాశ్రమ కాలంగాను, చిట్టచివరకు సంపూర్ణ వైరాగ్య స్థితిలో ఉండే దశను సన్న్యాసాశ్రమ కాలం గాను నిర్ణయించారు.

ఈ నాలుగు ఆశ్రమాల్లో చిట్ట చివరిదైన సన్న్యాసాశ్రమం భక్తికి, యోగాభ్యాసానికి విశిష్ట మైనదిగా చెప్తుంటారు. కానీ, ఈ శ్లోకములో ఆది శంకరులు ఆ విషయానికి ప్రాధాన్య మివ్వలేదు. ఏ ఆశ్రమంలో అయినా మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు గూడా ఉంటారు. మనిషి మంచితనాన్ని వారున్న ఆశ్రమాలను బట్టి నిర్ణయించ కూడదు. ఈ లోకంలో "సంసారం చేసే సన్న్యాసులు, సన్న్యాస స్థితిలో వుండే సంసారులు, బ్రహ్మచర్య కాలంలో గృహస్థాశ్రమ ధర్మాలను పాటించేవారు, గృహస్థాశ్రమంలో బ్రహ్మచర్యం పాటించేవారు" గూడా ఉంటారు.

భక్తి విషయంలో ఆశ్రమంతో సంబంధం లేదు. ఫలాని ఆశ్రమమే ఉండాలనే నిబంధన లేదు.గడ్డం, మీసాలు పెంచినంత మాత్రాన, కాషాయాంబర ధారి అయినంత మాత్రాన ఆవ్యక్తి సన్న్యాసి అయి తీరాలని లేదు. ఆవ్యక్తి అంతరంగాన్ని బట్టి, స్వభావ సౌశీల్యాదులను బట్టి నిర్ణయించాలి గాని బాహ్యమైన రూపాన్ని బట్టి, వేషధారణను బట్టి నిర్ణయించ కూడదు.భక్తి విషయంలో ఈ విషయం మరింత స్పష్టం.

ఏ ఆశ్రమానికి చెందిన వ్యక్తి అయినా అతని హృదయం పరమేశ్వరుని అధీనమై వుంటే ఆ పరమేశ్వరునితో సంబంధం ఏర్పడి ఆ వ్యక్తి ఉద్ధరింప బడడం తథ్యం. హృదయం పరమేశ్వర భక్తితో పరిపూర్ణమై ఉండడమే దైవానుగ్రహానికి

Sri Maha Kameswari Seva Trust

అర్హత గాని ఆశ్రమ, వేషధారణ, బాహ్య పటాటోపాలు కాదు అని ఈశ్లోక సారాంశం.

ప్రహ్లాద, మార్కండేయ, ధ్రువుల వంటి బాలురు, అంబరీష, పోతన, త్యాగయ్య, అగస్త్య, వశిష్టాదుల వంటి గృహస్థ ఋషీశ్వరులు గూడా తరించారంటే కేవలం భక్తి వల్లనే గాని ఆశ్రమ ఆధిక్యం,వేషం వైవిధ్యాల వల్ల కాదుకదా !

---

**12. గుహాయాం గేహే వా బహిరపి వనే వా2ద్రి శిఖరే**

**జలే వా వహ్నౌవా వసతు వసతేః కిం వద ఫలమ్ |**

**సదా యస్త్యేవాంతః కరణమపి శంభో తవ పదే**

**స్థితం చే ద్యోగో2సౌ స చ పరమయోగీ స చ సుఖీ ||**

పర్వత గుహలు,అరణ్యములు మొదలగు వాని యందు నివాసము చేసినంత మాత్రాన ఫలమేమియు లేదు. అంతఃకరణము గూడ ఈశ్వర ధ్యానము నందు నిలిపి, తదేక నిష్ఠాగరిష్టుడై యున్నచో శివ యోగియై పరమానందము నొందును.

ధ్యానము, అర్చన, తపస్సు మొదలైన వాటికి ఒక పవిత్ర మైన ప్రదేశం ఉండడం మంచిదే కాని, అందుకు ఫలానా ప్రదేశమే ఉండి తీరాలి అని లేకపోతే ధ్యానము మొదలైనవి కుదరవు అని వాటినిమానడం మాత్రం మంచిదికాదు. (ఇది వాటిని ఎగ్గొట్టే వాడి లక్షణాన్ని తెలుపుతుందే కాని "శాస్త్ర ప్రకారమే చేసేవాడు" అని అనిపించుకోదు) ఇంటిలోపల అయితే అందరి వద్దా ఆటంకాలు, అవరోధాలు కలుగుతాయి కాబట్టి కొండగుహ లైతే నయమని అంటారు. జనసంచారం లేని అరణ్యప్రాంతమైతే ఇంకా నయమని అంటారు. ఇంకా నీటిలో అయితే మరీనయమనీ అంటుంటారు. ఇవన్నీ తన నిష్టను, ఓర్పును, గొప్పతనాన్ని నలుగురికీ తెలియపరిచేందుకే! కాని ఎక్కడ ఉండి అయినా, ఎప్పుడైనా మనస్సును స్థిరంగా ఆ శివుని పాదారవిందాల మీద నిలపాలి, అనే ఒక్కనియమమే ముఖ్యం గాని ఇతర నియమాలు ముఖ్యం కాదు.

Sri Maha Kameswari Trust

శివా పాదలయము గాని మనస్సుతో ఎన్ని కఠోర నియమాలు పెట్టుకొని ఆచరించినా ప్రయోజనం వుండదు. ఫలితం దక్కదు,అని ఈ శ్లోక సారాంశము.

---

**13. అసారే సంసారే నిజభజనదూరే జడధియా**

**భ్రమంతం మామంధం పరమ కృపయా పాతుముచితమ్ |**

**మదన్యః కో దీనస్తవ కృపణ రక్షాతి నిపుణః**

**త్వదన్యః కో వా మే త్రిజగతి శరణ్యః పశుపతే ||**

మహాదేవా ! ముల్లోకము లందును దీనరక్షా పరుడవు నీ వొక్కడవే గలవు. నేనును సంసార తాపము లను సహింపలేక దీనుడనై నీవే దిక్కుగా నీ పాలబడి యున్నాను. నాలాంటి దీను లింకెందును కానరారు. కనుక దయ చూపి ఆత్మజ్ఞాన మొసగి యీ దీనుని సంసారతాపముల నుండి రక్షింపుము.

గృహస్థాశ్రమ ధర్మాన్ని సరిగా అర్థం చేసుకోలేక, సంసారం అంటే అర్థమే తెలియక గృహస్థాశ్రమాన్ని, సంసారాన్ని తమ సాధనకు, తమ ఆధ్యాత్మిక చింతనకు అడ్డు పడేవిగా అపార్థం చేసుకుని తిట్టుకుంటూ దైన్యమైన జీవితాన్ని గడుపుతూ ఉండేవారు కొందరుంటారు. సంసారాన్ని చేసిచేసి శాశ్వతానందాన్ని ఇచ్చే సుఖం లభించదని తెలుసుకొని - సంసారాన్ని నిస్సారంగా భావించేవారూ వుంటారు.

భగవదారాధనకు, ఆధ్యాత్మిక చింతనకు దూరం చేసిన సంసార సుఖంలో పడి ఇంత వరకూ తాము గ్రుడ్డివారుగా బ్రతికామనే భావన కలుగు తుంది. తపన చెంది ఆలోచించి నప్పుడు దీనజన బాంధవుడైన పరమేశ్వరుడు ముందుగుర్తుకు వస్తాడు. దీనులను రక్షించే స్వభావము ఒక్క భగవంతుని కి తప్ప ఇతరులకుండదు. ఆయన రక్షణకు దీనత్వమే అర్హత గాని మిగిలినవి కావు. "ముజ్జగాల్లోనూ ముక్కంటిని మించిన ముక్తి ప్రదాత, ఆది దేవుని మించిన ఆత్మ జ్ఞాన ప్రదాత మరొకరు లేరని" ఈ శ్లోకమందు ఆది శంకరులు నొక్కి వక్కాణించారు.

---

Sri Maha Kameswari Seva Trust

**14. ప్రభుస్త్వం దీనానాం ఖలు పరమబంధుః పశుపతే**

**ప్రముఖ్యో2హం తేషామపి కిముత బంధుత్వ మనయోః |**

**త్వయైవ క్షంతవ్యాః శివ మదపరాధాశ్చ సకలాః**

**ప్రయత్నాత్కర్తవ్యం మదవన మియం బంధుసరణిః |**

ఓ పరమేశ్వరా ! నీవు దీన బంధుడవు. నేను దీనుడను. ఇంక మనకు బాంధవ్యము గలదని వేరుగా చెప్పనక్కర లేదు కదా! కనుక నా తప్పులన్నియు మన్నించి తప్పక నన్ను నీవే దయతో రక్షింప వలసి యున్నది. ఇదియేకదా బంధువుల పద్ధతి.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి ఒక్కొక్కప్పుడు తన, మన, పర అనే భేదాలను చూడడం గూడా లోక సామాన్యం. ముందు - తనకు, తనకు సంబంధించిన వారు - ఆ తర్వాతనే ఇతరులు - అనే లోక సామాన్య వ్యవహారాన్ని గూడా గుర్తు తెచ్చుకుని ఆది శంకరులు ఈ శ్లోకములో తనకూ పరమాత్మకు గల చుట్టరికాన్ని దృష్టి లో పెట్టుకొని ప్రార్థించారు.

శివుడు దీనజన బాంధవుడు. భక్తుడైన వాడు దీనాతిదీన స్థితిలో ఉన్నప్పుడు ముందుగా ఆ దైవానికి ఆ భక్తుని కాపాడాల్సిన బాధ్యత ఉంటుంది కదా ! కాబట్టి తెలియక కొన్ని పొరపాట్లు చేసినా అయిన వారిని కాపాడడం లోక సహజం. దగ్గరగా ఉన్న దీన భక్తులను వదిలి దూరంగా ఉన్న వారి నెవరినో ఉద్ధరించడం గూడ అంత సమంజసం కాదు గదా! అనే తర్కంతో శంకరులు ఈ శ్లోకములో శివుని ప్రార్థించారు.

---

**15. ఉపేక్షా నోచేత్కిం న హరసి భవద్ధ్యాన విముఖాం**

**దురాశా భూయిష్టాం విధిలిపి మశక్తో యది భవాన్ |**

**శిర స్తద్వైధాత్రం న నఖలు సువృత్తం పశుపతే**

**కథం వా నిర్యత్నం కరనఖముఖేనైవ లులితమ్ ||**

Sri Mahakameswari Seva Trust

సాంబశివా ! దుష్టమైన ఆలోచనలతో నిన్ను ధ్యానించుట యందు గూడా ఆసక్తిని కలుగునట్లు చేయుటకు సూచకముగా నా నుదుట బ్రహ్మ వ్రాసిన వ్రాతను ఉపేక్షింపక తుడిచివేయుము. నా చేత గాదని తప్పించు కొనుటకు వీలులేదు. ఆ బహ్మదేవుని ఐదవ తలను నీ కొనగోటితోనే త్రుంచితివిగదా !

వారి వారి పుణ్య పాప కృత్యాలను అనుసరించి అనుభవించ వలసిన కర్మ ఫలాలను ఆయా జీవుల నొసటి మీద బ్రహ్మ వ్రాస్తాడని, దానినే "బ్రహ్మ లిఖితం " అని, దీనికి తిరుగు లేక ఎంతటి వాడైనా అనుభవించి తీరవలసినదేనని అంటారు.-

" ప్రారబ్ధం భోగతో నస్యేత్ " ప్రారబ్ధాన్ని అనుభవిస్తేనే తీరుతుంది. "విధిరేవ గరీయసీ" ఇలాంటి మాటలు వింటూ ఉంటాం. కాని నిదానించి ఆలోచిస్తే ఈ బ్రహ్మ లిఖితం ఉల్లంఘింపబడిన సందర్భాలు గూడా ఉన్న ట్లు తెలుస్తుంది.

ఈ బ్రహ్మవ్రాత భగవద్భక్తులు కాని వారి విషయంలోనే గాని భగవద్భక్తుల విషయంలో వర్తించదేమోనని అనిపించే సందర్భాలున్నాయి.

మార్కండేయునికి బ్రహ్మ లిఖితం ప్రకారం 16 ఏళ్ళు ఆయుర్దాయం. కాని, శివుని కరుణ వలన చిరంజీవి అయాడు గదా! సత్యవంతుడు సతీసావిత్రి పాతివ్రత్య మహిమ వలన చనిపోయి గూడా ప్రాణాలను తిరిగి తెచ్చుకుని బ్రతికాడు కదా !


ఈ శివానందలహరి స్తోత్రాన్ని రచించిన ఆది శంకరులు గూడా బ్రహ్మలిఖితం ప్రకారం 8 ఏళ్ళ ఆయుర్దాయం అయినా సన్యసించి 8 ఏళ్ళు, వ్యాసుల వారి కరుణ వలన మరో 16 సంవత్సరాలు పొంది మొత్తం 32 సంవత్సరాలు బ్రతికారు కదా ! ఈ విధమైన సందర్భాలున్నాయి కాబట్టి - శంకరులు "శివుని కరుణ ఉండాలే గాని బ్రహ్మ లిఖితం ఏం చేస్తుంది - అని ధీమాగా ఈ శ్లోకములో చెప్పారు.

ఎందుకంటే -బ్రహ్మవ్రాత లాంటి కోర్టు శిక్షలు గూడా " మెర్సీ పిటీషన్ " ద్వారా రద్దు కాబడిన సందర్భాలు ఉన్నాయి గదా!

" అయినా బ్రహ్మ ఐదవతలనే అవలీలగా గోటితో త్రుంచిన శివునికి ఆ బ్రహ్మ వ్రాతను చెరపడం ఏమంత కష్టం ? అని శంకరుల వాదన.

---

Sri Maha Kameswari Seva Trust



**16. విరించి ర్దీర్ఘాయుర్భవతు భవతా తత్పరశిర**
**శ్చతుష్కం సంరక్ష్యం స ఖలు భువి దైన్యం లిఖితవాన్ |**
**విచారః కోవా మాం విశదకృపయా పాతి శివ తే**
**కటాక్ష వ్యాపారః స్వయమపి చ దీనావనపరః ||**

శివా ! బ్రహ్మ మా ముఖమందు దైన్యము వ్రాయుచున్నాడు. అది మాకుపకారముగా నున్నదిగాని విచారకరము గాదు. అందువలననే కదా దీన పోషకమగు మీ కటాక్షమునకు పాత్రులమగు చున్నాము. అయినదేమో అయిపోయినది. పోనిమ్ము. ఇంకా నాతని నాల్గు తలలు మాత్రముఛేదింపకుము ఆ బ్రహ్మ దీర్ఘాయుష్మంతు డగుగాక!

క్రిందటి శ్లోకములో బ్రహ్మ వ్రాతను తుడిచి కర్మఫలాను భవాలనుండి రక్షించమని ప్రార్ధించిన శంకరులు ఈ శ్లోకములో బ్రహ్మ మా లలాటం పై ఏ వ్రాతలు వ్రాసినా ఫర్వాలేదు. ఆయన ఇష్ట మొచ్చినట్లు వ్రాసుకోనీ, మాకేం నష్టం లేదు అంటున్నారు. ఇదేమిటి బ్రహ్మ వ్రాతనే లెక్క చేయనంత ధైర్యం ఇంతట్లోనే ఎక్కడ నుండి వచ్చింది? ఎలా వచ్చింది ? అన్నదానికి సమాధానమే ఈ శ్లోకము.

ఎట్లాంటి వారి దైన్యాన్ని అయినా దూరం చేసి దీనుల్ని రక్షించే దీనజన రక్షకుడవైన నువ్వున్నావు. పైగా దీనుల్ని రక్షించడంలో శత్రుమిత్ర భేదం గాని, దేవాసుర భేదం గాని, ఆస్తిక నాస్తిక భేధం గాని నీకు లేదు. వృక్షాలు, వాయువు, చంద్రుడు, సూర్యుడు, మేఘాలు మొదలైనవి స్వపర భేదం లేకుండా తమ తమ వంతు సహకారాలను అందరికీ ఎలా అందిస్తున్నాయో - అలాగే నువ్వు దీనుల్ని రక్షించి వారి తల వ్రాతల్నే మార్చివేస్తున్నావు ఇంక మాకేం భయం? ఆ బ్రహ్మ మా నొసటి మీద తన ఇష్టం వచ్చినట్లు ఎలా వ్రాసుకుంటే మాకేం - వ్రాసుకోనీ. మీ బిడ్డల నొసటి పై దైన్యాన్ని లిఖిస్తున్నందుకు శివా! నువ్వు కోపంతో ఆ బ్రహ్మకు మిగిలిన నాలుగు తలలను మాత్రం త్రుంచకు. మమ్మల్ని రక్షిస్తున్న ట్లే - ఆ బ్రహ్మ కు కూడా చిరాయువును ప్రసాదించు - అని, " అపకారికి నుపకారము నెపమెన్నక చేయు వాడు నేర్పరి సుమతీ" - అనే ఉపదేశాన్ని గూడా ఈ శ్లోకములో సూచించారు.

Sri Mahakameswari Seva Trust

**17. ఫలాద్వా పుణ్యానాం మయి కరుణయా వా త్వయి విభో**

**ప్రసన్నే2పి స్వామిన్ భవదమల పాదాబ్జ యుగళమ్।**

**కథం పశ్యేయం మాం స్థగయతి నమస్సంభ్రమజుషాం**

**నిలింపానాం శ్రేణి ర్నిజకనక మాణిక్య మకుటైః ।।**

నా పుణ్యము వలననో నీ దయచేతనో, నీవనుగ్రహించిన ననుగ్రహింతువుగాని - నీ పాదారవింద సందర్శన మగుట యెట్లు? దేవతలందరును గుంపులు గుంపులుగా గూడి నేను నేనని నమస్కరించుటకు సంతోషముతో తొందరపడుచు వారి రత్నాల కిరీటములను మీ పాదముల యందు మోపుచు నాకడ్డ మగుచున్నారు.

పూర్వ జన్మ సుకృతం వుండి ,ఆ పుణ్యం పండి, నీ కరుణ కలిగి నువ్వు ప్రసన్నుడవైనా - నీ పాద పద్మ దర్శనం కలగడం అంత సులభ సాధ్యమైన విషయంగా అనిపించడం లేదు.ఎందుకంటే - ఆ పాదాలకు అన్ని వైపుల నుండి పెద్ద పెద్ద దేవత లందరూ - కేయూర మకుట కుండల కిరీట ధారులై " నేను ముందు నేను ముందు " అంటూ సాష్టాంగ పడుతుంటే - ఇక అతి సామాన్యుడనైన నేను ఆ పాదాల వద్దకు ఎలా రాగలను? కనీసం పాదాలను చూడటానికి కూడా కుదరదు. అంతటి మహద్భాగ్యం కలిగేంత వరకు ఆర్తితో ఎదురు చూడ వలసినదే! చూస్తాను. (ఆ భాగ్యానికి నోచుకోవాలంటే నిరీక్షణ తప్పదు. నిరాశ నిస్పృహలు పనికిరావు అని అర్థం)

పాదాలనే ఎందుకు చూడాలి? అంటే ఆ పాదాలు ధర్మాచరణ కోసం చరించేవి కాబట్టి - భక్తిలో పాదాలకే ఎక్కువ ప్రాధాన్యం.( చరణ శరణాగతి అన్నారు కాని హస్త శరణాగతి,ముఖ శరణాగతి - ఇలా అనలేదు)

చివరకు బలి చక్రవర్తి కూడా ఆ పాదాన్నే తన శిరస్సుపై పెట్టమని కోరాడు. అవి పరమపదాన్నిచ్చే పాదాలు అని తెలుసుకోవాలి.

Sri Maha Kameswari Seva Trust

**18. త్వ మేకో లోకానాం పరమఫలదో దివ్యపదవీం**

**వసంత స్త్వన్మూలాం పునరపి భజంతే హరిముఖాః |**

**కియద్వా దాక్షిణ్యం తవ శివ మదాశా చ కియతీ**

**కదా వా మద్రక్షాం వహసి కరుణా పూరిత దృశా||**

ఆనంద స్వరూపుడవైన ఓ దేవా! మోక్షమిచ్చు మహాను భావుడవు నీ వొక్కడివే ! విష్ణ్వాదులు నీ దయ చేతనే వైకుంఠ వాసులైరి. అయ్యును తనివి నొందక నీవలన ఉన్నత పదవులను గోరుచునే యుందురు. ఆహా! భక్తులమీద నీ కెంత దయ! నా యాశ యెంతని చెప్పుదును. సంపూర్ణ కటాక్షముతో నా అహం భావమును పోగొట్టిరక్షింపుము.

భగవంతుణ్ణి ఆరాధించడంలో కూడా వివిధమైన పద్ధతు లున్నాయి."ఆర్తో, జిజ్ఞాసు, రర్థార్థీజ్ఞానీచ భరతర్షభ" అన్నాడు గీతాచార్యుడు. గజేంద్రుడు తనకు వచ్చిన ఆపద నుండి కాపాడమని అర్థించిన ఆర్తుడు, ఉద్ధవుడు కృష్ణత్త్వం తెలుసు కోవాలను కున్న జిజ్ఞాసువు. సుగ్రీవుడు వాలి వధను, కిష్కింధాధి పత్యాన్ని ఆశించిన అర్థార్థి . ఏదీ ఆశించకుండా నిష్కారణంగా, నిష్కామంగా ఆనందానుభూతితో హరినామస్మరణ చేసిన ప్రహ్లాదుడు జ్ఞాని.

(అందుకే భక్తుల వరుసలో ప్రహ్లాదుడు మొట్టమొదట నిలిచాడు) ఇలా ఎంతోమంది ఎన్నో రకాలుగా ఆరాధిస్తే వాళ్ళ వాళ్ళ భక్తికి తగినట్లుగా భగవంతుడు వాళ్ళను అనుగ్రహిస్తాడు.

సకామ భక్తికి దేవతలు అష్టైశ్వర్యాలతో సర్వాధి పత్యాన్ని గూడా పొందారు.

ఈ శ్లోకములో శంకరులు తనకు అటువంటి అసంతృప్తి కరమైన భోగభాగ్యాలు, అధికార సార్వ భౌమత్వాలు, చివరకు ముక్తి ఫలాన్ని కూడా అక్కరలేదని - కేవలం నీ "పాదసేవాభాగ్యాన్ని మాత్రమే ప్రసాదించు అదే నాకు చాలు" అని శివుణ్ణి వేడుకున్నారు .

అంటే - ఏ ఒక్కటి ఉంటే ఇంకా కోరవలసినవి, కావలసినవి, పొందవలసినవి మిగిలి ఉన్నాయనే అసంతృప్తి ఉండదో అటువంటి భగవత్పాద సేవా తత్పరతను మాత్రమే కోరుకోవాలని ఆ ఒక్కటీ ఉన్నప్పుడు అన్నీ ఉన్నట్లే అని శంకరుల అభిప్రాయము.

---

Sri Maha Kameswari Seva Trust

**19. దురాశాభూయిష్ఠే దురదిప గృహద్వార ఘటకే**

**దురంతే సంసారే దురితనిలయే దుఃఖ జనకే |**

**మదాయాసం కిం న వ్యపనయసి కస్యోపకృతయే**

**వదేయం ప్రీతిశ్చేత్తవ శివ కృతార్థాః ఖలు వయమ్ ||**

శివా ! దురాశల చేత దుష్ట ప్రభువుల గృహ ద్వారముల యందు పడి కొట్టుకొనుచు పలు దుఃఖముల పాలు గావలసిన తుది లేని సంసార మందలి నా పరిశ్రమల నేల నశింపజేయవు? నీ భక్తుడుగా నున్న బ్రహ్మదేవుని మీది వాత్సల్యము చేత నాతని చేతలు పోగొట్టుటకు ఇష్టపడకున్నావు కాబోలు. నీవు భక్త వత్సలుడ వయినప్పుడు నీ భక్తులమైన మాకేమి లోపము ? నిన్ను భజించి మేమును కృతార్థుల మగుదుము కదా!

పంచ భూతాత్మకమైన ప్రపంచంలో పంచ భూతాత్మిక మైన శరీరంతో పుట్టిన ప్రతి వ్యక్తికి పంచ జ్ఞానేంద్రియ కార్యాలుంటాయి. బరువుబాధ్యతలనే పేరుతో సంసార బాధ్యతలు కూడా వుంటాయి. వాటి నిర్వహణలో ఒక్కొక్కప్పుడు చేయకూడని పనులు కూడా చేయవలసి రావచ్చును. అధికార మదాంధుల ఆజ్ఞలకు లోబడి ఎన్నో ఇబ్బందులు పడుతూ పాప కార్యాలను చెయ్యవలసి వస్తుంది. వాటిని ఇవిపూర్వకర్మ ఫలాలని చెప్పుకుంటూ అనుభవించడం, మళ్ళీ

రాబోయే జన్మకు పునాది వేసుకోవలసిరావడం - ఇలా జరుగతూ ఉంటుంది. ఇంతటి శ్రమతో కాలుష్యంతో నిండి వుండే ఈ సంసార లంపటత్వం నుండి నన్ను కాస్త దూరంచేసి ముక్తిని ప్రసాదించమని శంకరులు అడుగుతున్నారు. అయితే - ఇలా అనుభ వించా ల్సిన గతిని మా నుదిటి మీద వ్రాసిన బ్రహ్మదేవుడు నీకు భక్తుడై పోయాడు. అందువలన ఆ భక్తుని పై వాత్సల్యముతో ఆయన వ్రాతల్ని, చేతల్ని పోగొట్టడం ఇష్టం లేక మా బాధల్ని చూస్తూ గూడా ఊరుకున్నావు. అంతేనా?అయినా నీవు అంతటి భక్త వత్సలుడి వైనప్పుడు మేమూ నిన్ను భజించి, నీవాత్సల్యాన్ని పొంది ఈ సంసార లంపటత్వం నుండి విముక్తులమౌతాము. భక్తవత్సలుడవు నువ్వుండగా ఇంకా

Sri Maha Kameswari Seva Trust

మాకేం భయం? అని - భగవంతుని ముందర కాళ్ళకు బంధం వేశారు ఆది శంకరులు.

---

**20. సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ**
**నటత్యాశాశాఖా స్వటతి ఝటితి స్వైరమభితః ।**
**కపాలిన్ భిక్షో మే హృదయకపి మత్యంత చపలం**
**దృఢం భక్త్వా బద్ధ్వా శివ భవదధీనం కురు విభో ।।**

శివా! ఆది భిక్షుకా! నా మనస్సను కోతి సంసారా రణ్యము నందు చంచలముగా స్వైరవిహారము గావించు చున్నది. యువతుల యందు ఆటలాడుచున్నది. ఆశలనియెడు కొమ్మలను పట్టి దుముకుచున్నది.అన్నిమార్గములలో తిరుగాడుచున్నది. ఇంక లాభము లేదు. దృఢమైన భక్తి అనెడి గట్టి త్రాటితో బంధించి నీ అధీనములో నీవే పెట్టు కొనుము.

శివానందలహరి లోని ఈ20 వ శ్లోకం చాల ముఖ్యమైనది. మనిషి లోని లోపాలను చెప్పుతూనే ఆ లోపాలనుండి బయటపడే మార్గాన్ని గూడా ఈ శ్లోకములో శంకరులు చెప్పారు.

"మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అన్న దానిని బట్టి మనిషి పతనానికి అయినా, బ్రహ్మపదసిద్ధికి అయినా మనిషి మనస్సే కారణం. అటువంటి మనిషి మనస్సును ఒక కోతితో పోల్చారు శంకరులు. కోతి ఒకచోట నిలకడగా స్థిరంగా వుండదు. చపలత్వం ఎక్కువ. మనస్సు గూడా అంతేకదా! మనిషి కుండే మోహాన్ని ఒక అరణ్యంతోపోల్చారు. దట్టమైన వృక్షాలతో, లోయలతో, వన్య మృగాలతో నిండి ఉండేది అరణ్యం. మనిషి మనసు కామ, వ్యామోహ, మమకారాలతో నిండి ఉంటుంది. విషయ వాసనల ప్రభావం మూలంగా వాటినుండి లభించే తాత్కాలిక సంతృప్తి కోసం వివిధ విషయాల్లోకి వెళ్ళి ఇరుక్కు పోతూ ఉంటుంది. ఇలా ఇష్టమొచ్చినట్లు స్వైర విహారం చేస్తూ ఎంత చెప్పినా మాట వినని మనస్సనే కోతిని నియంత్రించి చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి ఒక చక్కని ఉపాయం తట్టి - శివుని తోనే ఒక విచిత్రమైన ఒప్పందం చేసుకున్నారు శంకరులు.

Sri Maha Kameswari Seva Trust

శివా! నిన్ను చూడగానే నా మనోమర్కటాన్ని అదుపులో పెట్టుకోవడానికి ఒక ఉపాయం తట్టింది. నువ్వు ఎలాగూ రోజూ పుఱ్ఱెను చేత్తో పట్టుకునిబిక్షానికి గడప గడపకు వెళ్తావు కదా! అలా వెళ్తే నిన్ను పెద్దగా పట్టించుకొనే వారు చాలా తక్కువ మంది ఉంటారు. అప్పుడు నీకు కడుపు నిండా సరిపోయే భుక్తి దొరకదు. నీవు ఇళ్ళకు వెళ్తున్నప్పుడు నీతో పాటు ఒక కోతిని కూడా తీసుకొని వెళ్ళు.అప్పుడు ఇంట్లో ఉన్న పెద్ద వాళ్ళు అంతగా పట్టించుకోక పోయినా చిన్నపిల్లలు తప్పకుండా బయటకు వచ్చి నీ దగ్గరున్న కోతి చేష్టలుచూసిఆనందిస్తారు. తమ పిల్లలను ఆనంద పరచి నందుకు కృతజ్ఞతతో ఏదో కొంత నీకు ముట్టచెబుతారు. మరి కోతి ఏదీ? అని అడుగుతావా,నా దగ్గర సిద్ధం

గా ఉంది. నా మనస్సే ఆ కోతి. అలా చేశావంటే ఉభయ తారకంగా ఉంటుంది - నీకూ కాస్త బిక్షం ఎక్కువ గిట్టుబాటు అవుతుంది నాకూ దీని వల్ల వచ్చే నానా తిప్పలు తప్పి కాస్త ప్రశాంతత చేకూరుతుంది.

అయితే వెంటనే పంపించు అంటావేమో, ఇది చాలా మొండిది. వెంట వచ్చినట్లే వచ్చి వీలు చూసుకుని మళ్ళీ నా దగ్గరికే వచ్చేస్తుంది. అందుకని దీన్ని ఒక గట్టి త్రాటి తో గట్టిగా కట్టి ఆ త్రాటి రెండవ కొసను నీ చేత పట్టుకొని నీ ఆధీనంలో పెట్టుకొని వెళ్ళు. మరి గట్టి త్రాడు ఎక్కడి నుండి తెద్దాం ? అంటావా అదీ సిద్ధం గానే వుంది. నీమీద నాభక్తి అనే ధృఢమైన త్రాటిని గట్టిగా కట్టి నా మనస్సనే కోతిని నీ అధీనంలో నువ్వే పెట్టుకో.

నీకు నేను- నాకు నువ్వు ఒకరికొకరు ఇలా సహాయం చేసుకోకపోతే మనిద్దరికీ ఇతరులెవరైనా ఎందుకు సహాయం చేస్తారు చెప్పు - అని శివునికే ఉపాయం చెప్పి తను అపాయం నుండి బయట పడ్డారు.

మనస్సు అనేది కోతి వంటిదే! దాన్ని అదుపులో పెట్టుకోవడం అంత తేలికైన పని కాదు. శివపరమైన భక్తిని జోడిస్తే కానీ మనో మర్కటానికి కళ్ళెం పడదు. అది గూడా మన ప్రయత్నం వల్ల జరిగే పనికాదు, ఆ శివుడే తన అధీనంలో పెట్టుకొని మనకు విముక్తిని కలిగించాలి" అని శంకరులు అభిప్రాయపడి మనకు ఈ ఉపాయం చెప్పారు.

Sri Maha Kameswari Seva Trust



21. ధృతి స్తంభాధారాం దృఢగుణ నిబద్ధాం సగమనాం
విచిత్రాం పద్మాఢ్యాం ప్రతిదివస సన్మార్గ ఘటితామ్ |
స్మరారే మచ్చేతః స్ఫుటపటకుటీం ప్రాప్య విశదాం
జయ స్వామిన్ శక్త్యా సహ శివగణైస్సేవిత విభో ||

కామ జయము కల్గి సర్వ స్వతంత్రుడవును,సర్వ వ్యాపకుడవును పరమానంద స్వరూపుడవునగు నో పార్వతీవల్లభా! నాచిత్త మిపుడొక గుడారముగా నున్నది.నా మనః కుటీరము

విషయ నిత్యత్వావధారణ మనెడు నిట్రాటి పైని నిలిచియున్నది. గుడారము త్రాళ్ళతో గట్టబడి నిలుపబడు నట్లు చిత్తము త్రిగుణముల వలన జనించిన దేహాదులతో నిలుపబడి యున్నది. గుడారమెక్కడకు గావలసిన నచ్చటకు గొనిపోబడినట్లు ఈ చిత్త మచ్చటచ్చటకు గొనిపో బడును. గుడారము పలు రంగులతో, పద్మముల వంటి చిత్రములతో నుండునట్లు నా చిత్తము బహు విధములగు చిత్రవిచిత్రము లగు జన్మాంతర వాసనలతో కూడి సంపదను గోరుచున్నది. మరియు బ్రహ్మ విచారము నందు గూర్ప బడి యున్నది. ఇట్టి నా చిత్త కుటీరమందు శక్తితో గూడ నివసించి యుండుము.

క్రిందటి శ్లోకంలో చిత్తాన్ని పూర్తిగా ఈశ్వరాధీనానికి వదిలినట్లు, తనకింక తన చిత్తం పై మమకారం అధికారం లేనట్లు ఆది శంకరులు చెప్పారు. చిత్తాన్ని శివపరం చెయ్యవచ్చు గానీ, ఆ చిత్తం శివుడు ఉండటానికేమన్నా సదుపాయంగా వుంటుందా అన్నదానికి ప్రస్తుత శ్లోకంలో ఆ చిత్తం ఎలాంటిదో చెబుతున్నారు.

శివుడు ఇల్లు,వాకిలి లేని వాడిగా ఉండాల్సిన పని లేదుట.ఆయన హాయిగా వసించడానికి తగ్గ గుడారం తనవద్ద ఉన్నదంటున్నారు శంకరులు. ఏవిధమైన వికారాలు లేనిది అంటే బాహ్యమైన ఒత్తిళ్ళకు, బలాలకు ఏమాత్రం పాడవనిది,స్థిరత్వాన్ని , దృఢత్వాన్ని కలిగి ఉండే విధంగా త్రిగుణాలనే గట్టి త్రాళ్ళతో చెక్కుచెదరని ధైర్యమనే నిట్రాతిని ఆధార స్తంభంగా కలిగి ఉన్నదట.

పైగా ఒకేచోట ఉండవలసిన అవసరం లేకుండా ఋతు ధర్మాల కనుగుణంగానివాసాన్ని మార్చుకోవచ్చునట. అదికూడా గాలి కన్నా వేగంగా ముందుకు సాగేది (మనోవేగంతో) అనే అర్థం "సగమనాం"అనే విశేషణం లో వుందని గుర్తించాలి.

ఈ చిత్తకుటీరాన్ని గుడ్డతో చేసిన డేరాయే కదా అని తేలిక భావంతో తీసి పారెయ్యటానికి వీల్లేదుట. రకరకాల భావాలనే రంగులతో చిత్రవిచిత్రతమైన పూర్వజన్మ సంస్కారాలనే వాసనలతో వుంటుందట.

Sri Maha Kameswari Seva Trust

ఈ కుటీరంలో అనాహత పద్మాల్లాంటివి గూడా ఉన్నాయిట. ఈ పద్మాల్లో లక్ష్మీదేవి వహిస్తూ సంపదలతో విరాజిల్లు తూ వుంటుందని

"విచిత్రం పద్మాఢ్యా " అనే విశేషణం లో గుర్తించాలి.

నిత్యం ఈ కుటీరంలో వేదాంత చర్చ, బ్రహ్మ జిజ్ఞాసకు సంబందించిన కార్యక్రమాలు రాజయోగాది మార్గాల ప్రవచనాలు జరుగుతునే వుంటాయిట. మహానుభావులు ఇష్టపడి ఉండడానికి చాలా వీలుగా అనువుగా ఈ చిత్త కుటీరం ఉంటుందని "ప్రతిదివస సన్మార్గ ఘటితామ్"- అన్న విశేషం సూచించబడుతోంది.

కామదూరుడు, కామహరుడు అయిన శివునకు పైన చెప్పిన లక్షణాలు గల తన చిత్త కుటీరం బాగా వాసయోగ్యంగా వుంటుంది - అని చెప్తూ "ఇన్ని మంచి లక్షణాలున్న నా చిత్త కుటీరంలో మాఅమ్మ పార్వతి తో గూడా కలిసి హాయిగా ఏ చీకూచింతా లేకుండా, అద్దె కూడా కట్టాల్సిన అవసరం లేకుండా ఎన్నాళ్లైనా వుండ వచ్చు. నా ప్రార్ధన మన్నించు. ఇంత ఆదరంగా ఆహ్వానించే నన్ను కాదనకు. నామాట పెడ చెవిన పెట్టకు. నన్ను అనుగ్రహించు" - అని ఈ శ్లోకములో శంకరులు శివుణ్ణి ప్రార్ధిస్తున్నారు.

---

**22. ప్రలోభాద్యైరర్థాహరణ పరతంత్రో ధనిగృహే**

**ప్రవేశోద్యుక్తస్సన్ భ్రమతి బహుధా తస్కరపతే ।**

**ఇమం చేతశ్చోరం కధమిహ సహే శంకర విభో**

**తవాధీనం కృత్వా మయి నిరపరాధే కురు కృపామ్ ।।**

కల్లబొల్లి మాటలు చెప్పి ధనికుల చిత్తమును వశపరచు కొనుట మొదలగు కొన్ని దుష్టోపాయములు పన్ని ధనాకర్షణమునకుగా ధనవంతుల ఇండ్లలో దూరుచూ తిరుగులాడుతున్న ఈ మనస్సను దొంగను నేనోర్వలేను. నీకప్పగించెదను

Sri Manikameswari Seva Trust

చోర ప్రభువగు శంకరా! ఆ దొంగను నీవు నీ వశము చేసికొని నిరపరాధినగు నన్ను దయతో రక్షింపుము.

గత శ్లోకములో తన చిత్తం మహానుభావులు నివసించేందుకు చక్కని వాస యోగ్య లక్షణాలు గల కుటీరం అని వివరిస్తూ శివుణ్ణి తన చిత్త కుటీరం లో నివాసం ఏర్పరచుకో వలసినదిగా ఆహ్వానించిన ఆది శంకరులు - ఈ శ్లోకములో వేరొక విధమైన పద్ధతిని అనుసరిస్తున్నారు.

రుద్రనమకంలో శివుడు- "తస్కరాణాం పతయే నమోనమః" అని కీర్తింప బడతాడు. భాగవతంలో శ్రీకృష్ణుడు గూడా నవనీత చోరునిగా కీర్తించబడతాడు. ఇద్దరూ కూడా దొంగలే నన్నమాట. దొంగలేమిటి, దొంగలకు నాయకులు. అటువంటి దొంగల నాయకు లకు తోటి దొంగలను అదుపు లో పెట్టుకోవడం, వారిపై అదుపు, ఆధిపత్యం ఉంటుందని ఆది శంకరులు చెప్తున్నారు. అందువల్లనే తనలోనే తిష్ఠ వేసుకొని ఉన్న మనస్సనే దొంగను దొంగల నాయకుడైన శివునికి అప్పగించి ఒడ్డున పడదామను కుంటున్నారు.

మనస్సనే దొంగ అవతలివారిని బుట్టలో వేసుకోగలిగే చాలా విద్యలు తెలిసినవాడట. సంపద ఉన్న వారివద్ద వున్నదంతా దొంగిలించే బుద్ధి కలవాడట! సమయము సందర్భము చూచుకొని అవతలి వారిని కొల్లగొట్టడానికి నానా తిరుగుళ్ళు తిరుగు తాడు ఈ మనస్సనే దొంగ. గట్టిగా మందలించి నాలుగు దెబ్బలేసి బుద్ధి చెప్పాలన్నా శరీరమే ఉండని మనస్సనే దొంగను ఎలా అదుపులో పెట్టుకోవడం? ఎలా భరించడం - అని ఎవరికైనా అనిపిస్తే తను చేసిన పనే చెయ్యమని చక్కని సలహా ఇస్తున్నారు ఆదిశంకరులు.

(దొంగను పట్టడం పక్కా దొంగ వల్లనే కుదురుతుంది. కాబట్టి - నా చిత్తచోరుని నువ్వే పట్టుకోవాలని, దొంగ దొంగల జట్టులో ఉండాలి కాబట్టి నువ్వే నా చిత్తచోరుని ఉంచుకోమని, ఇలా దొంగను మంచిచేసుకుంటే దొంగల భయము కూడా ఉండదు గదా అని చెప్పి ఒప్పించే లౌక్యమైన విధానం ఇది.)

---

**23. కరోమి తత్పూజాం సపది సుఖదో మే భవ విభో**

**విధిత్వం విష్ణుత్వం దిశసి ఖలు తస్యాః ఫలమితి |**

Sri Maha Kameswari Seva Trust

**పునశ్చ త్వాం ద్రష్టుం దివి భువి వహన్ పక్షిమృగతా**

**మదృష్ట్వా తత్ఖేదం కథమిహ సహే శంకర విభో||**

శంకరా! నిన్నారాధింతును. నాకు పూజా ఫలముగా మోక్షానంద మొసంగుము. కాని బ్రహ్మత్వమో విష్ణుత్వమో ఫలమని మాత్రమీయవద్దు. అక్కడ నుండి హంసగానో పందిగానో పుట్టి నీ పాదము లను శిరస్సును కనుగొనుటకు పైలోకాలు క్రింది లోకాలు అన్నీ తిరిగి శ్రమపడలేను. ఆమీద తుదకు నిన్ను కనుగొనలేక క్షుద్ర జన్మ వలని యవమానమును సహింపలేను. కాని బ్రహ్మవిష్ణు లోకానందముల కన్న అధికమైన సాయుజ్య ముక్తి యను పరమానందమును దయచేయుమని భావము.

పరమశివుని ఆరాధించి పొందవలసిన పరమఫలాన్ని గూర్చి ఈ శ్లోకములో సూచించి ఆది శంకరులు మనకు సలహా ఇస్తున్నారు. దేవుళ్ళను ఆరాధించి వాళ్ళు ప్రత్యక్షమై, వారు కోరుకోమనగానే - వెంటనే ముందు వెనుక చూడకుండా ఏదో లాభించే దాన్ని మనం వరంగా కోరుకుంటాము. ఐతే ఏది జరిగతే మనకు శుభం కలుగుతుందో కోరుకోవాలి గాని లాభించేది కోరుకోకూడదు.

శివుణ్ణి తపస్సు చేసి మెప్పించి వరం కోరుకున్న భస్మాసురునికి చివరకు ఏమైంది? అలాగే గజాసురునికి ఏమైంది?

ఉదా: బండపనులు చేసి పెడుతుందని ఏనుగును కోరుకుంటే దాన్ని మేపటానికి కావలసిన ఏర్పాట్లు ఎన్ని చెయ్యాలి ?

నిన్ను ఆరాధించి నందుకు నాకు పూజా ఫలంగా ఏ బ్రహ్మపదాన్నో, విష్ణుపదాన్నో మాత్రం ఇవ్వవద్దు. అలా ఇస్తే వాళ్ళు ఏ పాట్లు పడ్డారో నేనూ అదే పాట్లు పడాల్సివస్తుంది. ఏదో సాధించాలని క్షుద్ర మైన జన్మలెత్తి గూడా వాళ్ళు సాధించిందేమిటి? అవమానం తప్ప! అందుకని బ్రహ్మపదం వద్దు, విష్ణు పదం వద్దు. ఆరెంటినీ మించింది తిరిగి మళ్ళీ ఏ కోరికా కోరవలసిన అవసరం లేకుండా చేసేది అయిన నీతోడి సాయుజ్య పదవినిచ్చి పరమానందాన్ని ప్రసాదించు - అని శంకరులు ఎంతో అనుభవంతో కోరుకున్నారు - అని ఈ శ్లోకము ద్వారా తెలుసుకోవాలి.

---

Sri Maha Kameswari Seva Trust

**24. కదా వా కైలాసే కనకమణిసౌధే సహ గణై**

**ర్వసన్ శంభోరగ్రే స్ఫుటఘటిత మూర్ధాంజలిపుటః |**

**విభో సాంబ స్వామిన్ పరమశివ పాహీతి నిగదన్**

**విధాతౄణాం కల్పాన్ క్షణమివ వినేష్యామి సుఖతః ||**

కైలాసమునకు జేరి ప్రమధగణములతో గూడ పరమేశ్వరుని యెదుటహేవిభో! హేసాంబ! హేస్వామిన్! హే పరమశివ ! పాహి పాహి యని పలుకుచు సంతోషముతో అనేక బ్రహ్మకల్పములు నిమేషంబులుగా కాల మెప్పుడు గడపుదునో గదా !

కష్ట సమయం వచ్చినప్పుడు - తనకు నచ్చే విధముగా కలవచ్చినా, తనకు నచ్చే సన్నివేశంలో పాల్గొంటున్నా ఊహాలోకంలో విహరిస్తున్నా - ఆ కష్టాన్ని అందువలన వచ్చే మనఃక్లేశాన్ని మరచి పోగలిగి ఆనందం అనుభవించగలం - అని ఈ శ్లోకములో శంకరులు చెప్పుచున్నారు. ఆయన ఊహల్లో ఎలాంటి ఆనందం పొందుతారో ఈ శ్లోకము వివరిస్తుంది.

కమనీయమైన కైలాసం లో ఉండాలి. తాను ఒంటరిగా కాకుండా తనలాంటి భక్తులే ఉండాలి. అప్పుడు సంకల్పానికి లక్ష్యానికి సిద్ధి చేకూరుతుంది. ఇందువల్ల భక్తుల మధ్య సాలోక్యసిద్ధి చేకూరుతుంది. అందరి హృదయాల్లో శివుడే వుండి అందరూ శివుని సాన్నిధ్యాన్ని అనుభవిస్తారు. దీనివల్ల సారూప్యం,సామీప్యం సిద్ధులు రెండూ చేకూరుతాయి. ఈరెండూ చేకూరిన తరువాత శివనామ స్మరణతో ఆనందంతో పరమశివునికి మరింత చేరువై చివరికి అభేద స్థితిలో సాయుజ్య సిద్ధికి సంబంధించిన పరమానందాన్ని గూడా పొందడం జరుగుతుంది. అప్పుడు బాహ్యప్రపంచాన్నే మర్చిపోయి బ్రహ్మకల్పాదుల్ని గూడా అధిగమించి నిత్యానంద పరవశ స్థితిలోనే ఉండి పోవచ్చునట. ఇంతకంటే కావలసినదేముంటుంది జీవి తరించడానికి అని శంకరుల ఉద్దేశ్యం. మనకు నచ్చితే మనమూ అలాంటి స్థితి నుంచి ఆనందాన్ని ఇహలోకంలో ఉండే పొందవచ్చును. ఈ ఊహ వల్ల వచ్చే ఆనందం ఎప్పటికైనా నిజంగా దక్కుతుంది. అందుకు నిర్మలమైన భక్తితో ఓపిగ్గా నిరీక్షించాలి.

Sri Maha Kameswari Seva Trust

**25. స్తవై ర్బ్రహ్మాదీనాం జయ జయ వచోభిర్నియమినాం**

**గణానాం కేళీ భిర్మద కల మహోక్షస్య కకుది |**

**స్థితం నీలగ్రీవం త్రినయన ముమాశ్లిష్టవపుషం**

**కదా త్వాంపశ్యేయం కరధృత మృగం ఖండ పరశుమ్ ||**

స్తోత్రపాఠములతో బ్రహ్మాదులు ను, జయజయ ధ్వనులతో మహర్షులును, ఆటపాటలతో ప్రమథగణములును గొలువ పార్వతీ సమేతుడవై వృషభ వాహనము మీద వేంచేసి యున్న నీ సందర్శనము చేయు భాగ్యము నా కెన్నడు లభించునోగదా!


ఈ శ్లోకము లో కూడా శంకరులు తాను ఎదురుచూసే భాగ్యం గురించి తెలియ పరుస్తున్నారు.

సాక్షాత్తు వాణీనాధుడైన బ్రహ్మ మొదలైనవారు స్తోత్రాలు చేస్తూ ఉండాలిట. మహానుభావులైన మహర్షి పుంగవులు జయజయ ధ్వానాలు చేస్తూ ఉండాలిట. వీటికి ప్రమధగణాల ఆట పాటలు తోడవాలిట. ఈ ఆనందాన్ని చూసి పరవశించే నంది మీద అయ్యవారైన శివుడు స్థిరంగా ఠీవిగా కూర్చునివుండాలిట

ఆయన శరీరంలో సగభాగమై అమ్మవారు ఆక్రమించుకుని వుండాలిట.చేతుల్లో లేడిని, ఖండ పరశువు పట్టుకొని వుండాలిట. అలా వుండే శివుణ్ణి తనివితీరా చూస్తూ పరవశిస్తూ పరమానందాన్ని పొందాలిట!

ఇంతకు మించి తనకింకేమీ అక్కరలేదుట. ఇష్ట దైవాన్ని గూర్చి ఏ భక్తుని కైనా ఇలాంటి కోరికే వుండాలి. హృదయంలో ఆ దైవం ముద్రతమై ఉండి పోతేనే జన్మలో ఎప్పుడో ఒకప్పుడు ఆ ఆనందాన్ని పొందే భాగ్యం చేకూరుతుంది.

Sri Maha Kameswari Seva Trust




26. కదా వా త్వాం దృష్ట్వా గిరిశ తవ భవ్యాంఘ్రియుగళం

గృహీత్వా హస్తాభ్యాం శిరసి నయనే వక్షసి వహన్|

సమాశ్లిష్యాఘ్రాయ స్ఫుటజలజ  గంధాన్ పరిమళా

నలభ్యాం బ్రహ్మాద్యైర్ముదమను భవిష్యామి హృదయే||

హే గిరిశా ! నిన్ను జూచి నీ పాదములను చేతులతో పట్టి, శిరస్సు నందు, నేత్రము లందు ఱొమ్మునను జేర్చి కౌగిలించు కుని అందలి పద్మగంధముల నాఘ్రాణించి బ్రహ్మాదులకును దొరకని యానందము నెప్పుడు పొందుదునోకదా !

తాను ఊహించుకున్న, తన హృదయంలో ముద్రతమై వున్న తన దైవాన్ని చూడటమే గనుక తటస్థ పడితే భక్తుడు ఏం చెయ్యాలో ఈ శ్లోకములో తననుఆ భక్తునిగాఆపాదించు కుని ఆది శంకరులు సెలవిచ్చారు.

తాను దైవాన్ని కళ్ళారా చూడంగానే ముందుగా పవిత్రమైన పాదాలను హస్తాలతో పట్టుకోవాలట. అటుపైన వాటిని తలకు, కళ్ళకు, వక్షస్థలానికి హత్తుకొని ఆలింగనం చేసుకుని ఆ పాదపద్మ పరిమళాలను ఆఘ్రాణిస్తూ హరి బ్రహ్మాదులైన పెద్ద పెద్ద వారికి కూడా పొంద శక్యము కాని ఆ ఆనందాన్ని హృదయం నిండా నింపుకొని పరవశించి పోవాలిట. ఇదే నిజమైన భక్తునికి , నమ్మిన దైవానికి మధ్య వుండే భక్తి పరమైన సంబంధం - అని ఆది శంకరులు అంటున్నారు.

---

**27. కరస్థే హేమాద్రౌ గిరిశ నికటస్థే ధనపతౌ**

**గృహస్థే స్వర్భూజామర సురభి చింతా మణి గణే |**

**శిరస్థే శీతాంశౌ చరణ యుగళస్థే2ఖిల శుభే**

**కమర్థం దాస్యే2హం భవతు భవదర్థం మమ మనః ||**

కైలాస వాసా ! బంగారు కొండ నీ చేత నున్నది. కుబేరుడు మిత్రుడుగా నీ దగ్గరనున్నాడు. కోరికలనిచ్చు కల్ప వృక్షము లును, కామధేనువు, చింతామణులును నీ అధీనములై నీ యింట నున్నవి. చంద్రుడు భూషణముగా నీ శిరస్సున నున్నాడు. సమస్త శుభములును నీ పాదంబుల వలన కలుగు చున్నవి. శంకరా! నీకు నేనొసగదగిన దొక్కటియు కానరాదు. కనుక నా చిత్తము నర్పించెదను. స్వీకరింపుము.

విశ్వంలో వున్నదంతా భగవంతునిదే అయినపుడు మళ్ళీ ఆయనకు ఏదైనా సమర్పించడం ఆయనది ఆయనకే ఇచ్చినట్లు అవుతుంది కదా | కాబట్టి ఇచ్చేదేమిటి? అని తర్క వాదం చేసేవాళ్ళూ వుంటారు. అసలు

మనం భూమి మీదకు వచ్చి బ్రతికి బట్ట కట్టడానికి తల్లి తండ్రులు కదా కారణం ! మన శరీర పోషణ నిమిత్తం వాళ్ళిచ్చిన ఆస్తిపాస్తులను అనుభవిస్తున్నా మన తల్లితండ్రులు ఏమీ అనుకోరు. పైగా ఏదైనా శుభకార్యం నిర్వహించిన తరువాత తల్లిదండ్రులకు బట్టలు పెట్టినచో ఎంతో సంతృప్తి చెందుతారు, కాని తమవే తమకు ఇస్తున్నారనిఅనుకోరు. అలాగే విశ్వభాగ్యం అంతా భగవంతునికి సంబంధించినదే అయినా ఆయనకు మనం భక్తితో సమర్పిస్తే చాలా సంతోషిస్తాడు.

భగవంతునికి ఏమి సమర్పించాలి అన్నది భగవద్గీత లో శ్రీకృష్ణుడు చెప్పినది పత్రం, పుష్పం,ఫలం, తోయం. భక్తిసమర్పణ - నైవేద్యం పరిమాణం మీద, విలువ మీద ఆధారపడి వుండదు కదా !

పత్రం, పుష్పం, ఫలం, తోయం అన్నదాంట్లో ఒక విచిత్రమైన అంతరార్థం వుంది.

పత్రం అంటే పడిపోయేది. మనిషిని పడేసేది - మనస్సు కాబట్టి - మనస్సే పత్రం.

పుష్పం అంటే వికసించేది. మనిషి లో వికసించేది బుద్ధి కాబట్టి - బుద్ధియే పుష్పం.

ఫలం అంటేవేటుల చేత పగులునది. జ్ఞాన బోధ అనే దెబ్బల చేత పగిలేది మనలోని అహంకారం కాబట్టి అహంకారమే - ఫలం.

తోయం అనగా తరింప చేసేది, రక్షించేది. ధ్యేయాన్ని సరిగ్గా గుర్తుంచుకొని క్రమక్రమంగా రక్షించేది చిత్తమే కాబట్టి ఈ చిత్తమే - తోయం.

భగవంతునిలో ఐక్య భావన కలిగి నపుడు పరవశంతో కలిగే ఆనందాశ్రువులే ఈ తోయం. ఐక్య భావన చిత్త లక్షణం కాబట్టి చిత్తమే - తోయం.

( పై భావానికి వివరణ కర్త గారు 'వేదాంతం లక్ష్మయ్య గారికి' కృతజ్ఞతలు తెలియజేశారు)

Sri Maha Kameswari Seva Trust

భగవంతునికి సమర్పించే వాటిలో మన పతనానికి కారణమైన మనస్సును ముందు సమర్పించడం మంచిది కదా! శివుని దగ్గర బంగారు కొండ,ధనపతి కుబేరుడు, ఇంట్లో కల్ప వృక్షం, కామధేనువు, చింతామణుల రాసులు ఉన్నా , నెత్తిపై చంద్రుడు ఉన్నా, సకల శుభాలకు నిలయమైన పాదాలు ఉన్నా ఆయనకు మనం ఇంకేం సమర్పించి తృప్తి పరచగలం ! అందుకని తేలిగ్గా ఇవ్వగలిగిన పైసా ఖర్చు లేనిది - మనం పతనం కాకుండా వుండాలంటే మనం భగవంతునికి సమర్పించ గలిగేది, సమర్పించుకో వలసినది గూడా అయిన మనస్సును సమర్పించడ మేసముచితమని - "భవదర్థం మమ మనః " అని శంకరులు సెలవిచ్చి,మార్గాన్ని సూచించారు. ఈ శ్లోకములో. ఏ పూజలో నైనా చిట్టచివరిగా మామూలు మనస్సు గాక మంత్ర పూతమైన మనస్సనే 😀పుష్పాన్ని (మంత్ర పుష్పాన్ని) సమర్పించడంలోని అంతరార్థం ఇదే !

(పుష్పం అంటే ఐదు రేకులు కలిగిన పువ్వు - అందుకే పుష్పోత్సవాలు అంటే ఐదు రోజులు జరిగే ఉత్సవాలు - అని అర్థం. పుష్పాన్ని మనస్సు అనుకుంటే దానిలోని ఐదు రేకలు పంచజ్ఞానేంద్రియాలతో కూడిన మనస్సే ఈ పుష్పం.)

---

**28. సారూప్యం తవ పూజనే శివ మహాదేవేతి సంకీర్తనే**

**సామీప్యం శివభక్తి ధుర్య జనతా సాంగత్య సంభాషణే ।**

**సాలోక్యం చ చరాచరాత్మక తను ధ్యానే భవానీపతే సాయుజ్యం మమ సిద్ధమత్ర భవతి స్వామిన్ కృతార్థోఽస్మ్యహమ్ ।।**

జగత్ప్రభూ! నీ పూజ యందు సారూప్యమును, నీ నామ సంకీర్తనమందు సామీప్యము, నీ భక్తులతోకూడి కథా కాలక్షేపములు చేయుట వలన సాలోక్యము, చరాచరాత్మక మైన నీ మూర్తి ధ్యానమందు సాయుజ్యమును గూడ నాకీ లోకమందే దయచేయు చుంటివి గాన ధన్యుడనైతిని.

"ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీచభరతర్షభ" - అని భగవద్గీతలో భక్తులు నాలుగు రకాల వాళ్ళుంటారని చెప్పబడింది. అలాగే ముక్తులు గూడా నాలుగు విధాలుగా ఉంటాయి.

1) "సాలోక్యం"- అంటే భగవంత్సంబంధమైన లోకంలో గడపడం.

2) "సామీప్యం" - అంటే భగవంతునికి సన్నిహితంగా వుండటం.

3) "సారూప్యం" - అంటే భగవంతుని రూపంలో వుండటం.

4) "సాయుజ్యం" - అంటే భగవంతునిలో ఐక్యం చెందడం.

అందరూ కలిసి భగవంతుని సంకీర్తన చేస్తున్నప్పుడు, భగవద్విషయాలను మనః పూర్వకముగావింటున్నప్పుడు, భగవంతుని లీలలు చూస్తున్నప్పుడు కూడా ఈ సాలోక్య స్థితిని పొందవచ్చు. అంటే - మనము మన చుట్టూ ఉండే వాతావరణం వ్యక్తులు అందరూ ఒకే విధమైన ధ్యేయాన్ని, లక్ష్యాలను కలిగి వున్నపుడు ఈ సాలోక్యం ఇహ లోకంలోనే పొందవచ్చు. తాను ఇహలోకంలోనే ఎప్పుడూ అలాంటి స్థితిని పొందినవాణ్ణని శంకరులు ఈ శ్లోకములో తెలియ పరుస్తున్నారు.

భౌతికంగా భగవంతునికి చేరువగా లేకపోయినా సాలోక్య సిద్ధిని పొందవచ్చు. కాని, భగవంతుని సాన్నిధ్యం లో ఉన్నప్పుడు మాత్రమే సామీప్య సిద్ధి చేకూరుతుంది. అయితే - సామీప్యం అంటే భౌతికంగా  దగ్గరగా ఉండాల్సిన అవసరం లేదు, మానసికంగా దగ్గరగా ఉంటే చాలు, అది కూడా - సామీప్య ముక్తే అవుతుందనుకుంటే - సాలోక్యంలోనే సామీప్యం గూడా సిద్ధిస్తుంది.

భగవంతుని రూపంతో సమానమైన రూపాన్ని పొందటం ద్వారా వచ్చే ముక్తిని సారూప్య ముక్తి అంటారు. మనలోని చిత్తానికి ఒక రూపాన్ని ఆపాదిస్తే చిత్తం ఆ రూపం అయిపోతుంది. ఇది చిత్త లక్షణం. న్యాస ప్రక్రియ ద్వారా ఆరాధ్య దేవతతో సారూప్యం పొందడం జరుగుతుంది.శివుణ్ణి పూజించి, ధ్యానం చేస్తే "శివోహం" అన గలిగే స్థితి వస్తుంది. రామకృష్ణ పరమహంసఏదేవతనుపూజిస్తే వారి రూపం ప్రాప్తించేదట! హనుమంతుణ్ణి ఉపాసన చేసినప్పుడు ఆయనకు కొద్దిగా తోక కూడా వచ్చినట్లు చెప్తారు. జయవిజయులకు వచ్చిన ముక్తి కూడా సారూప్య ముక్తి క్రిందకే వస్తుంది. అందుకే వారిరువురు విష్ణు మూర్తి లాగానే శంఖం, చక్ర, గదాది చిహ్నాలతో వైకుంఠ ద్వారానికి ఇరువైపులా ఉంటారు.

చరాచరాత్మకమైన విశ్వం యావత్తును పరమాత్మ దేహంగా ధ్యానించి నపుడు - తాను, తనతోపాటు తోటి జీవకోటి, స్థావరాలు అన్నీ కూడా ఆ పరమాత్ముని భాగాలే అనే అనుభూతి కలుగుతుంది.

అప్పుడు మనలోని మన కన్నులాగ పరమాత్మ లో మనం ఒక భాగమై లీనమై పోతాము. ఈ స్థితిలో కలిగే ముక్తి సాయుజ్య ముక్తి  ఔతుంది.

Sri Maha Kameswari Seva Trust

పైన తెల్పిన విధంగా ఇహలోకంలో వుండే నాలుగు రకాల ముక్తులను పొందవచ్చునని , తాను అలా పొంది ధన్యుడనైనానని శంకరులు ఈ శ్లోకములో విశదపరచారు.

---

**29. త్వత్పాదాంబుజ మర్చయామి పరమం త్వాం చింతయామ్యన్వహం**

**త్వామీశం శరణం వ్రజామి వచసా త్వామేవ యాచే విభో ।**

**దీక్షాం మే దిశ చాక్షుషీం స కరుణాం దివ్యైశ్చిరంప్రార్థితాం**

**శంభో లోకగురో మదీయ మనసః సౌఖ్యోపదేశం కురు ।।**

పరమేశ్వరా ! నీ పాదార్చనము చేయుచు ప్రతిదినము నిన్ను తలంచుచు శరణు పొంది వేడుకొందును. చిరకాలము నుండి దేవతలచే కోరబడు చుండెడి నీ కరుణా కటాక్షము ను నాపై ప్రసరింప చేసి కేశము లడంచుచు బ్రహ్మోపదేశము చేయుము.

ఏపని ఫలవంతం అవాలన్నా ఆ పనికి చేసే ప్రయత్నం త్రికరణ శుద్ధిగా వుండాలి. మనస్సు, వాక్కు, శరీరము

ఈ మూడింటినీ మనకు సంబంధించిన త్రికరణా లంటారు. చేసేదొకటి, చెప్పే దొకటి, ఆలోచించేది ఒకటి అయితే శ్రుతిచెడి త్రికరణశుద్ధి చేకూరదు. భగవదారాధన విషయంలో కూడా ఇది సత్యం.

భగవంతునికి మూడు శరీరాలు వుంటాయి. స్థూల శరీరం, సూక్ష్మ శరీరం, కారణ శరీరం. ఈ మూడింటినే భగవద్గీతలో వరుసగా 1) క్షర పురుషుడు

2) అక్షర పురుషుడు

3) పురుషోత్తముడు అనే పేర్లతో సంకేత పూర్వకంగా గీతాచార్యుడు చెప్పాడు.

"స్థూల శరీరం" లేదా క్షర "పురుషుడు" అంటే భౌతికంగా వుండే శరీరం. "సూక్ష్మ శరీరం" లేదా " అక్షర పురుషుడు" అంటే నశించనిది, సూక్ష్మంగా వుండేది అని అర్థం. ఈ రెండింటికి కారణభూతంగా నేపథ్యంలో వర్తించేది " కారణ శరీరం" .ఈ కారణం శరీరాన్నే భగవద్గీతలో "పురుషోత్తముడు" అన్నారు.

Sri Maha Kameswari Seva Trust

ఉదాహరణకు

ఒకే వ్యక్తి వివిధ నాటకాల్లో వేర్వేరు పాత్రలు వేస్తుంటే - ఆ పాత్రలు "క్షర పురుషుడని" ఆ పాత్రలు వేసే ఆ ఒకేపాత్రధారు ని "అక్షర పురుషుడని" , ఈ నాటకాలన్నిటిలోని ఆయా పాత్రలను సృష్టించిన నాటక కర్త లేదా నాటక సూత్రధారుని పురుషోత్తముడని అనుకోవచ్చు.

భగవంతుని భౌతిక విగ్రహానికి మన శరీరంతో లేదా చేతులతో పూజ చెయ్యాలి. దీన్నే "కాయిక పూజ" అంటారు. భగవంతుని సూక్ష్మ శరీరాన్ని మన వాక్కుతో స్తుతించాలి. దీన్నే "వాచిక పూజ" అంటారు. భగవంతుని కారణ శరీరాన్ని మన మనస్సు తో ధ్యానించాలి. దీన్నే "మానసిక" పూజ అంటారు.

ప్రస్తుత శ్లోకంలో శంకరులు శివుని విగ్రహానికున్న పాదాలను చేతులతో పట్టుకొని కాయిక పూజను చేసి, వాక్కులతో శివుని సూక్ష్మ శరీరాన్ని స్తుతించి, మనస్సుతో శివుని కారణ శరీరాన్ని ధ్యానించి త్రికరణశుద్ధిగా ఆరాధిస్తూ సంపూర్ణంగా శరణు జొచ్చి, దేవతలు కూడా చిరకాలం కోరుకొనే శివుని కరుణా దృష్టి తనపై ప్రసరించాలని కోరు కుంటున్నారు. మనం గూడా చేసే పనులకు ఈ విధమైన త్రికరణ శుద్ధి వుండాలి - అని ఈ శ్లోకము ద్వారా సూచించారు.

---

**30. వస్త్రోద్ధూతవిధౌ సహస్ర కరతా పుష్పార్చనే విష్ణుతా**

**గంధే గంధవహాత్మతా 2 న్న వచనే బర్హి ర్ముఖాధ్యక్షతా ।**

**పాత్రే కాంచన గర్భతా2స్తి మయిచేద్బాలేందు చూడామణే**

**శుశ్రూషాం కరవాణి తే పశుపతే స్వామిన్ త్రిలోకీ గురో ।।**

సర్వ వ్యాపకా! నీకు వస్త్రోపచారము చేయుటకు వేయి కరములు గలవాడు కావలయును. పుష్పోపచారము చేయుటకు వ్యాపకుండు కావలయును. గంధోపచారమునకు గంధవహుండు గావలయును. వంటచేసి నీకు హవిస్సు నివేదన చేయుటకు అగ్ని ముఖాధ్యక్షుడు కావలయును. అర్ఘ్య పాత్రము సమర్పించు టకు ఆ గర్భ శ్రీమంతుడు గావలయును. అట్టి సూర్యుడు ను,

Sri Matha Kameswari Seva Trust

విష్ణువును, వాయుదేవుడు ను, దేవేంద్రుడును,హిరణ్య గర్భుడును అయినప్పుడే నీ కట్టి ఉపచారములు చేయ గలను. లేనిచో నీ కుప చారములు చేయ నాతరమా ?

ఈ శ్లోకములో నిత్యం చేసే కాయిక పూజ గురించి చెప్పబడుచున్నది. మనం చేసే పూజలో ముఖ్యంగా పదహారు రకాల ఉపచారాలు ఉంటాయి. దీన్నే " షోడశోపచార పూజ" అంటారు. 1) ఆవాహన,

2) ఆసన, 3) అర్ఘ్య, 4) పాద్య, 5) స్నాన, 6) వస్త్ర, 7) గంధ, 8) యజ్ఞోపవీత (స్త్రీ దేవతల కైతే వింజామర), 9) ఆభరణ, 10) పుష్ప,11) ధూప, 12) దీప, 13) నైవేద్య 14)తాంబూల, 15) నీరాజన 16) మంత్రపుష్ప ఉపచారాలు కలిసి మొత్తం పదహారు ఉంటాయి. వీటినే షోడశోపచారాలు అంటారు. వీటిలో కొన్నింటిని ఈ శ్లోకములో ఉదహరించేరు.

చతుర్దశ భువనాధిపతి అయిన శివుడంతటి వానిని సంతృప్తిగా పూజించాలంటే మాటలా అంటూ కొన్ని ఉపచారాలు ఎవరు చేస్తే సంతృప్తిగా వుంటుందో చెబుతున్నారు.

శివునికి వస్త్రోపచారం చెయ్యాలంటే సూర్యుడే చెయ్యాలట. ఎందుకంటే - సూర్యుడు తన కిరణ సముదాయంతో ఈ ప్రపంచాన్ని అల్లుకొని విస్తరింప జేసేవాడుట. అందుకనే సూర్యునికి "వివస్వంతుడు" అనే పేరు వచ్చింది.

ఇక పుష్పోపచారం చెయ్యాలంటే - వ్యాపకుడు, పోషక కర్త అయిన విష్ణువే చెయ్యాలిట.

గంధోపచారం చెయ్యాలంటే - తనతోపాటు గంధాన్ని మోసుకొని సర్వత్రా వ్యాపింప చేసే వాడైన వాయుదేవుడే చెయ్యాలిట.

వండి హవిస్సుగా ఏదైనా నివేదన చెయ్యాలంటే - అగ్ని ముఖాధీశుడైన ఇంద్రుడే చెయ్యాలిట !


పాత్రతో అర్ఘ్యం సమర్పించాలంటే హిరణ్యగర్భుడైన సాక్షాత్తు బ్రహ్మే సమర్పించాలట !

మరి శివునికి ఈ విధమైన ఉపచారాలు చెయ్యడం సామాన్యుల వల్ల వీలవు తుందా? అలా అని పూజ మానక్కర లేదు. మనకు తగ్గ స్థాయిలో యథాశక్తి పూజ

Sri Maha Kameswari Seva Trust

చెయ్యాలి. ఆ విధంగా చేస్తూ వుంటే ఎప్పటికైనా ఈ శ్లోకము లో చెప్పిన స్థాయి సామర్థ్యాలు మనకు గూడా శివుడు కలుగచేస్తాడనే నమ్మకంతో పూజ చెయ్యాలి.

శివుని స్థాయి అంతటిది అని చెప్పడానికే ఈ ఉదాహరణలు గాని - మనం శివుని పూజించటానికి తగం అని మాత్రం కాదు.



**31. నాలం వా పరమోపకారకమిదం త్వేకం పశూనాం పతే**

**పశ్యన్కుక్షిగతాన్ చరాచరగణాన్ బాహ్యస్థితాన్ రక్షితుమ్ ।**

**సర్వామర్త్యపలాయనౌషధ మతిజ్వాలాకరం భీకరం**

**నిక్షిప్తం గరళం గళే న గిళితం నోద్గీర్ణ మేవ త్వయా ।।**

నిఖిలలోక భయంకరమై సంతాపకరమైన కాలకూట విషమును చూచి భయపడి పారిపోవు దేవతల నూరడించుటకు గాను నీ కంఠమందే యుంచుకొని ఉమియక, మ్రింగక కడుపులోని వారలకును, వెలుపలి వారలకును బాధ కలుగకుండ మహోపకార మొనర్చితివి. దేవా ! నీ మహిమ తెలియుట కీ దృష్టాంతమొక్కటి చాలదా ।।

ఏ దేవత గూడా ప్రపంచానికి చెయ్యని మహోపకారం శివుడొక్కడే చేశాడని "ఆర్తత్రాణపరాయణుడు" "జగద్రక్షకుడు" "ఆపద్బాంధవుడు" అనే పేర్లకు సరిగ్గా తగినవాడు శివుడొక్కడేనని ఈ శ్లోకము ద్వారా శంకరులు నిర్ధారిస్తున్నారు.

దేవతలు దానవులు కలిసి క్షీరం సముద్రాన్ని మథించారు. జ్వాలలు చిందిస్తూ కాలకూట విషం ఉద్భవించింది. దేవతలు దానవులు హడలి పోయారు. భయభ్రాంతులతో ప్రయత్నం విరమించి పారిపోదా మను కున్నారు. మంచి ఫలితం దక్కితే అనుభవిద్దామను కున్నారే గాని ఇలా హాలాహలం ఉద్భవిస్తే ఏం చేస్తారు? ఎవరి బ్రతుకు వారు చూసుకునే స్వార్థ ప్రయత్నం లో పడ్డారు. అప్పుడు శివుడు ఆ హాలాహలాన్ని తాను భక్షించి దేవదానవులందరినీ రక్షిద్దా మనుకున్నాడు. కాని,ఆ విషాన్ని మ్రింగతే లోపల కుక్షిలో సకల ప్రాణికోటి ఆహుతి అయి పోతుందేమోననే ఉద్దేశ్యంతో అటు లోపల ప్రాణికోటి, ఇటు బయట దేవ దానవులు అందరూ రక్షింప బడటం కోసం- ఆ విషాన్ని మ్రింగి లోపలకు పోనీయకుండా కంఠం వద్దనే నిలిపి వేశాడు. ఇంతటి సమయస్ఫూర్తి, ఇంతటి దయాగుణం, ఇంతటి సాహసం ఆర్తత్రాణ పరాయణత్వం ఎవరికి ఉంటాయి?

కల్పవృక్షం వస్తేను, కామధేనువు వస్తేను, లక్ష్మీ దేవి వస్తేను ఉచితంగా సంగ్రహించ డానికైతే ముందుకు వస్తారు గాని ఇలా హాలాహలం వస్తే - పూర్తిగా మ్రింగ కుండా బయటకు ఉమియకుండా - కంఠం వద్దనే నిలిపి అందరినీ

Sri Maha Kameswari Seva Trust

కాపాడే రక్షణ గుణం, ఉపకార మగుణం ఎవరికుంటుంది? ఈ ఒక్క మహోపకార గుణంచాలు

శివుడు అందరి దేవతలలో అగ్రగణ్యుడని చెప్పుకోడానికి - అంటున్నారు ఆది శంకరులు

---

**32. జ్వాలోగ్ర స్సకలామరాతి భయదః క్ష్వేళః కథం వా త్వయా**

**దృష్టః కించ కరే ధృతః కరతలే కిం పక్వ జంబూఫలమ్ |**

**జిహ్వాయాం నిహితశ్చ సిద్ధ ఘుటికా వా కంఠదేశే భృతః**

**కింతే నీలమణిర్విభూషణ మయం శంభోమహాత్మన్ వద ||**

తీవ్ర జ్వాలలు గ్రమ్ముచు సకల దేవతలకు ను భయంకరమైన ఈ కాలకూట విషమును కన్నులతో గాంచుటయే కాక చేతితో ఎత్తి అరచేతిలో నుంచుకొంటివి, అది ఏమైనా నేరేడు పండా ఏమి? అదియును కాక నాలుక మీద వేసుకుంటివి, అది ఏమైనా సిద్ధ ఘుటికయా యేమి?

ఇంకనూ కంఠ మందటులనే యుంచుకొంటివి,అది ఏమైనా ఇంద్రనీలమణియా ఏమి చెప్పుము.

హాలాహల భక్షణం గూర్చి మరికొన్ని విశేషాలను ఈ శ్లోకములో శంకరులు చెప్పుచున్నారు.

ప్రళయాగ్ని జ్వాలలు చిందిస్తూ అతి వేగంగా విస్తరిస్తూ ముందుకు వచ్చే కాలకూట విషమును చూచి దేవత లందరూ హడలిపోతుంటే - శివుడు దానికి ధైర్యంగా ఎదురు నిలబడి తన చేతిని చాచాడు - అంతే ! పెద్ద కారు మేఘమంత ఉన్న ఆ హాలాహలం ఆదివరాహ మంత అయి తగ్గుతూ తగ్గుతూ చివరకు పండిన నల్లని నేరేడు పండంత అయి చిట్ట చివరికి శివుని అరచేతిని చేరంగానే మరింత చిన్నదైపోయింది. (అంటే - హాలాహలం చిన్నదై పోవడం కాదు. ఆ హాలాహలం అలాగే ఉంది కాని శివుడు దాని ముందు తన పరిమాణాన్ని

Sri Maha Kameswari Trust

పెంచగా చివరకు తన పరిమాణం ముందు ఆ హాలాహలం సాపేక్షికంగా తన అరచేతిలో  చుక్కంత ఐనట్లు కనపడిందన్నమాట)

ఆ హాలాహలాన్ని అవలీలగా మ్రింగి తన కంఠం మధ్య లోనే నిలిపి వేశాడు. అసలు దగ్గరగా ఎదురుగా నిలబడటమే కష్టం అనుకుంటే - నిలబడటమే కాకుండా చేతుల్లోకి తీసుకోవడం, తీసుకోవడమే కాకుండా మ్రింగడం, మ్రింగడమే  కాకుండా కంఠం వద్దనే నిలిపి వేయడం సామాన్య విషయమా - అలా మ్రింగడానికి అదేమి పండిన నేరేడు పండు కాదు, సిద్ధ ఘుటికా కాదు గదా! మ్రింగి కంఠం వద్దనే నిలిపితే అంతటి హాలాహలం శివుణ్ణి, శివుని కంఠాన్ని గూడా ఏమీ చేయలేకపోయింది. తెల్లగా వుండే శివుని కంఠం ఇంద్రనీలమణిని ఆభరణంగా ధరించినట్లు వెలుగులు చిమ్మింది. అద్భుతమైన ఈ సన్నివేశాన్ని చూచిన దేవ దానవులందరూ ఆశ్చర్యంతో మరల తిరిగి పొందిన ఉత్సాహంతో - 'నీలకంఠా! మృత్యుంజయా ! సర్వేశ్వరా! సదా శివా! శ్రీ మన్మహాదేవా ! ' అంటూ జయజయ ధ్వానాలు చేశారు.

---

**33. నాలం వా సకృదేవదేవ భవతస్సేవా నతిర్వా నుతిః**

**పూజా వా స్మరణం కథా శ్రవణమప్యాలోకనం మా దృశామ్ ।**

**స్వామిన్నస్థిరదేవతానుసరణాయాసేన కిం లభ్యతే**

**కా వా ముక్తిరితః కుతో భవతి చేత్కిం ప్రార్థనీయం తదా ।।**

ఓ స్వామీ! నమస్కారము. స్తోత్రము, స్మరణము మొదలగు నీ సేవలయం దొక్కొక్కటియు మోక్షమునకు గొప్ప సాధనము. ఈ ఉపాయములను వీడి వేరుగా మోక్షము లేదు. అస్థిరులైన  యితర దేవతల ననుసరించి యేమి లాభము? వారిని కోరదగిన దేమున్నది?

ఈ శ్లోకము ముక్తి రావడానికి చాలా తేలికగా ఉండే ప్రక్రియ ను సూచిస్తున్నట్లు వుంటుంది. ఒక్కసారి శివునికి - నమస్కారము చేసినా, సేవించినా, పూజించినా, దర్శించినా గూడా ముక్తి వస్తుందిట. ఇంతటి ఫలం దక్కడానికి మరి , అశాశ్వతులైన ఇతరులకు కష్టపడి సేవ చెయ్యవలసిన పనిలేదుట!

Sri Manikeswari Seva Trust

యాంత్రికంగా సంకీర్తన చేసినా, పూజలు, అభిషేకాలు చేసినా, హోమాలు చేసినా ఏమీ ప్రయోజనము ఉండదు. ఆ చేసేది హృదయపూర్వకంగా, నిష్టగా, ఏకాగ్రతా దృష్టితో ఒక్కసారి చేసినా చాలు! అని ఈ శ్లోక భావన. చేసే పూజకు, పలికే మాటకు, ధ్యానించే మనసుకు శ్రుతి కుదిరితే ఒక్కసారి చాలు. త్రికరణాలకు శ్రుతి కుదరనప్పుడు వెయ్యిసార్లు,కోటి సార్లు - చేసినా ఫలితం దక్కదు అని అసలు అర్థం.

శంకరులు అందరి దేవతల్లోను ఆది దేవుని చూడగలిగారు. శివకేశవులకు, పరాశక్తి కి భేదాన్ని చూడలేదు. అంతటా నిండి ఉన్న పరబ్రహ్మను - సాలగ్రామాల్లోను, అందరి దేవతల విగ్రహాల్లోను, పుణ్యనదీనద రూపాల్లోను గూడా చూసి సర్వాంతర్యామి ని దర్శించి తరించారు.

వాస్తవానికి శంకరులు స్తుతించి నట్టుగా ఇతరులెవ్వరూ స్తుతించలేదన్న విషయం అసత్యం కాదు.ఇంతటి అద్వైత దృష్టి , అంతర్యామి దర్శనం కలిగినవారు మాత్రమే అలా స్తుతించగలరు.

విభూతి కాదు నామాలు పెట్టాలని, నామాలు కాదు విభూతి పెట్టాలని చెప్పే పరస్పర విద్వేషులు, మఠాధిపతులు ఉన్న ఈ దేశంలో - శంకరాచార్యుల వారు అందరి దేవతల మీద స్తోత్రాలు వ్రాసి ఏ దేవత స్తోత్రం వ్రాస్తున్నప్పుడు ఆ దేవత మిగిలిన అందరి కన్నా గొప్ప అని చెప్పడం ఆశ్చర్యంగా వుంటుంది. ఇందుకు కారణం

" అందరిలో వున్నదిఒక్కరే !" అనే ఆయన అభేద,అద్వైత భావన; అన్నిటా సర్వాంతర్యామిని చూడ గలగడమే అనిపిస్తుంది.

వ్యాసులవారు కూడా అటు విష్ణు సంబంధమైన, శివ సంబంధమైన, పరాశక్తి సంబంధమైన పురాణాలు వ్రాశారు. ఆయన కూడా ఎవరికి సంబంధించిన పురాణం వ్రాస్తున్నప్పుడు వారే అందరి కంటే గొప్ప అనే చెప్పారు. ఇలా అనడానికి కారణం ఆ అందరిలోను ఉన్నది ఒక్కరే కాబట్టి.

సౌందర్య లహరిలో - అమ్మవారే  అందరి కన్నా గొప్ప అని చెప్పినట్లు వుంటుంది.

విష్ణుసహస్రనామంలో విష్ణువే గొప్ప అని - శివ సహస్రనామాల్లో శివుడే అందరికంటే గొప్ప అనీ చెప్పబడినట్లుంటుంది.

Sri Maha Kameswari Seva Trust

చిత్రం ఏమిటంటే అలా చెప్పిన వాళ్ళకు అసూయలు, ద్వేషాలు, దురభిమానాలు కలగలేదు. అవి కలిగేది ఆరాధించే మనకే ! చిత్రంగా లేదూ !

**34. కిం బ్రూమస్తవ సాహసం పశుపతే కస్యాస్తి శంభో భవ**
**ద్ధైర్యం చేదృశ మాత్మనస్థితి రియం చాన్యైః కథం లభ్యతే ।**
**భ్రశ్యద్దేవగణం త్రసన్మునిగణం నశ్యత్ప్రపంచం లయం**
**పశ్యన్నిర్భయ ఏక ఏవ విహరత్యా నందసాంద్రో భవాన్ ।।**

భూతనాథా! ఏమి నీ సాహసము? ఏమి నీ ధైర్యము? మరెవ్వరేని ఇట్లు నిలిచి యుండ గలరా? నిరాశ తో దేవతలందరు అటుఇటు పారిపోజూచుచుండగా, ముని లందరూ భయకంపితులగు చుండగా, తుదకు ప్రపంచ మంతయు నశించి పోవు చుండగా - నీవొక్కడవేగదా నిర్భయుడవై మహా ప్రళయ మందు భీతి లేక విలసిల్లు చుంటివి.

దేవతలు, ఋషులు సమస్త ప్రపంచం నశించిపోయే సమయంలో నిర్భయంగా చెక్కుచెదరకుండా, ఏమాత్రం భయపడకుండా నిర్వికారంగా, స్థితప్రజ్ఞునిలా ఉండేవాడు శివుడొక్కడే! అందరూ తన లోనే ఉన్నారు. తాను అందరి

లో వున్నాడు. ఇంక తనకంటె ఇతరమనే ప్రసక్తి ఎక్కడ ఉంది ? భేద దృష్టి గలవారికే భయం కూడా ఉంటుంది. మన శరీరంలో ఎడమ చేతిని చూచి కుడి చెయ్యి భయ పడుతుందా?పడదు. ఎందుకని? ఆ రెండు చేతులూ మన శరీరం లోని భాగాలే కాబట్టి. అలాగే తనే ప్రపంచం, తనలోనే ప్రపంచం అయి నప్పుడు ఇంక భయం ఎక్కడుంటుంది? తనలో వున్న ప్రపంచం నిక్షేపంగా వుంది. మళ్ళీ సృష్టి సమయానికి మొత్తం క్రమబద్ధంగా బయటపడి బట్టకడుతుంది. అందుకే అంతటి ప్రళయం వచ్చినా శివుడు సాక్షీభూతుడు గానే వుంటాడు. ఆనందంగా యోగ మూర్తిలా వుంటాడు. ఆందోళన పడడు, ఆవేదన అంతకన్నా వుండదు. అదే స్థితప్రజ్ఞత్వం అంటే! అదీ నిర్వికార నిస్సంగత్వం అంటే! ఇలా ఉండగలిగేది శివుడొక్కడే !

Sri Maha Kameswari Seva Trust

**35. యోగక్షమ ధురంధరస్య సకలశ్రేయః ప్రదోద్యోగినో**
**దృష్టాదృష్టమతోపదేశకృతినో బాహ్యాంతరవ్యాపినః |**
**సర్వజ్ఞస్య దయాకరస్య భవతః కిం వేదితవ్యం మయా**
**శంభో త్వం పరమాంతరంగ ఇతి మే చిత్తే స్మరామ్యన్వహమ్||**

శివా! ప్రజల యోగక్షేమ భారము వహించుట, సకల శ్రేయస్సు లొసంగుట, ఐహికా ముష్మిక సాధనోపాయముల నుపదేశించుట, ఎల్లరను దయతో జూచుట, సర్వజ్ఞ త్వము ఎల్లెడ నిండియుండుట నీ గుణములు గదా! నీవే నాకు పరమాత్ముడవని యెల్లవేళల దలంతును.అదియే నాకు శ్రేయస్కరమగు గాక!

ప్రళయ సమయంలో శివుడు సాక్షీభూతుడుగా నిర్వి కారుడుగా, నిర్వేదంతో, నిస్సంగత్వంతో ఉంటాడని పూర్వ శ్లోకంలో చెప్పబడింది. నిస్సంగత్వం అంటే పట్టించు కోకుండా బాధ్యతలను విస్మరించేవాడని అర్థం చెప్పుకో కూడదు. సజ్జనుల యొక్క, ఆశ్రితులయొక్క యోగక్ష మాలు చూస్తాడు. కాలానుగుణంగా జరుగవలసిన వాటిని జరిగేలా చూసి ఆదుకుంటాడు. కని పెట్టుకుని వుంటూ ఇహపర సంబంధమైన, సమ్మతమైన హితము, శుభము జరిగేలా చూసే దయాసముద్రుడు. కాబట్టి అందరికీ ఆత్మీయుడు. అందుకే అందరి హృదయాల్లో ను వుండేవాడు శివుడే అని

' ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే అర్జున తిష్టతి ' అని గీతావాక్యం చెబుతుంది. అందుకే శివ స్మరణ సర్వ మంగళకరం.



Sri Maha Kameswari Seva Trust



36. భక్తో భక్తి గుణావృతే ముద మృతాపూర్ణే ప్రసన్నే మనః

కుంభే సాంబ తవాంఘ్రి పల్లవయుగం సంస్థాప్య సంవిత్ఫలమ్|

సత్త్వం మంత్రముదీరయన్ నిజ శరీరాగారశుద్ధిం వహన్

పుణ్యాహం ప్రకటీ కరోమి రుచిరం కళ్యాణ మాపాదయన్ ||

సాంబశివా! నా శరీరమను గృహమును శుభ్రపరచుకొని, మనస్సున కింపైన కళ్యాణము చేయబూని భక్తి యను దారములను చుట్టి సంతోషమను నీటితో నింపిన నా మనస్సను కలశమున నీ చరణ పల్లవములను, జ్ఞాన మను కొబ్బరి బొండమును చేర్చి కలశ స్థాపన చేసి మంత్ర పూర్వక పుణ్యాహవాచనము భక్తితో నాచరింతును.

నిజమైన భక్తుడు తన శరీరాన్ని గృహంగాను,తన హృదయాన్ని పరమ పవిత్రంగాను ఉంచు కుంటాడని చెప్తూ భక్తుని దేహాన్ని ఇంటితో పోల్చారు. ఇంటికి పరిశుద్ధిని పవిత్రతను చేకూర్చే పుణ్యాహవాచన క్రతువులో ప్రధానమైన కలశ పాత్రతో ఆ భక్తుని హృదయాన్ని పోల్చారు. ఈ హృదయ కలశం భక్తి అనే ద్వారాలతో చుట్టబడాలిట. సంతోషమనే ఉదకంతో నింపబడాలిట. అటువంటి హృదయ కలశం లో శివుని పాదాలనే చిగురుటాకులు ( మామిడి చిగుళ్ళు) ఉంచి పైన జ్ఞానమనే టెంకాయ వుంచాలిట. - శివ స్మరణ అనే మంత్రాలను ఉచ్చరించాలిట. అప్పుడు హృదయానికి పవిత్రత, పరిశుద్ధి, పాత్రత చేకూరుతుందిట.

మైలగాని, పురుడు గాని వచ్చి ఇల్లు, ఇంటిలోని వారు అశౌచంగా వుంటే శుద్ధి రోజున తప్పకుండా విఘ్నేశ్వర పూజ చేసి, పుణ్యాహవాచనం చేసి ఆ కలశాల్లోని పవిత్ర జలాన్ని ఇల్లంతా చల్లాలి. ఇంటిలోని వారి శిరస్సులపై కూడా చల్లాలి. అప్పుడు అశౌచం పోయి అంతా నిర్మలమవుతుంది. అలాగే - భక్తుడు తన హృదయం లోని మాలిన్యాలను తొలగించు కోవడానికి ఈ శ్లోకములో చెప్పిన విధానాన్ని ఆచరించి శివ నామంతో పవిత్రీకరణం చేసుకోవాలి.

---

**37.ఆమ్నాయాంబుధిమాదరేణ సుమనస్సంఘాస్సముద్యన్మనో**
**మంథానం ధృఢభక్తి రజ్జుసహితం కృత్వా మథిత్వా తతః |**
**సోమం కల్పతరుం సుపర్వ సురభిం చింతామణిం ధీమతాం**
**నిత్యానంద సుధాం నిరంతర రమా సౌభాగ్య మాతన్వతే ||**

దేవతలు మందర పర్వతాన్ని కవ్వముగా జేసి, సముద్రము ను మదించి - కల్పవృక్షము, కామధేనువు, చింతామణి, అమృతము, చంద్రుడు మొదలగు

Sri Maha Kameswari Seva Trust

వానిని సంపాదించి నట్లు విద్వాంసులు తమ మనస్సును కవ్వముగా జేసి, భక్తి యను త్రాడుగట్టి, వేదములనెడు మహా సముద్రమును మథించి, అందుండి భక్తులకు కల్పతరువు, కామధేనువు, చింతామణుల వంటి వాడును, నిత్యానంద స్వరూపుడును మోక్షలక్ష్మీ స్వరూపుడు నగు సోమేశ్వరుని సాధించు చున్నారు.

దేవతలు క్షీరసాగరాన్ని మథించినట్లే భక్తులు గూడా వేదమనే పాలకడలిని మథించాలిట. ఇందుకు భక్తితో కూడిన మనస్సును కవ్వంగా ఉపయోగించి మథించాలిట. అంటే, వేదవాఙ్మయాన్ని క్షుణ్ణంగా చదువుకోవాలని అర్థం. ఎందుకంటే - ఆ వేద వాఙ్మయంలో సూక్ష్మంగా అంత స్సూత్రంగా ప్రతిపాదింప బడేది భగవంతుడైన శివుడే కాబట్టి. క్షీరసాగర మథనం జరిపి నప్పుడు దేవతలకు లభించిన కామధేనువు, కల్పవృక్షము, చింతామణి లాంటి శివుడు వేదవాఙ్మయ మథనం ద్వారా లభిస్తాడట. చిట్టచివరకు ఏ భక్తునికైనా దక్కాల్సిన మోక్షసామ్రాజ్యలక్ష్మిని గూడా ఈ వేద వాఙ్మయ మథనం ద్వారానే పొందవచ్చు అని శంకరులు సూచించారు.

---

**38. ప్రాక్పుణ్యాచలమార్గదర్శిత సుధామూర్తిః ప్రసన్నశ్శివ**

**సోమస్సద్గణ సేవితో మృగధరః పూర్ణస్తమోమోచకః |**

**చేతః పుష్కర లక్షితో భవతి చే దానంద పాథోనిధిః**

**ప్రాగల్భ్యేన విజృంభతే సుమనసాం వృత్తిస్తదా జాయతే ||**

పూర్వపుణ్యమనెడి పర్వతము యొక్క మార్గమున ( తూర్పు దిక్కున గల పుణ్యోదయ పర్వతము మీదుగా ) కనబరచునట్టి అమృతమయ మైన ఆకృతి గలవాడును, నిర్మలుడును, సజ్జనులచే సేవింపబడు వాడును, లేడిని ధరించిన వాడును,పూర్ణుడును ( కళలు నిండిన వాడు లేక అంతటా నిండివున్నవాడు), చీకటి ( పెంజీకటిని) పారద్రోలు వాడును అగు శివుడు అనెడి చంద్రుడు హృదయమనెడి ఆకాశమున చూడబడిన వాడైనచో ఆనంద మనెడి సముద్రము మిక్కిలి ప్రబోధ ప్రతిభతో ఉప్పొంగి వెల్లువగును. అప్పుడు శుద్ధాంతరంగులగు విబుధుల చిత్తము రంజిల్లును.

క్రిందటి శ్లోకంలో వేదవాఙ్మయ  మథనం ద్వారా భగవ ద్దర్శనము, మోక్షము సంప్రాప్తిస్తాయి అని చెప్పిన ఆది శంకరులు ఈ శ్లోకములో ఆ భగవంతుడైన శివుణ్ణి చంద్రునితో పోల్చారు. హృదయమనే ఆకాశంలో శివుడనే చంద్రుడు స్థిరపడితే ఆనందమనే వెన్నెల సముద్రం ఉప్పొంగిపోతుందట !

ఈ ఆనంద స్థితి చేకూరిన వారి బ్రతుకే బ్రతుకుట. ఈ ఆనందం దక్కాలంటే వేదశాస్త్ర పఠనాదులచే మనస్సు సంస్కరింప బడాలని సూచించారు. ఎన్నో జన్మల ద్వారా సంక్రమించిన సుకృత ఫలం ద్వారానే ఈ స్థితి సంప్రాప్తిస్తుందని ఈ శ్లోక భావన.

---

**39. ధర్మో మే చతురంఘ్రికః సుచరితః పాపం వినాశం గతం**

**కామక్రోధ మదాదయో విగళితాః  కాలాస్సుఖావిష్కృతః |**

**జ్ఞానానంద మహౌషధి స్సుఫలితా కైవల్యనాథే సదా**

**మాన్యే మానసపుండరీక నగరే రాజావతం సే స్థితే ||**

ధార్మికుడైన రాజు స్వతంత్రుడై నగరమందుండి పరిపాలించు చుండగా దోషములు పోయి భూమి ఫలవంతమై సర్వ సమృద్ధి కలిగినట్లు నా హృదయ పుండరీక మందు పరమేశ్వరుడుమోక్షాధినాథుడై నివసించి యుండ నాకు అరిషడ్వర్గము తొలగిపోయి, జ్ఞాన సాధనములనెడు ఓషధులు ఫలించి సదా సుఖము గలిగినది.

హృదయంలో భగవంతుడైన శివుడు ఉన్నపుడు మాత్రమే ఆ భక్తుని జీవితం ఆనంద భరిత మౌతుందిట. రామరాజ్యం లాగా వర్ధిల్లుతుందిట. ఇదే విషయం భగవద్గీత చివరి శ్లోకంలో చెప్పబడింది. యోగీశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారి యైన అర్జునుడు కలిసి ఎక్కడ ఉంటారో - అక్కడ తప్పకుండా విజయం,విభూతి, వైభవము, ధర్మము, నీతి వుంటాయిట. ద్వాపర యుగంలోని కృష్ణుడు,ధనుర్ధారి అయిన అర్జునుడు కలిసి వున్న రూపమే, అంతకు పూర్వకాలంలో "పినాకపాణి " అయిన " శివుని " గా వూహించుకుంటే - ఎక్కడ శివుడు వుంటాడో అక్కడల్లా సుఖశాంతులు, విజయా నందాలు, నీతిధర్మము

Sri Mahakameshwari Seva Trust

వర్ధిల్లుతాయి అని చెప్పు కోవచ్చు. ఎందుకంటే హృదయం లో యోగమూర్తి అయిన శివుని వలన అంతశ్శత్రువులైన కామ, క్రోధ, లోభ, మద మాత్సర్యాదులు నిర్మూలింపబడి శాశ్వతానందం చేకూరుతుంది కాబట్టి.

---

**40. ధీయంత్రేణ వచోఘటేన కవితా కుల్యోపకుల్యాక్రమై**
**రానీతై శ్చ సదా శివస్య చరి తాంభోరాశి దివ్యామృతైః ।**
**హృత్కేదారయుతాశ్చ భక్తి కలమా స్సాఫల్యమాతన్వతే**
**దుర్భిక్షా న్మమ సేవకస్య భగవ న్విశ్వేశ భీతిః కుతః ।।**


హే భగవాన్ ! నీ చరిత్రయను మహాసముద్రము లోని దివ్యామృతము కవిత్వమను కాలువలు పిల్లకాలువలు మొదలగు వాని గుండా వాక్కు అనెడు బొక్కెనతో నా బుద్ధి యను మోట వలన హృదయమను పొలము లోనికి ప్రవహించి భక్తి యను సస్యమును ఫలవంతముగా చేయుచున్నది. ఇంక ఎంత కఱవు వచ్చినను నాకేమి భయము ?

దక్కవలసినవి పొందవలసినవి దక్కనపుడు,పొందనపుడు ఇంక అవి దక్కవేమో, పొంద లేమేమో అనే భయం పట్టు కుంటుంది. ఈ భయం కఱవు లాంటిది. కఱవు వలన భయం కలుగకుండా వుండా లంటే పుష్కలమైన తిండిగింజ లకు సంబంధించిన పంట పండాలి.అలాగేపొందలేమేమో అనే భయం పోవాలంటే భగవంతుని అనుగ్రహం హృదయం నిండా పండాలి.

భగవంతుని గురించి తెలుసు కున్న కొలదీ ఆయన అనుగ్రహానికి దగ్గఱౌతాము. అంటే భగవచ్చరిత్రలు సమగ్రంగా తెలుసుకొని ఆనందించాలి. హృదయం నిండా ఆనందం పండటానికి అన్నీ ఏర్పాటయే ఉన్నాయని శంకరులు చెప్పుచున్నారు. బుద్ధి ఏతాం లాగా పనిచేస్తే , వాక్కులు ఏతపు కుండల్లాగ పని చేస్తున్నాయట. ఈ వాక్కులనే కుండలతో కవిత్వమనే పిల్లకాలువల మార్గం ద్వారా శివుని చరిత్ర లనే మహా నీరధి నుండి బయలుదేరిన నీరు హృదయం అనే వరిమడిని తడిపి సస్యశ్యామలం చేసి భక్తి అనే 'రాజనాల' జాతి వరి ధాన్యాన్ని పండిస్తున్నాయిట. ఇంక నా హృదయము నిండా ఆనంద మనే

Sri Mahakameswari Sevatrust

ఆహారపు పంట ఉంటే - నా మనుగడకు కఱవు అనే భయం ఎక్కడ ఉంటుంది అని అంటున్నారు - ఈ శ్లోకములో శంకరులు.



**41. పాపోత్పాత విమోచనాయ రుచిరైశ్వర్యాయ మృత్యుంజయ**

**స్తోత్ర ధ్యాన నతి ప్రదక్షిణ నపర్యాలోకనాకర్ణనే ।**

**జిహ్వా చిత్త శిరోరంఘ్రి హస్త నయనశ్రోత్రై రహం ప్రార్థితో**

**మా మాజ్ఞాపయ తన్ని రూపయ ముహు ర్మామేవ మామే2వచః ||**

పరమేశ్వరా ! పాపములు నశించి ఇష్టములు సిద్ధించు టకు పరమేశ్వరుని స్తుతింపు మని నాలుకయు, ధ్యానింపు మని మనస్సును, నమస్క రింపు మని శిరస్సును, ప్రదక్షిణము చేయుమని పాదములును పూజింపుమని చేతులును, చూడుమని కన్నులును, కధలు వినుమని చెవులును నన్ను కోరుచున్నవి. నీ ఆజ్ఞ లేనిదే ఆ కోరిక నెరవేర్పలేను. అట్లు చేయుటకు నన్ను పురి కొల్పుము. మూగతనము, మతిలేనితనము,కుంటి,గ్రుడ్డి తనము మొదలగునవి నాకు రాకుండా చూడుము.

పుణ్యకార్యాలను చేయడం ఇష్టం లేక పోవచ్చు గాని పుణ్యకార్యాలు చేసినందువల్ల వచ్చే ఫలితం మాత్రం పొందాలని కోరుకుంటారుట. కాని, పాపం విషయంలో అలా కాదుట. పాపఫలం రాకూడదు అనుకుంటారు, కాని ప్రయత్న పూర్వకంగా పాపాలు  చేస్తారుట. ఇది సగటు మానవుని లక్షణం.

పాపం చెయ్యడం వల్ల వచ్చే ఉత్పాతాలు రెండు రకాలు. ఒకటి ధర్మశాస్త్ర విరుద్ధమైన కార్యాలు చెయ్యడం వలన వచ్చేవి అయితే - రెండు ధర్మశాస్త్రం విధించిన కార్యాలను చేయకపోడం వల్లవచ్చేవి. దీన్నిబట్టి పాపం చెయ్యడం వలన మాత్రమే పాపం రాదు.ధర్మాన్ని చేయకపోవటం వలన కూడా పాపం వస్తుంది. పాప పుణ్యాల విషయంలో అవగాహన చాలా అవసరం. పాపం చెయ్యటం వలన ఉత్పాతాలు,ఉపద్రవాలు వస్తాయి. అంటే తనకు సంబంధించి చెవిటితనం, మూగతనం,కుంటి తనం, గ్రుడ్డి తనంమొదలైనవి వస్తాయి. పూర్వం చేసిన పాపాలకు ప్రస్తుత జన్మలో ఇలాంటివి వస్తున్నాయి. ప్రస్తుత జన్మలో అయినా పాపాలు చేయకుండా ఉండగలిగితే కానీ వచ్చే జన్మలో ఇవి రాకుండాఉండవు. మన దేహానికి వున్న ఉపకరణాల ద్వారా మంచి పనులు చెయ్యాలి. భగవదను గ్రహం పొందాలి. అందుకని చేతులతో చెయ్యవలసిన ధర్మకార్యాలను చేతులతోనూ, ఇంకా ఇతర పంచేంద్రియాలతో పాడుపనులు చెయ్యకుండా మంచిపనులు జరిగే విధంగానే వాటిని వినియోగిస్తూ, మిగిలిన  కాలంలో భగవంతుని స్తుతిస్తూ, చేతులతో పూజ చేస్తూ, మనస్సులో  ధ్యానిస్తూ చెవులతో భగవత్కధలు వింటూ వుండాలి.

---

**42. గాంభీర్యం పరిఖాపదం ఘనధృతిః ప్రాకార ఉద్యద్గుణ**

**స్తోమశ్చాప్త బలం ఘనేంద్రియచయో ద్వారాణి దేహస్తితః |**

Sri Maha Kameswari Seva Trust

**విద్యా వస్తు సమృద్ధి రిత్యఖిల సామగ్రీ సమేతే సదా**

**దుర్గాతి ప్రియ దేవ మామక మనోదుర్గే నివాసం కురు ||**

దుర్గమంబగు కైలాస పర్వతమున ప్రీతితో నివసించుచున్న దేవా! గాంభీర్యమును అగడ్తగను, ధైర్యమును ప్రాకారముగను ఉదయుంచు సుగుణములను బలముగను,చక్షురాదింద్రియములను ద్వారములగను, పరమ శివ జ్ఞానమును సకల పదార్ధ సంపదగను గలగి , నా మనస్సు ఒక దుర్గము ( కోట ) నకు ఉండవలసిన అన్ని లక్షణములతో సమగ్రముగ నున్నది. దుర్గా ప్రియుండవు గాన నీవిందు నివసింపుము.

తన మనస్సనే గట్టి కోటలోనే స్థిరంగా సౌఖ్యంగా ఉండి పొమ్మని శంకరులు శివుని ప్రార్ధిస్తున్నారు. నా మనస్సు లోపల ఏమున్నదో విప్పిచెప్పితే గాని తెలియదు. అంత గంభీర మైనది అంటే - అంత లోతైనది. కోటకు అగడ్త ఎలాంటిదో నా మనస్సుకు ఈలోతు లక్షణం అలాంటిది. పైగా ఈ చిత్తంలోనే స్వప్నావస్థలో ఆకాశంతో సహా పంచభూతాలన్నింటినీ చూడ వచ్చు. అందువల్ల ఆకాశంకంటే గూడా నా మనస్సే గొప్పది. నా మనస్సు పరిస్థితులకు లొంగి పోనిదై, ధైర్య,స్థైర్యగుణాలు కలిగి వుంటుంది. కోటకు ప్రహరీ ఎలా పని చేస్తుందో నా మనస్సుకు ఈ ధైర్యగుణం అలా పనిచేస్తుంది.కోట లోపల నమ్మదగ్గ సైన్యం వున్నట్లే నా మనస్సులో గూడా దైవీ గుణాలు చాలా వున్నాయి. కోటకు వాకిళ్ళు ఉన్నట్లే నా మనస్సుకు గూడా పంచ జ్ఞానేంద్రియాలున్నాయి. కోటలో అవసరమైన పదార్ధ సంపత్తి వున్నట్లే నా మనస్సులో గూడా అర్ధవంతమైన విద్యోపాసన వుంది. ఈ విధంగా నామనస్సు అన్ని విధాలా సౌకర్యాలతో ధృఢంగా వుండే కోట లాగా వున్నది కాబట్టి వేరే కోట కట్టే ప్రయత్నం చెయ్య నక్కరలేదు. ఓ శివా! ఇంక ఆలస్యం చెయ్య కుండా అందులో ప్రవేశించి స్థిరంగా ఉండిపోవయ్యా అని - ప్రార్ధిస్తున్నారు.

---

**43. మా గచ్ఛస్త్వమితస్తతో గిరిశ భో మయ్యేవ వాసం కురు**

**స్వామిన్నాదికిరాత మామకమనః కాంతార సీమాంతరే |**

Sri Maha Kameswari Seva Trust

**వర్తంతే బహుశో మృగామదజుషో మాత్సర్య మోహాదయ**

**స్తాన్హత్వామృగయా వినోద రుచితాలాభంచ సంప్రాప్స్యసి ||**

ఓ ఆదికిరాతమూర్తీ ! నీవెందునుబోక నా మనస్సు నందే యుండుము. నా మనస్సొక మహారణ్యము. అందు కామక్రోధాదులను క్రూర మృగము లనేకమున్నవి. వానిని వేటాడి వేట యందలి నీ ఆనందమును తీర్చుకొనుము.

శివుడు ఆది బిక్షువే కాదు. ఆది కిరాతకుడు కూడా ! అందుకని శివునికి మృగాలను వేటాడి ఆనందించటం అంటే ఇష్ట ముంటుంది. అయితే ఇలా మృగాలను వేటాడాలంటే దూరంగా ఉండే కారడవులకు వెళ్ళాలి. అది ఎంతో ప్రయాస తో కూడుకున్న పని. అందుకని శంకరులు శివునికి ఒక చక్కని ఉపాయం చెబుతున్నారు. క్రిందటి శ్లోకంలో కోట లాగా వుండే తన మనస్సులో ప్రవేశించు అని ప్రార్థించారు. ఈ శ్లోకములో మృగాలను వేటాడి వినోదించడానికి చాలా అనువుగా తన మనస్సనే అరణ్యం వుందంటున్నారు.

అరణ్యంలో చెట్లూచేమలూ దట్టంగా వున్న ట్లే తన మనస్సు కూడా ఆవేశకావేశాలు, ఉద్రేకాలు, ఆలోచనలు అనే చెట్లూ చేమలతో దట్టంగా పేరుకుపోయి ఉన్నదట ! అరణ్యంలో లెక్కలేనన్ని క్రూరమృగాలున్న ట్లే తన మనస్సనే అరణ్యం లో గూడా కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాది మృగా లున్నాయిట. అరణ్యం సూర్య కిరణాలు కూడా ప్రవేశించలేనంత దట్టంగా ఉంటుంది.

అలాగే తన మనస్సు కూడా వివేక విజ్ఞాన ప్రకాశం లేకుండా -అవిద్య అనే పెంజీకటితో నిండి ఉంటుందిట. అంటే - అరణ్యానికి ఉండవలసిన అన్ని లక్షణాలు తన మనస్సు కు ఉన్నాయి కాబట్టి అనవసరంగా ముసలి ఎద్దును ఎక్కి ప్రయాసపడి దూరంగా ఉండే అరణ్య ప్రవేశం చెయ్యనక్కరలేదుట. తన మనస్సనే అరణ్యం సిద్ధంగా వుంది, వెంటనే ప్రవేశించి మృగాల వేటలో వినోదాన్ని పొందు అంటున్నారు. అంటే మనస్సులోనే శివుడుఎప్పుడూ ఉండిపోవాలి . ఆ మనస్సుని శివుడు ఎలా వినియోగ పరచు కోవాలనుకున్నాడో అందుకు తగిన విధంగా వసతులు కల్పించాలి అని శంకరులు  ప్పుచున్నారు.

Sri Maha Kameswari Seva Trust

**44. కరలగ్న మృగః కరీంద్రభంగో ఘనశార్దూల విఖండనో ऽస్త జంతుః |**

**గిరిశో విశదాకృతిశ్చ చేతః కుహరే పంచముఖో ऽస్తి మే కుతో భీః ||**

చేతియందు మృగము కలవాడును, గజాసురుని సంహరించిన వాడును, ఘనుడైన వ్యాఘ్రాసురుని ఖండించిన వాడును, అంతమును పొందిన ప్రాణి సముదాయము గలవాడును, తెల్లని శరీరము గలవాడును, కొండయందు నివశించు వాడును అగు పంచముఖుడు (శివుడు) నా హృదయమను గుహ యందు విరాజిల్లు చున్నాడు. ఇంక నాకే భయమును లేదు.

'శివుని కుండే లక్షణాలన్నీ సింహానికీ బాగా చెల్లుతాయి అనీ, అటువంటి శివుడు అనే సింహం నా హృదయమనే గుహలో ఉండగా ఇంక నాకేం భయం' అని అంటున్నారు శంకరులు.

సింహం పంజా విసిరి లేడిని అవలీలగా పట్టుకొని వుంటుంది. అటువంటి లేడి శివుని చేతిలో గూడా వుందిట సింహం ఏనుగునిచంపుతుంది. శివుడు కూడా గజాసురుణ్ణి చంపాడు. సింహం పులిని కూడా చంపుతుంది. శివుడు కూడా వ్యాఘ్రాసురుణ్ణి చంపాడు. సింహం కడుపులో ఎన్నో మృగాలు ఉంటాయి. అలాగే శివుని కడుపు నిండా స్థావర జంగమాత్మకమైన విశ్వం నిండి ఉంటుంది. సింహం లాగే శివుడు కూడా కొండమీద ఉంటాడు. సింహం తెల్లగా ఉంటుంది. శివుడు కూడా శుదస్ఫటిక వర్ణంలో తెల్లగా ఉంటాడు. సింహానిది పంచముఖం, అంటే విశాలమైన నోరు కలది. శివుడు కూడా పంచముఖుడే. కాబట్టి సింహం లాంటి శివుడు నా హృదయము లోనే సదా నివసిస్తూ వుంటే ఎవరివల్ల తనకు భయముంటుంది. చివరకు మృత్యువు వలన కూడా భయం వుండదు అని నిక్కచ్చిగా నమ్మకంతో చెప్పారు.

మనం కూడా శివుని లాంటి పెద్దవారి అండ చూసుకుంటే ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆయన ఆదుకొని మనల్ని రక్షిస్తాడు. కాబట్టి మీరు కూడా ఎందుకు ఆ శివుణ్ణి హృదయము లో ప్రతిష్ఠించుకోకూడదు ?

అని మనకు సలహా ఇస్తున్నారన్నమాట !

---

Sri Maha Kameswari Seva Trust

**45. ఛందశ్శాఖిశిఖాన్వితై ర్ద్విజవరైస్సంసేవితే శాశ్వతే**

**సౌఖ్యాపాదిని ఖేదభేదిని సుధాసారైః ఫలైర్దీపితే ।**

**చేతః పక్షి శిఖామణే త్యజ వృథా సంచారమన్యైరలం**

**నిత్యం శంకరపాదపద్మ యుగళీనీడే విహారం కురు॥**

ఓ మనస్సనెడుపక్షీ ! ఇటునటు తిరిగి యేల శ్రమపడెదవు. పరమేశ్వరుని పాదద్వందము ఒక చక్కని పక్షి గూడు వలె నున్నది. దానికెన్నడును చలనము లేదు. అందు మంచి వెలుతురు గలదు. అది మిక్కిలి సౌఖ్యమిచ్చును. అమృత ఫలము గలిగి దుఃఖ నివారకమై యున్నది. అందు విహరించి యానందింపుము. అనేక ద్విజసత్తము లాయా శాఖాగ్రములకు సంబంధించి యుండి దాని నాశ్రయించు చుందురు. నీవును ఇతరాశ్రయము వదిలి దానిని ఆశ్రయింపుము.

ఇంతవరకు శివుణ్ణి వేటగాని తోను, ఆదిభిక్షువు గాను, సింహం గాను వర్ణిస్తూ వచ్చిన శంకరులు ఈ శ్లోకములో మనస్సు ను ఒక పక్షి గాను, శివుని పాదార విందాలను ఆ పక్షి ఆశ్రయించ వలసిన గూడు గాను వర్ణిస్తున్నారు.

పక్షి ఒకచోట స్థిరంగా వుండదు. ఎప్పుడూ అటూఇటూ తిరుగు తూనే వుంటుంది. మనస్సు కూడా స్థిరంగా ఉండదు. అన్ని విషయాలు, అందరి వ్యవహారాలు దీనికే కావాలి. తనక్కావలసినవి పొందేవరకు నానా తిప్పలు పడి సాధిస్తుంది. మెదడుకు కావలసిన మేత ( జ్ఞానం) - అన్ని చోట్లకు తిరగాల్సిన అవసరం లేకుండా స్థిరమైన ఒక చోటే లభిస్తే దాన్ని ఆశ్రయించడమే మేలు కదా! అలాంటి గూడు లభిస్తే పక్షి మాత్రం ఎందుకు అలా నానా అగచాట్లు పడుతుంది. గూడునే ఆశ్రయించుకొని వుంటుంది. శివుని పాదార విందాలు సకల సౌభాగ్యాన్ని, సంపదను, జ్ఞానాన్ని, సుఖాన్ని ఇవ్వగలిగిన నివాసం లాగా ఉన్నప్పుడు - మనస్సనే పక్షి ఆ పాదాలు అనే గూటినే ఆశ్రయిస్తే ఎంతో మేలు కదా ! పైగా పాదాలు ఆశ్రయిస్తే ఎలాంటి వారైనా కరిగిపోయి కాదనలేక ఆశ్రయమిస్తారు కూడా కదా ! అంటున్నారు శంకరులు.

Sri Maha Kameswari Seva Trust




46. ఆకీర్ణే నఖరాజికాంతివిభవై రుద్యత్సుధావైభవై
రాధౌతేఽపి చ పద్మరాగలలితే హంసవ్రజై రాశ్రితే ।
నిత్యం భక్తివధూగణైశ్చ రహసి స్వేచ్ఛా విహారం కురు
స్థిత్వా మానస రాజహంస గిరిజానాథాంఘ్రి సౌధాంతరే ॥

మనస్సనెడి రాజహంసమా! గోళ్ళ వరుసకు సంబంధించిన కాంతి వైభవముతో కూడుకొని నదియు, ఉద్భవించుచున్న అమృతము వ్యాపించుటచే కడుగబడినదియు, పద్మముల వంటి వన్నెతో ఇంపైనదియు, పరమహంసల గుంపులచే సేవింపబడునదియు అగు పార్వతీ పతి యొక్క పాద మనెడి మేడయందు ఏకాంతమున భక్తి రూపము లైన భార్యలతో గూడ నిరంతరము స్వేచ్ఛగా విహరింపుము.

ఈసారి శివుని పాదార  విందాలను ఒక దివ్య సౌధంగా వర్ణించి, మనస్సనే రాజహంసను ఆ సౌధాన్ని ఆశ్రయించుకొని నిరంతరం స్వేచ్ఛగా విహరించమని సలహా ఇస్తున్నారు.

శివుని పాదాల గోళ్ళనుండి వచ్చే కాంతి నలుమూలలా ప్రసరించడం వలన పాద యుగళ భవనం ఎప్పుడూ కావలసినంత వెలుగు తోను, వెలుతురు తోను విరాజిల్లుతూ ఉంటుందిట! శివుని తలపై వున్న చంద్రుడు అమృతాన్ని స్రవిస్తూ నిత్యం ఆయన పాదాలను కడుగుతూ పరిశుభ్రత ను చేకూరుస్తూ వుంటాడుట.ఆ పాదాలు పద్మాల అందాలను మించిన అందంతో వుంటాయిట. పరమ హంసలు ( యుక్తాయుక్త వివేక జ్ఞానం సంపూర్ణంగా కలిగిన వారిని పరమహంసలంటారు) నిత్యం ఆ శివుని పాదాలను సేవిస్తూ వుంటాయిట.రకరకాల భక్తి పద్ధతులు అనే ఆడు హంసలను గూడా తోడు చేసుకొని అటువంటి శివుని పాదయుగళమనే దివ్య సౌధాన్ని ఆశ్రయించుకొని ఎందుకు సుఖంగా వుండ కూడదు? అని శంకరుల సలహా

( ఆ పరమహంసలలో శంకర భగవత్పాదులు గూడా వుంటారు కదా! అటువంటి వారి సాన్నిధ్యం ఎంతో అదృష్టం ఉంటే గాని లభించదని తెలుసుకొని వెంటనే మానస హంసను శివపాదపరం చెయ్యాలి.)

---

**47. శంభుధ్యాన వసంత సంగిని హృదారామే2ఘ జీర్ణచ్ఛదా**

**స్రస్తా భక్తి లతాచ్ఛటా విలసితా పుణ్య ప్రవాళశ్రితాః |**

**దీప్యంతే గుణకోరకా జపవచః పుష్పాశ్చ సద్వాసనాః**

**జ్ఞానానంద సుధా మరంద లహరీ సంవిత్ఫలాభ్యున్నతిః ||**

Sri Maha Kameswari Seva Trust

పరమేశ్వర ధ్యానమనెడి వసంత ఋతువు తోడి సంబంధము సంప్రాప్త మగుటచే నా మనస్సను పూలతోటలో పాపము లన్నియు పండుటాకులుగా రాలినవి. పుణ్యములు చిగురుటాకులుగా మొలకలెత్తినవి. వానిపై సద్గుణములు మొగ్గలుగా బయలుదేరినవి. భక్తి లతలు సాగుచున్నవి . అందు జపవచనములు పుష్పములు గా నుదయించినవి. సత్కర్మ సంస్కారములు సువాసన వెదజల్లుచున్నవి. జ్ఞానానందములు అమృత మకరందములుగా ప్రవహించుచున్నవి. బ్రహ్మ జ్ఞానము ఫలముగా స్ఫురించుచున్నది.

ఈ శ్లోకములో శివుని సాన్నిధ్యాన్ని వసంత ఋతువు తో పోల్చి దీనితోడి సంబంధం వలన హృదయమనే పూలతోటకు చేకూరే వివిధ సదవకాశాలను వర్ణిస్తున్నారు.

---

**48. నిత్యానంద రసాలయం సురముని స్వాంతాంబుజాతాశ్రయం**

**స్వచ్ఛంద సద్ద్విజ సేవితం కలుషహృత్సద్వాసనా విష్కృతమ్।**

**శంభుధ్యానసరోవరం వ్రజమనోహంసావతంస స్థిరం**

**కిం క్షుద్రాశ్రయపల్వలభ్రమణ సంజాత శ్రమం ప్రాప్స్యసి ||**

ఓ మనోరాజహంసమా ! క్షుద్ర దేవతల నాశ్రయించుట వలన కొన్ని పాపములు తొలగిన తొలగుగాక ! శాశ్వతానందము చేకూరదు. శంభు ధ్యానము చేయుము.అది గొప్ప సరోవరము. సత్కర్మ సంస్కారమున గాని లభించదు.

పరమేశ్వర ధ్యానాన్ని ఒక ఉత్తమ సరస్సుతో పోల్చారు. మనస్సును రాజహంస తో పోల్చి ఆ ఉత్తమ సరస్సును ఆశ్రయించి శాశ్వత సుఖాన్ని పొందమంటున్నారు

సరస్సులో పద్మాలుంటే - పరమేశ్వర ధ్యాన సరస్సును ఆశ్రయించుకొని మహర్షులు, దేవతలు,హృదయమనే పద్మాలు వుంటాయి. సరస్సులో పద్మాల పరిమళాలు వుంటే - ధ్యాన సరస్సులో సంస్కారపూరితమైన సద్వాసనలు వుంటాయి.

Sri Maha Kameswari Seva Trust

సరస్సును రాజహంసలు ఆశ్రయించుకొని వుంటే - ధ్యాన సరస్సును వివేక జ్ఞానం గల పరమహంసలు ఆశ్రయించుకొని వుంటారు.

ఈ రెంటిలో నిమగ్నమైనపుడు పాపతాపాలు పోతాయిగాని, ఈశ్వర ధ్యాన సరస్సును ఆశ్రయిస్తే ఇంకా అదనంగా బంధ విముక్తి శాశ్వత ఆనందసుఖాన్ని కూడా పొందవచ్చును.

---

**49. ఆనందామృతపూరితా హరపదాంభోజాలవాలోద్యతా**

**స్థైర్యోపఘ్నముపేత్య భక్తి లతికా శాఖోపశాఖాన్వితా ।**

**ఉచ్చైర్మానసకాయమానపటలీ ఆక్రమ్య నిష్కల్మషా**

**నిత్యాభీష్ట ఫలప్రదా భవతు మే సత్కర్మ సంవర్ధితా ।।**

ఈశ్వర సేవాను రక్తి నీరుగను, శివుని పాదపద్మములను పాదుగను, చిత్తస్థైర్యము ప్రాకుడుకంపగను, చక్కగా బయలుదేరి చిలువలుపలువల నల్లు కొనుచు క్రమముగా ఉన్నతమైన నా మనస్సను పందిరి యంతట అలముకొని చీడ మొదలగు దోషములచే చెడిపోకుండా నున్న ఈ భక్తి లతను పురాకృత పుణ్యకర్మ యను దోహదముచే పెంపొంది నా మనోభీష్టమగు శాశ్వత ఫలంబు ఫలించుగాక !

పరమేశ్వరుని పాదపద్మాన్ని పాదుతో పోల్చారు. భక్తిని లతతో పోల్చారు. శివ పాదాలనే పాదు నుండి బయలుదేరిన భక్తి లతకు భక్తుల ప్రేమే నీరుగా పని చేస్తుందిట. నీటిలో అన్ని కరుగునట్లే ప్రేమలో అన్నీ కరిగిపోతాయి. భక్తి లోని స్థిరత్వమే ఈ భక్తి లతకు నిలువుగా ప్రాకడానికి వీలుగా వుండే వెదురు కర్ర. విస్తరించి వుండే మనస్సే పందిరిగా పని చేస్తుందిట. అప్పుడు ఈ భక్తిలత చక్కగా మనస్సు నిండా అల్లుకుని ఆవరిస్తుందిట.

శ్రవణ స్మరణ కీర్తనాదుల వలన వృద్ధి చెంది పరిపక్వ స్థితికి వచ్చి అభీష్టాలకు ఫలాలను ఇస్తుందిట. చివరకు శాశ్వతమైన మోక్షఫలాన్ని గూడా ఇస్తుంది. భగవంతుని పాదాలపై నే భక్తి ఉంటే కావలసినవన్నీ అవసరమైన వేళల్లో ఏర్పాటౌతాయి అని శంకరులు సూచిస్తున్నారు.

---

Sri Maha Kameswari Trust

**50. సంధ్యారంభ విజృంభితం శ్రుతిశిరః స్థానాంతరాధిష్టితం**

**సప్రేమ భ్రమరాభిరామ మసకృత్సద్వాసనా శోభితమ్ ।**

**భోగీంద్రాభరణం సమస్త సుమనః పూజ్యం గుణావిష్కృతం**

**సేవే శ్రీ గిరి మల్లికార్జునమహాలింగం శివా22లింగితమ్ ।।**

శ్రీశైల పర్వత మందున్న మల్లికార్జున మహాలింగము మల్లెతీగ అల్లు కొన్న మద్ది చెట్టుతో పోల్చి వర్ణించబడినది. ఈశ్వరుడు సాయంకాలమున తాండవ నృత్యముతో భక్తుల నానందపరచును. అది పుష్ప వికాసములతో తాండవించి ఆనందపరచును. శివుడు శ్రీశైల మందు గాక ఉపనిషత్తుల యందుండును. దాని పుష్పములు శ్రవణముల యందు శిరస్సుల యందు అలంకారములుగా నుండును. మల్లికార్జునుడు భ్రమరాంబ తోడను అర్జున వృక్షము భ్రమరములతోడను గూడి యొప్పును. ఈశ్వరునకు సద్వాసన అనగా సాధుభావన యొక్క శోభయు, దాని సువాసన యొక్క శోభయు గలదు. భోగీంద్రుడనగా శేషాహి శివుని యాభరణము. భోగీంద్రులనగా మహాభోగ

వంతులకు దానిపూలు అలంకారములు. శివుడు సుమనః పూజ్యుడనగా సర్వదేవతల చేతను పూజింపబడువాడు. దాని పుష్పములు అన్ని పుష్పముల కంటెను మిక్కిలి శ్లాఘనీయములు. భగవంతుడు సత్త్వము వలన తెలియబడును. అది సుగంధ గుణమున తెలియనగును. అట్టి మల్లికార్జున దేవుని భజించెదను.

శంకర భగవత్పాదులు శిష్యగణంతో పాదచారియై భారతదేశం అంతా పర్య టించారు. అలా పర్యటిస్తున్న సందర్భంలో మన ఆంధ్రప్రదేశ్ లోని శ్రీశైల మహా పుణ్య క్షేత్రాన్ని గూడా దర్శించేరు. సరిగ్గా అప్పుడు సంధ్యాకాలం అయింది. అక్కడ మల్లెతీగ అల్లు కొనిన మద్ది చెట్టును ఒక దానిని చూశారు. ఆ చెట్టును ఉపమానంగా చేసుకుని చెప్పిన మహాద్భుత మైన శ్లోకమే ఇది. దీని తరువాత వచ్చే శ్లోకం కూడా శ్రీశైల మల్లికార్జున స్వామిని ఉద్దేశించి చెప్పినదే ! మొత్తం 100 శ్లోకాలున్న ఈ శివానందలహరి స్తోత్రంలో ఈ రెండు శ్లోకాలు సరిగ్గా మధ్యలో ప్రాణప్రదంగా వుండటం విశేషం

Sri Maha Kameswari Seva Trust

" శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే "- అన్న సూక్తిని - ఇలా స్తోత్ర మధ్యంలో ప్రాణప్రదంగా వున్న ఈ రెండు శ్లోకాలు ధ్రువపరుస్తాయి.

ఈ శ్లోకములో శివుణ్ణి మద్ది చెట్టుతోను శ్రీశైల భ్రమరాంబ ను ఆ మద్ది చెట్టును చుట్టుకొని వున్న మల్లెతీగ తోను పోల్చి చెప్పారు. పగటికి రాత్రికి మధ్య ఉన్న కాలాన్ని సాయం సంధ్యా కాలం అంటారు. సూర్యుడు అస్తమించిన తరువాత నక్షత్రాలు ఇంకా రాకుండా వున్న మధ్య సమయాన్ని సాయంసంధ్యాకాలం అంటారు. ఈ కాలాన్నే ప్రదోషకాలం అని కూడా అంటారు. ఈ సంధ్యాకాలం వచ్చే సమయానికి శివుడు తాండవ నృత్యం చేస్తూ విజృంభిస్తాడు. అందుకనే ఆ సంధ్యా సమయంలో శివస్మరణ చేయుమని మన పెద్దవాళ్ళు చెబుతారు. మద్ది చెట్టు కూడా ఈ ప్రదోషకాలం లో పూలు విరిసి విరాజిల్లు తుంది. సంస్కృతంలో చెవుల్ని శ్రుతులని, తలని శిరస్సని అంటారు. అంటే - ఈ చెవులు - తలలు, శ్రుతి శిరస్సు లన్నమాట ! శ్రుతులు అంటే వేదాలని అర్ధం. ఈ వేదాలకు శిరస్థానంతో పోల్చదగినవి ఉపనిషత్తులు. అందుకని ఉపనిషత్తులను శ్రుతిశిరస్సు

లని అంటారు. శ్రుతి శిరస్సు లను అధిష్టించడం అంటే , శివుని పరంగా - ఉపనిషత్తుల్లో ప్రతిపాదింపబడేవాడని, మద్ది చెట్టు పరంగా - దాని పూలు చెవుల్లోను నెత్తిమీద పెట్టుకునే సంబంధం కలిగినది గాను - ఈ విశేషణం చెల్లుతుంది.

ప్రేమతో కూడిన భ్రమరాంబిక సరసన మనోహరంగా వున్న - అని శివుని పరంగాను, భ్రమరం అంటే తుమ్మెద కాబట్టి - పూలపై వ్రాలి వుండే తుమ్మెద లతో మనోహరంగా వున్న - అని మద్ది చెట్టు పరంగాను అర్ధం చెప్పుకోవాలి.

" అసకృత్" అంటే ఎల్లప్పుడూ ఆశ్రయించుకొని ఉండే సాధుపుంగవులతో శోభిల్లుతూ ఉండేవాడని శివుని పరంగాను, అల్లుకున్న మల్లెపూల సువాసనలతో శోభిల్లేదిగా మద్ది చెట్టు పరంగాను అర్ధం చేసుకోవచ్చు.

భోగీంద్రుడు అంటే సర్పరాజు అయిన వాసుకుని మెడలో ఆభరణంగా కలిగిన శివుని పరంగాను, మహాభోగ సంపన్నుల అలంకార ప్రాయమైన మద్ది చెట్టు పుష్పాలను అర్ధం చేసుకోవచ్చు.

Sri Maha Kameswari Seva Trust

' సుమనస్సు' లంటే దేవతలు అనే అర్ధంలో దేవతల చేత పూజింప బడేవాడని శివుని పరంగాను, సుమనస్సులంటే మంచి పుష్పాలనే అర్ధం మద్ది చెట్టు పరంగాను చెప్పుకోవాలి.

మంచి గుణములచే ప్రకటిత మయేవాడని శివుని పరం గాను,గుణము అనగా దారము అనే అర్ధము లో దారాలచే సూత్రీకరింపబడే పూలతో మద్ది చెట్టు పరంగాను అర్ధం చెప్పు కోవాలి.

ఈ విధంగా శ్రీశైలంలో వేంచేసి యున్న మల్లికార్జున స్వామిని -' శివాలింగితం ' ( శివలింగంలో పానుపట్టం పార్వతిని సూచిస్తుంది ) అంటే - పార్వతి చే ఆలింగనం చేసుకొన బడిన వాడును అయిన - మహాలింగ స్వరూపుణ్ణి నేను సేవించుచు న్నాను. అని ఈ శ్లోక సారాంశము.



Sri Mallikarjuna Seva Trust



**51. భృంగీచ్ఛానటనోత్కటః కరిమదగ్రాహీ స్ఫురన్మాధవా**

**హ్లాదో నాదయుతో మహాసితవపుః పంచేషుణా చాదృతః |**

**సత్పక్షస్సుమనో(2) వనేషు స పున స్సాక్షాన్మదీయే మనో**

**రాజీవే భ్రమరాధిపో విహరతాం శ్రీ శైల వాసవీ విభుః ||**

శ్రీశైల వాసీ! భ్రమరాంబాధిపతీ ! నీవు భ్రమరాధిపతివి అనగా తుమ్మెదరేడు. గావున నా మనః పద్మమున సంచరింపుము. నీవు - భక్తుడు భృంగీశ్వరుని ఇచ్ఛాను గుణముగా వర్తింప జూతువు. తుమ్మెద రేడు - భృంగియనగా తుమ్మెదలజాతి దాని అపేక్ష ననుసరించి నడచును. నీవు గజాసురుని గర్వము నిగ్రహించితివి. అది ఏనుగుల మదోదకము గ్రహించును. నీకు మోహినీ రూపము ధరించిన మాధవుని యందాహ్లాదము స్ఫురించింది. దానికి మాధవ అనగా వసంతము నందా హ్లాదము. నీకు ప్రణవ నాదము. దానికి ఝుంకారనాదము. మన్మథుడు నిన్ను పుష్ప బాణముతో నాదరించెను. దానిని సహాయముగా నాదరించెను. నీకు విబుధరక్షణ మందభి మానము. దానికి పూలతోట యందభిమానము. కాబట్టి నా మనఃపద్మ మందు ఎడబాయకుండుట సహజమే కావున అందు విహరింపుము.

ఈ శ్లోకము కూడా శ్రీశైల మల్లికార్జున స్వామిని ఉద్దేశించి చెప్పినదే. ఈ శ్లోకములో మల్లికార్జున స్వామిని భ్రమరనాథునిగా వర్ణించి చెప్పడం జరిగింది. అంటే - ఈ శ్లోకములో మల్లికార్జున స్వామి కి ఉపయోగించిన విశేషణ పదాలన్నీ భ్రమరాధిపుడు అంటే భృంగరాజుకు గూడా చెల్లుతాయి.

భృంగి అనే ప్రమథుని యొక్క అభిప్రాయానుసారంగా నర్తించుట యందు ఎక్కువ ఇష్టపడువాడు అని - మల్లికార్జున స్వామి పరంగా చెప్పుకోవాలి.

ఆడతుమ్మెద ఇష్టానుసారం నర్తించుటలో ఎక్కువ ఇష్టపడునది అని - భృంగాధిపతి పరంగా చెప్పుకోవాలి.

గజాసురుని బల గర్వాన్ని అణచిపెట్టినవాడు అని - శివుని పరంగాను, ఏనుగు మదాన్ని గ్రహించే స్వభావము గలది అని - భ్రమరాధిపతి పరంగాను అర్థం చెప్పుకోవాలి.

Sri Maha Kameswari Seva Trust

మోహినీ రూపుడైన విష్ణు మూర్తి ( మాధవుని ) యందు ఆనందం కలిగి యున్నాడని - శివుని పరంగాను, మాధవ అనే పదానికి మాధవమాసం ( వసంత ఋతువు కు సంబందించిన వైశాఖ మాసం) అనే అర్ధంలో వసంత ఋతువులో మరింత ఆనందంతో ప్రకాశించేది అని - భ్రమరరాజు పరంగా అర్ధం చెప్పుకోవాలి.

' నాదయుతః' అంటే ప్రణవ నాద ప్రతిపాదితుడైన వాడు అని - శివుని పరంగా అర్ధం చెప్పుకోవాలి. ' నాదయుతః' అంటే ఝుంకార ధ్వనితో గూడి ఉన్నటువంటి అని భ్రమరరాజు పరంగా అర్ధం చెప్పుకోవాలి.

మహాసితవపుః ( మహా + సిత + వపుః) అనగా తెల్లని శరీరఛ్ఛాయ గలిగినవాడు అని - శివుని పరంగాను, మహా +అసితవపుః) గొప్పనల్లని శరీరఛాయ గలిగినట్టి అని - భ్రమర రాజు పరంగాను అర్ధం చెప్పుకోవాలి.

పంచేషుడు అంటే మన్మథుడు అనే అర్ధంలో మన్మధుని చేత బాణలక్ష్యంగా ఆదరింప బడినవాడు అని - శివుని పరంగాను, మన్మధునికి సహాయకారిగా ఆదరింప బడినట్టిది అని - భ్రమరరాజు పరంగాను అర్ధం చేసుకోవాలి. 'సుమనస్సు' వుంటే దేవతలు లేదా విద్వాంసులు కాబట్టి ఆ

దేవతల లేదా విద్వాంసుల యొక్క సంరక్షణ యందు అభిమానము కలిగి యున్నట్టి వాడు అని - శివుని పరంగాను, పువ్వుల తోటలయందు అభిమానము కలిగియున్నట్టి - అని భ్రమరరాజు పరంగా అర్ధం చెప్పుకోవాలి.

ఈ విధంగా నా కన్నులయెదుట శ్రీశైల మందు లింగరూపంలో వున్న భ్రమరాంబాధిపతి ఎప్పుడూ నా మనస్సనే పద్మం మీదనే వసించుగాక - అని ఈ శ్లోకము నకు అర్ధము.

ఇంతకుముందు శ్లోకం, ప్రస్తుత శ్లోకం తెలుగు నేలలో వేంచేసిన మల్లికార్జున స్వామి మీద శంకరులు వ్రాసిన అద్భుతమైన శ్లోకాలు అవడం మన అదృష్టం. " కాశీలో మరణిస్తే మోక్షం లభిస్తుందని అంటారు. శ్రీశైల గోపురం శిఖరం చూస్తేనే చాలు ఇంక పునర్జన్మ ఉండదు అంటారు.అంటే కాశీలో మరణించిన తరువాత సాధించేదాన్ని శ్రీశైల శిఖరం చూస్తూ బ్రతికి ఉన్నప్పుడే సాధించవచ్చన్నమాట ! ఈ రెంటినీ అర్ధం చేసుకుంటే శ్రీశైలం ఎంత గొప్ప పుణ్య క్షేత్రమో, అందలి మల్లికార్జున స్వామి ఎంతటి మహిమాన్వితమైన దైవమో అర్ధమవుతుంది.

---

Sri Maha Kameswari Seva Trust

**52. కారుణ్యామృత వర్షిణం ఘన విపద్గ్రీష్మచ్ఛిదా కర్మఠం**
**విద్యాసస్య ఫలోదయాయ సుమనస్సంసేవ్యమిచ్ఛా కృతిమ్ ।**
**నృత్యద్భక్తమయూర మద్రినిలయం చంచజ్జటా మండలం**
**శంభో వాంఛతి నీలకంధర సదా త్వాం మే మనశ్చాతకః ||**

నీలకంధరా! నా మనస్సను చాతకము నీలమేఘమును వలె వాంఛిత సిద్ధికై నిన్ను దర్శింప వేచియున్నది. మేఘము జలము వర్షించును. నీవు దయామృతము కురిపింతువు.అది గ్రీష్మ తాప మడంచును. నీవు సంతాపము లడంతువు. అది సస్యములను పండించును. నీవు విద్యా సస్యమును పండించి బ్రహ్మానందాన్ని ఫలముగా నిత్తువు. దేవతలు, పండితులు నిన్ను భజింతురు. కర్షకులు మేఘుని భజింతురు. మయూరములు నల్లని మేఘ మును చూచి నాట్యము చేయును. నీవు కైలాస పర్వత మున నాట్యము చేయుదువు. మేఘుడును పర్వతమున నుండును.కామరూపమును, జటా వల్లియు నిరువురకును గలదు.

ఈ శ్లోకములో శంకరులు శివుణ్ణి నీలమేఘంతో పోల్చి ప్రార్థించేరు. మేఘంలాగ ఉండాలంటే నల్లగా ఉండాలి. శివుడు నీల కంఠుడే గదా! మేఘం నీటిని వర్షిస్తుంది. శివుడు కూడా కరుణా మృతాన్ని వర్షిస్తాడు! మేఘం తాపాన్ని చల్లార్చి ఉప మిస్తుంది. శివుడు కూడా ఆపదల్లో ఆదుకొని కష్ట నష్టాలను దూరం చేస్తాడు. మేఘం సస్యాలను పండింప చేస్తుంది. శివుడు విద్యను పండింప చేస్తాడు. మంచి మనస్సు కలవారందరూ సకాల వర్షాలు పడాలని మేఘాలను కోరుకుంటారు. దేవతలు, మంచి మనస్సు కలవారు శివుణ్ణి ప్రార్థిస్తారు. మేఘం లాగే శివుడు కూడా రకరకాల ఆకారాలను రూపాలను ధరిస్తాడు. మేఘాన్ని చూసి నెమళ్ళు నృత్యం చేసినట్లే - శివుణ్ణి చూచి భక్తులు నృత్యం చేస్తారు. మేఘం లాగే శివుడు కూడా కొండ మీద ఉంటాడు. మేఘానికి మెరుపు తీగలున్న ట్లే - శివుని క్కూడా ప్రకాశ వంతమైన జడలుంటాయి. మేఘం కొరకు చాతక పక్షి పరితపించినట్లే - శివుని కొరకు భక్తులు పరితపిస్తారు. ఇలా ఎన్ని విధాలుగా చూసినా మేఘానికున్న లక్షణాలన్నీ శివునికి వున్నాయి. కాబట్టే - శివుణ్ణి నీలిమేఘం తో పోల్చి మనస్సనే చాతకపక్షిని ఆ నీలకంఠ మేఘాన్ని ఆశ్రయించి ఆనందించమన్నారు.

Sri Maha Kameswari Seva Trust

**53. ఆకాశేన శిఖీ సమస్త ఫణినాం నేత్రా కలాపీ నతా**
**నుగ్రాహిప్రణవోపదేశనినదైః కేకీతి యో గీయతే|**
**శ్యామాం శైలసముద్భవాం ఘనరుచిం దృష్ట్వా నటంతం ముదా**
**వేదాంతోపవనే విహారసికం తం నీలకంఠం భజే ||**

నీలకంఠుడును, వ్యోమకేశుండును, నాగయజ్ఞోపవీతుండును, ప్రణవోపదేశము చేత భక్తుల ననుగ్రహించువాడును, పార్వతీ వల్లభుండును, వేదాంతవేద్యుండును - అగు నీలకంఠుని భజించెదను.

క్రిందటి శ్లోకంలో శివుని నీలమేఘంతో పోలిస్తే - ఈ శ్లోకములో శివుణ్ణి నెమలితో పోల్చి స్తుతిస్తున్నారు. నెమలికి తలపై శిఖ ఉన్నట్లే శివునికి కూడా ఆకాశం జటాజూటంలా వుంటుంది. నెమలికి పింఛం అలంకారంగా వుంటే - శివునికి మెడలో వాసుకి అలంకారంగా వుంటుంది. నెమలి - ' కేకా ' ధ్వని చేయగలిగితే శివుడు అన్ని ధ్వనులకు మూలమైన ఓంకారాన్నే తన నామంగా కలవాడు.

నెమలి పర్వతం పైన చరించే నీలమేఘుం తాలూకు మెఱపు కాంతిని చూడగానే నాట్యం చేస్తుంది. శివుడు కూడా శ్యామల వర్ణంతో వుండి మెఱపు కాంతులు విరజిమ్మే పర్వత పుత్రికను చూడగానే ఆనందంతో నాట్యం చేస్తాడు. నెమలి శ్రుతి శిరస్సులలో ( చెవుల్లోను, నెత్తిపైనీ పెట్టుకొనే పూలుండే తోటలో ) విహరిస్తే - శివుడు శ్రుతి శిరస్సులలో ( ఉపనిషత్తులలో) విహరిస్తాడు. ( అంటే ప్రతిపాదింప బడతాడు అని) నెమలిదీ, శివునిదీ కూడా నీలకంఠమే!

ఇన్ని రకాలుగా సాదృశ్యం వుండబట్టే శంకర భగవత్పాదులు శివుణ్ణి నెమలి తో పోల్చి ఆ నీలకంఠుణ్ణి భజిస్తున్నానని చెప్పారు.

---

**54. సంధ్యా ఘర్మదినాత్యయో హరికరాఘాత ప్రభూతానన**
**ధ్వానో వారిదగర్జితం దివిషదాం దృష్టిచ్ఛటా చంచలా |**
**భక్తానాం పరితోషభాష్పవితతి ర్వృష్టిర్మయూరీ శివా**

Sri Maha Kameswari Seva Trust

**యస్మిన్నుజ్జ్వల తాండవం విజయతే తం నీలకంఠం భజే ||**

ప్రదోషకాలమనువర్షాకాలమునవిష్ణువు వాయించు మద్దెల చప్పుడు ఉఱుము గాను, ఆకాశమందుండి చూచు దేవతలచూపులు మెఱుపులు గాను, భక్తుల సంతోష ప్రవాహము ధారావర్షముగాను, ప్రకాశింపగా -మయూరీ మయూరములుగా తాండవ క్రీడాసక్తులైన పార్వతీ పరమశ్వరులను భజింతును .

ఈ శ్లోకములో కూడా శివుణ్ణి నెమలితో పోల్చి, అటువంటి నీలకంఠుడనే నెమలి చేసే తాండవ నృత్యం అతి మనోహరంగా ఉంటుందని, అలా నృత్యం చేసే శివుణ్ణి భజిస్తున్నానని శంకరులు అంటున్నారు.

వర్షాకాల ప్రారంభ సమయంలో సాయంసంధ్యాకాలంలో వర్షం కురవడానికి ముందు ఉరుముల ధ్వని, మెఱపుల ప్రకాశం గూడా తోడవుతాయి. అప్పుడు ఎదురుగా ఆడు నెమలి వుంటే దానిని చూస్తూ మగ నెమలి అతినోహరంగా నృత్యం చేస్తుంది. సరిగ్గా కైలాసంలో ఇలాంటి సమయం లోనే - విష్ణుమూర్తి వాయించే మృదంగ ధ్వనులే ఉరుముల్లా వుండి - పైనుండి చూసే దేవతల చూపుల వరుసలే మెరుపుల్లా వుండి, భక్తుల యొక్క పరవశానందాశ్రువులే వర్షధారలుగా ఉండి, పార్వతీ దేవియే ఆడ నెమలిగా ఎదురు గా వుంటే - నీలకంఠుడనే నెమలి తాండవ నృత్యం చెయ్యకుండా వుంటుందా - అతి మనోజ్ఞ మైన మనోహరమైన ఆ నృత్యం చేసే నీలకంఠున్ని ధ్యానంలో దర్శించి భజించి తీరాలి - అంటున్నారు ఆది శంకర భగవత్పాదులు.

---

**55. ఆద్యాయామితతేజసే శ్రుతి పదైర్వేద్యాయ సాధ్యాయ తే**

**విద్యా నందమయాత్మనే త్రిజగతస్సంరక్షణోద్యోగినే |**

**ధ్యేయాయాఖిలయోగిభి స్సురగణైర్గేయాయ మాయావినే**

**సమ్యక్తాండవ సంభ్రమాయ జటినే సేయం నతిశ్శంభవే ll**

Sri Mahakameswari Seva Trust

ఆదిదేవుడు, తేజస్వంతుడు, వేదవేద్యుడు, భక్తసులభుడు, చిదానందుడు, జగద్రక్షకుడు, ధ్యానగమ్యుడు,సురకీర్తనుడు, చిచ్ఛక్తియుతుడు, తాండవ నృత్యతత్పరుడు, జటాధారి, సుఖకరుడు - అయిన శివునకు నమస్కారము.

శివునికి తల్లిదండ్రులు లేరు. ఒకసారి పార్వతీదేవి "నేను నా తల్లితండ్రుల పేర్లు చెబుతాను - మీరు మీ తల్లిదండ్రుల పేర్లు చెప్పగలరా? అని అడిగిందిట!" అందుకు శివుడు ఏ పేర్లు చెప్పాలో తెలియక, ఏం చెయ్యాలో తోచక చివరకు తెగించి - నేను నాఅత్తామామల పేర్లు చెబుతాను నువ్వు మీ అత్తామామా పేర్లు చెప్పగలవా? అని కార్బన్ కాపీ తెలివితో అడగాల్సి వచ్చిందట ! దీనిని బట్టి శివునికి తల్లిదండ్రులు లేరని, శివుడే మొదటివాడు, ఆదిదేవుడూ అనీ నిర్ధారించు కోవలసి వుంటుంది. తల్లితండ్రులే ఉంటే - వాళ్ళే ఆది దంపతులు, ఆది దేవుళ్ళు అయి వుండేవారుకదా! అందుకని శివుడు మొట్టమొదటి వాడు. అలాగే సకల దేవతలతో సహా సకల సృష్టి - ప్రళయ కాలంలో కాల వశమై శివుని లోనికి లీనమైతే - ఆ ప్రళయానికి సాక్షీ భూతుడుగా సదాశివుడు ఒక్కడే వుంటాడు. అందుకని శివుడు చిట్టచివరి వాడు.

యజుర్వేదం లోని రుద్రసూక్తాల్లోను ఈశావాస్యాది ఉపనిషత్తులలోను పూర్తిగా ప్రతిపాదిపబడినవాడు ఈశుడే ! భక్త సులభుడు. భోళా శంకరుడు. ఉద్ధరిణె నీరు నెత్తి మీద పోస్తే చాలు ఉబ్బిపోయే ఉబ్బులింగడు. యోగ మూర్తి అవడం మూలాన యోగు లందరూ శివుణ్ణే ధ్యానిస్తారు. మూడు కన్నులతో త్రికాల జ్ఞానం కలవాడు. కాబట్టే ముల్లోకవాసులకు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలిసి అవసరమైతే వారిని కాపాడే వాడు. ఇంతటి మహిమాన్వితుణ్ణే సురలంతా కీర్తిస్తారు. పూజిస్తారు. తాండవ నృత్యం చేసి ఆనందింప చేసే అటువంటి శివునికి కోరి మరీ నమస్కారము చెయ్యాలి అంటున్నారు ఆది శంకరులు.

---

Sri Maha Kameswari Seva Trust



**56. నిత్యాయ త్రిగుణాత్మనే పురజితే కాత్యాయనీ శ్రేయసే**

**సత్యాయాదికుటుంబినే ముని మనః ప్రత్యక్ష చిన్మూర్తయే |**

**మాయా సృష్టి జగత్త్రయాయ సకలామ్నాయాంత సంచారిణే**

**సాయం తాండవ సంభ్రమాయ జటినే సేయం నతిశ్శంభవే ||**

నిత్యుడును, త్రిగుణ శరీరుడును, పురభేదియు, పార్వతీ మనోహరుండును, ముని మనస్సులకు గోచరించు వాడును, చిద్రూపుడును, వేదాంతవేద్యుడును, మాయవలన ముల్లోకములను గల్పించువాడును, తాండవనృత్యమందాసక్తి గలవాడు నగు శివునకు నమస్కారము.

నిత్య, సత్య స్వరూపుడు, త్రిగుణస్వరూపుడు, త్రిపుర హరుడు, కాత్యాయనీ దేవి యొక్క తపః ఫలమైన వాడు, మొట్టమొదటి సంసారి యైనవాడు, మునీశ్వరుల యొక్క మనస్సుకు గోచరమైన చిత్స్వరూపము గలవాడును, మాయాశక్తి చేత సృజింపబడిన ముల్లోకాలు గలవాడును, ఉపనిషద్వాక్యములచే బోధింప బడువాడును, సంధ్యాకాల మందు తాండవమాడు వాడును, జడలు దాల్చిన వాడును, సుఖోత్పత్తి కారణమైనవాడునగు పరమేశ్వరునికి శత నమస్కారములను చేతును.

---

**57. నిత్యం స్వోదరపోషణాయ సకలా నుద్దిశ్య విత్తాశయా**

**వ్యర్థం పర్యటనం కరోమి భవత స్సేవాం న జానే విభో |**

**మజ్జన్మాంతరపుణ్యపాకబలత స్త్వం శర్వ సర్వాంతర**

**స్తిష్టస్మేవహి తేన వా పశుపతే తే రక్షణీయో2స్మ్యహమ్ ||**

శివా! పొట్టపోసికొనుటకు ధనాశతో నెందరినో యాశ్రయించితిని గాని నిన్ను సేవించు టెరుగను. పూర్వజన్మ మున ఏ కొంచమో పుణ్యము చేసితిని కనుకనే నా యంతరంగమున నున్నావు. నన్ను రక్షించు భారము నీపై నున్నది.

Sri Matha Kameswari Seva Trust

సాధారణంగా సంసార తాపత్రయంతో ఎలాగో అలా పొట్ట నింపుకోవాలనే స్వార్థం తోనో, ఏదో కొంత వెనకేసు కోవాలనే తలంపుతోనో - అడ్డమైన వారి చుట్టూ తిరుగుతూ, వాళ్ళను మంచి చేసుకోడానికి వాళ్ళని పొగుడుతూ అనవసరంగా కాలాన్ని వృథా చేసుకుంటాము.

కాని, ఎప్పుడు ఎవరికి ఏది అవసరమో దాన్ని ఇచ్చేవాడు, - మన కష్టానికి, ప్రయత్నానికి తగిన ఫలితాన్ని తప్పకుండా ఇచ్చే భగవంతుడు ఉన్నాడనే నమ్మకం తొందరగా కలుగదు. ఆ భగవంతుడు కూడా మనకు దూరంగా ఎక్కడో లేడు. మనలోనే ఉన్నాడనే భావన కలిగి, ఆ భావన స్థిరపడటం కూడా ఎంతో కాలానికి గాని జరగదు. ఈ విషయాన్నే శంకర భగవత్పాదులు ఈ శ్లోకములో గుర్తు చేస్తున్నారు

'ఏదో పూర్వజన్మ సుకృతం చేత మానవజన్మ ఎత్తాను. సర్వాంతర్యామి వైన నువ్వు నాలో కూడా వుంటావు కదా అనే సత్యం ఇన్నాళ్ళకైనా తెలుసుకొని నిర్భయంగా వున్నాను. ఇంక నాకేం దిగులు లేదు. అనవసరంగా కాలాన్ని వృధా చెయ్యను. నిన్నే స్మరిస్తూ చేసే పనుల ఫలితాలన్నీ నీకే సమర్పిస్తాను. మరి నువ్వే నా సంగతి చూసుకోవాలి.' - అని ప్రార్థించాలని తనను అడ్డం పెట్టుకొని మనకు తెలియ జేస్తున్నారు.

కాంచన కనకాలపైనా,కీర్తి పైనా వుండే దృష్టి ని మళ్ళించి కామేశ్వరునిపై పెట్టండి. ఆయన మీ కామాలన్నీ ( అవసరాలన్నీ) తీరుస్తాడు - అని శంకరుల ఉద్బోధ.

---

**58. ఏకో వారిజ బాంధవః క్షితి నభోవ్యాప్తం తమోమండలం**

**భిత్వా లోచనగోచరో2 పి భవతి త్వం కోటిసూర్యప్రభః ।**

**వేద్యః కిం న భవస్యహో ఘనతరం కీదృగ్భవేన్మత్తమ**

**స్తత్సర్వం వ్యపనీయ మే పశుపతే సాక్షాత్ప్రసన్నో భవ ।।**

Sri Maha Kameswari Seva Trust

దేవా ! ఒక్క సూర్యుడే భూమ్యాకాశముల నిండిన చీకటిని పోగొట్టుచు కన్నుల కనపడుతున్నాడు. కోటి సూర్యులవెలుగొందుచున్న నీవేల ప్రత్యక్షము గావు ?

నా అజ్ఞానాంధకారము తొలగించుట నీకొక లెక్కయా ? నాకు సాక్షాత్కరించి అనుగ్రహింపుము.

మనకు కనపడే సూర్యుడు భూమ్యాకాశాల మధ్య వున్న చిమ్మచీకటి నంతా పటాపంచలు చేసి మనకు కనిపిస్తున్నాడు. అంతర్యామి అయిన శివుడు కోటి సూర్య ప్రభా సంపన్నుడు. అయినా ఆయన మనకు కనబడటం లేదు. లోపం ఆయనలో వుందా? మనలో వుందా ? అని ప్రశ్నించుకుంటే అసలు సంగతి తెలుస్తుంది. ఆయన కోటి సూర్య ప్రకాశమానుడే ! అయితే ఆయన మన హృదయంలోనే వున్నా మన హృదయం నిండా దట్టంగా అజ్ఞానాంధకారం అలుముకొని వుంది. దాన్ని దాటి బయట పడటమే కష్టం. ఆ అజ్ఞానాంధకారం పోగొట్టుకోవాలంటే మన వల్ల కాదు. ఆయన అనుగ్రహం మనపై ప్రసరించి జ్ఞానోదయ మవాలి. బాహ్య దృష్టి కి 'కార్యం' మాత్రమే కనపడు తుంది.

అంతరదృష్టికి మాత్రమే ' కారణం' ద్యోతవుతుంది. వెలుగుకు సూర్యుడు కార్యం అయితే ఈశ్వరుడు కారణం అవుతాడు. కారణం ద్యోతక మవాలంటే అంతర్దృష్టి ఏర్పడాలి. ఆ రోజు త్వరలోనే,త్వరలో రావాలని హృదయాంతర్గతమైన అజ్ఞానాంధకారం పోయి దేదీప్యమానమైన ఆయన దర్శనం కలగాలని, - అందుకు భక్తితో , ప్రపత్తితో నిరీక్షించాలని శంకరులు హితవు పలుకు తున్నారు.

( పద్మ బాంధవుడైన సూర్యుడు పద్మాన్ని తన దీప్తివంతమైన కిరణ పుంజంతో వికశింపచేస్తే - "హృదయపద్మబాంధవుడైన ఈశ్వరుడు దేదీప్యమానమైన జ్ఞానప్రకాశంతో అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి హృత్పద్మవికసనానికి తోడ్పడుతాడు" అనే విషయం - ఏకోవారిజబాంధవః" - అనే పద ప్రయోగం సూచిస్తుందని గమనించాలి.)

---

**59. హంసః పద్మవనం సమిచ్ఛతి యథా నీలాంబుదం చాతకః**

**కోకః కోకనదప్రియం ప్రతిదినం చంద్రం చకోరస్తథా |**

Sri Maha Kameswari Seva Trust

**చేతో వాంఛతి మామకం పశుపతే చిన్మార్గ మృగ్యం విభో**

**గౌరీ నాథ భవత్పదాబ్జ యుగళం కైవల్య సౌఖ్యప్రదమ్||**

గౌరీశా ! హంస - పద్మములను, వానకోయిల - వర్షాకాల మేఘమును, చక్రవాకము - సూర్యుని, వెన్నెల పురుగు - చంద్రుని కోరినట్లు, నీ పాద పద్మములను - నా చిత్త మెల్లప్పుడు కోరుతున్నది.

ఎవరెవరికి ఎవరెవరంటే ఇష్టమో మనం జాగ్రత్తగా ఈ విశ్వాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. హంసకు పద్మాలంటే ఇష్టం. చాతకపక్షికి వర్షాకాల మేఘమంటే ఇష్టం. చక్రవాక పక్షికి సూర్యుడంటే ఇష్టం. చకోరపక్షి కి చంద్రుడంటే ఇష్టం. ఒక్క ఇష్టమే కాదు ఎలాగైనా ఎప్పుడూ అవి వాటి వాటి సాన్నిధ్యములో ఉండిపోవాలని తపిస్తాయి. అందుకు తగ్గ ప్రయత్నం కూడా చేస్తాయి. అవసరమైతే ఆ సమయం వచ్చేవరకు నిరీక్షిస్తాయి. అలాగే ' బుద్ధి విశేషం కల మానవునికి తన బుద్ధి వికసనమే పరమ ధ్యేయం.ఆత్మజ్ఞానమేఅంతిమ లక్ష్యం. ఇది ప్రాపంచిక విషయ లంపటత్వం వల్ల సిద్ధించదు. ఉపనిషత్తులు మొదలైన జ్ఞాన మార్గ ప్రభోదకమైన వాటిద్వారా మాత్రమే సిద్ధిస్తుంది. ముందు అంతఃకరణం శుద్ధి చెందాలి. అందుకోసం - జ్ఞానానికి, కైవల్యానికి ఉత్పత్తి స్థానం అయిన శివుని పాదారవిందాల యందే మన చిత్తాన్ని నిమగ్నం చెయ్యాలి' అనే సూచన భగవత్పాదులు ఈ శ్లోకము ద్వారా తెలియజేస్తున్నారు.

---

**60. రోధస్తోయ హృతఃశ్రమేణ పథికశ్ఛాయాం తరోర్వృష్టితో**

**భీతః స్వస్థగృహం గృహస్థమతి థిర్దీనః ప్రభుం ధార్మికమ్ |**

**దీపం సంతమసాకులశ్చ శిఖినం శీతావృతస్త్వం తథా**

**చేతస్సర్వభయాపహం వ్రజ సుఖం శంభోః పదాంభోరుహమ్ ||**

ప్రవాహమున గొట్టుకొని పోవువాడు ఒడ్డును, బాటసారి చెట్టు నీడను, వర్షమున తడియువాడు మంచియింటిని, దీనుడు ధర్మాత్ముని, చీకటిలో పడ్డవాడు

Sri Maha Kameswari Seva Trust

దీపమును, చలిచే పీడితుడు అగ్నిని వలె ఓ మనసా నీవీశ్వరుని పాదము లాశ్రయింపుము. అవి సమస్త భయములను పోగొట్టును.

ఒక్కొక్క రకమైన కష్టం గాని, ఇబ్బంది గాని, ఆపద గాని వచ్చినప్పుడు - ఒక్కొక్క రకమైన ఉపశమనం గాని, పరిష్కారం గాని పొందడానికి ప్రయత్నిస్తాము. అన్ని రకాల సమస్యలకు ఒకే ఒక పరిష్కారం ఉండదు. కాని, జగన్నాటకసూత్రధారుడైన పరమేశ్వరుని పాదాల నాశ్రయిస్తే అన్ని సమస్యలకూ పరిష్కారాలు కుదిరి బాధలన్నీ తొలగి శుభాలు కలుగుతాయి. అందువల్ల ఇతర వృథా ప్రయాసలు మాని ఈశ్వర పాదారవిందాలను ఆశ్రయించమని శంకరులు సలహా ఇస్తున్నారు. ఆపద వస్తే - ఆ పదమే శరణ్యం.

---



Sri Seva Trust

**61. అంకోలం నిజబీజ సంతతి రయస్కాంతోపలం సూచికా**

**సాధ్వీ నైజవిభుం లతా క్షితి రుహం సింధుస్సరిద్వల్లభమ్ I**

**ప్రాప్నోతీహ యథాతథా పశుపతేః పాదారవిందద్వయం**

**చేతోవృత్తిరుపేత్య తిష్టతి సదా సా భక్తిరిత్యుచ్చతే ||**

ఊడు గింజలు చెట్టును వానియంతటనవియే యంటుకొనునట్లు, సూది - సూదంటురాయి దగ్గరకు పరుగెత్తునట్లు, పతివ్రత - పతి నెడబాయనట్లు, తీగ - చెట్టును పెనవేసికొనునట్లు, నదులు - సముద్రమును పొందునట్లు మనోవృత్తి శివుని పాద పద్మములను పొంది యుండుటయే భక్తియని పెద్దలు చెప్పుదురు.

భక్తి అంటే ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం ఉండాలే గాని ప్రపంచంలో ఎన్నో రకాలుగా ఈ భక్తి వ్యక్తమవుతుంది. ఈ భక్తిలో గూడా ఎన్నో వ్యత్యాసాలు, వైవిధ్యాలు వుంటాయి.

అంకోల బీజాలు అంటే ఊడుగు గింజలు పండి చెట్టు నుండి నేల మీదకు రాలి పోయినా మళ్ళీ ఒక అనుకూల సమయం ఆసన్నమయి నప్పుడు ఇతర ప్రేరణలు లేకుండా వాటంతట అవే ఆ ఊడుగు చెట్టు ప్రానుకే అంటుకుపోతాయి. అంటే, తాము చేరవలసిన చోటు వాటికి తెలుసన్న మాట.

ఇది "సామీప్యముక్తి" ని సూచించే భక్తికి నిదర్శనం.

దగ్గరలో ఏదన్నా సూదంటు రాయి( అయస్కాంతం) ఉంటే సూది ఇతర త్రోవలుపట్టకుండా ఏదో కొంప మునిగిపోయినట్లు ఆత్రంగా తిన్నగావెళ్ళి ఆ సూదంటు రాతిని అతుక్కు పోతుంది. అంతేకాదు. ఆసూదంటురాతి ఆకర్షణ ధర్మాన్ని గూడా తానూ పొందుతుంది. ఇది "సాలోక్య ముక్తి" ని సూచించే భక్తికి నిదర్శనం.

పతివ్రతా శిరోమణి తన భర్తను ఆశ్రయించుకొని వుంటూ అతని తోడిదే తన జీవితానికి అర్ధము పరమార్ధము అని నమ్ముతూ, ఎప్పుడూ విడవకుండా కనిపెట్టుకొని సహధర్మచారిణీ ధర్మాన్ని నిర్వర్తిస్తుంది. ఇది కూడా "సామీప్య,సాలోక్యా"లను సూచించే భక్తికి నిదర్శనం.

Sri Maha Kameswari Seva Trust

అప్పుడే చిగురు వేస్తున్న తీగ ఒక చెట్టుని గాని, వెదురు కర్ర ను గాని ఆశ్రయంగా చేసుకుని వదలకుండా దాన్ని చుట్టు కుంటూ పైపైకి ప్రాకు తుంది. చివరకు పువ్వులను, ఫలాలను పొంది ప్రపంచానికి సమర్పిస్తుంది. ఇది కూడా "సామీప్య" ముక్తిని సూచించే భక్తికి నిదర్శనం.

ఎక్కడో పుట్టి ఎక్కడెక్కడో ప్రవహించినా - నదులు చిట్టచివరకు తమ లక్ష్యాన్ని గుర్తుపెట్టుకొని, సముద్రాన్ని చేరి దానిలో లీనమై పోతాయి. తమ అస్తిత్వాన్ని కూడా కోల్పోతాయి. నది నీళ్ళు తియ్యగా ఉన్నా - సముద్రంలో కలవంగానే -ఆ నీళ్ళు ఉప్పగా నే వుంటాయి. అంటే సముద్ర లక్షణాన్ని, రూపాన్ని గూడా పొంది తమ నామరూపాలను పూర్తిగా కోల్పోయి, సముద్ర నామం తోనే సముద్ర లక్షణం తోనే వ్యవహరింప బడతాయి. ఇది "సాయుజ్య" ముక్తిని సూచించే భక్తికి నిదర్శనం. ఇన్ని రకాల లక్ష్యాలతోను భక్తిని, తద్వారా ముక్తిని పొందవచ్చును అని శంకరులు చెబుతున్నారు.

---

**62. ఆనందాశ్రుభిరాతనోతి పులకం నైర్మల్యత శ్చాదనం**

**వాచాశంఖముఖస్థితైశ్చ జఠరాపూర్తిం చరిత్రామృతైః |**

**రుద్రాక్షైర్భసితేన దేవ వపుషో రక్షాంభవద్భావనా**

**పర్యంకే వినివేశ్య భక్తి జననీ భక్తార్భకం రక్షతి ||**

తల్లి బిడ్డను చేరదీసి పులకితుని చేయునట్లు భక్తిరసము భక్తుని పరవశుని చేయును. తల్లి బిడ్డకు ఈగలు మొదలగు బాధను తొలగించు టకు బట్ట కప్పునట్లు భక్తి నిర్మల భావము నావరింప జేయును. తల్లి పాలను త్రాగించునట్లు భక్తి వేదాది వాక్యముగా నీ చరితామృత మును తనివితీర త్రాగించును. రుద్రాక్షలను ధరింప జేసి, విభూతి పెట్టించి, రక్షించును. తల్లి బిడ్డను మంచము పై పరుండబెట్టి కాపాడునట్లు భక్తి మనస్సునందు ఈశ్వరధారణ యను మంచమున ప్రవేశపెట్టి పరిపాలించును.

భక్తి తన భక్తుడనే శిశువును తల్లిలాగ ఎలా లాలించి, పాలించి, పెద్ద చేసి రక్షిస్తుందో ఈ శ్లోకములో ఆదిశంకరులు వివరిస్తున్నారు.

Sri Maha Kameswari Seva Trust

పసిపిల్లవాణ్ణి చూడంగానే తల్లికి సహజమైన మాతృప్రేమ ఉప్పొంగి దగ్గరకుతీసు కుంటుంది. ఆ స్పర్శకు శిశువుకుఒళ్ళు పులకరిస్తుంది. తల్లికి ఆనంద బాష్పాలు ఒలుకుతాయి.భక్తి కూడా భక్తునికి పరవశంవచ్చినప్పుడు ఆనంద బాష్పాలు వచ్చేటట్లు చేస్తుంది. తల్లి - శిశువును స్నానం చేయిస్తుంది. భక్తి కూడా భక్తుణ్ణి పరవశుణ్ణి చేసి అప్పుడు వచ్చిన ఆనంద బాష్పాలతోనే సుస్నాతుణ్ణి చేస్తుంది.

కీటకాలు కుట్టకుండా చలి  బాధించకుండా ఉండి హాయిగా నిద్ర సుఖాన్ని పొందడం కోసం - మెత్తని పొత్తిళ్ళలో చేర్చి హృదయానికిహత్తుకొని శిశువును పడుకోపెడుతుంది. అలాగే భక్తి కూడా భక్తునికి పవిత్రమైన, నిర్మలమైన సాత్త్వక భావాలను కలుగజేసి ఆదరిస్తుంది.

తల్లి వెండి గిన్నెలో ఆవుపాలు పట్టి శిశువు పొట్టను నింపుతుంది. అలాగే భక్తి కూడా భక్తుని చేత అర్చ నాదులు చేయించి - శివ చరిత్ర తెలిపే స్తోత్రాలను చదివింపజేసి " శంఖ మధ్య స్థితం తోయం....అంటూ తీర్థ స్వీకారమంత్రాన్ని చెప్పి తీర్థాన్ని త్రాగిస్తుంది.

శిశువు ఝుడుసుకుని ఉలిక్కిపడి కలవరించినా, కలత చెందినా వెంటనే తల్లి రుద్రాక్షలతోను, విభూతి తోను అంగరక్షణ చేస్తుంది. - అలాగే భక్తి కూడా భక్తుని చేత రుద్రాక్ష లను, విభూతి ని ధరించే టట్లు చేస్తుంది.

తల్లి శిశువును ఉయ్యాలలో పడుకోబెట్టి ఆనందభైరవి లాంటి రాగాలతో జోలపాటలు పాడి నిద్ర పుచ్చుతుంది. అలాగే భక్తి కూడా భక్తుణ్ణి శివధ్యానమనే ఉయ్యాలలో మనస్సును లీనం చేయిస్తుంది. ఈ విధంగా తల్లి శిశువును లాలించి పాలించి పోషించి రక్షించునట్లు భక్తి కూడా భక్తుణ్ణి ఆదుకుని ఆదరించి అన్ని విధాలా రక్షిస్తుంది. కాబట్టి శిశువుకు తల్లి లాలన ఎంత అవసరమో భక్తునికి భక్తి అంతే అవసరం - అని శంకరులు ఈ శ్లోకములో నిర్ధారించారు.

---

**63. మార్గావర్తిత పాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే**

**గండూషాంబుని షేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే |**

Sri Maha Kameswari Seva Trust

**కించిద్భక్షిత మాంసశేషకబళం నవ్యోపహారాయతే**

**భక్తిః కిం న కరోత్యహో వనచరో భక్తావతంసాయతే ||**

తిన్నడను భక్తుని కాలిచెప్పు శివుని శరీరముపై చీపు రయ్యెను. పుక్కిటపట్టిన నీరభిషేక జలమయ్యెను. ఎంగిలి మాంసపు ముక్కలు నివేదనకైనవి. కిరాతుడగు తిన్నడు భక్తాగ్రగణ్యుడయ్యెను. ఆహా భక్తి ఏమి చేయలేదు !

ఇది భక్త కన్నప్ప సూటి భక్తిని తెలిపే శ్లోకం. సామాన్యంగా పూజలు, అర్చనలు, ఆరాధనలూ ఉన్న చోట - మడి ఆచారాల వంటి నియమ నిబంధనలు చాలా ఉంటాయి. ఏంచేసినా, ఎలా చేసినా తప్పు పట్టేవారు ఉంటారు. కొందరు ఆ తప్పులకు విపరీతమైన ప్రాయశ్చిత్తాలను గూడా పాటింప చేస్తారు. నిజమైన భక్తి కి ఇటువంటి మడి ఆచారాల తోను, నియమ నిబంధనలు తోను ఏమీ సంబంధం లేదు. భక్తి కలిగినపుడు - మనస్సు హృదయం ద్రవించి ఏం చేయిస్తే వాటిని సూటిగా చేసిసంతృప్తిని ఆనందాన్ని అనుభవించడమే దైవానుగ్రహం పొందడానికి, తరించడానికిమార్గం. ఈ విషయం ఎన్నిసార్లు చెప్పినా మనం పెట్టుకున్న నియమ నిబంధనలను మనం వదులు కోలేక భగవంతునికి దూర మౌతాము. కన్నప్ప కథ తెలిస్తే గాని సందేహం తీరదని ఒక శ్లోకం దానికి ఆది శంకరులు ఈ శివానందలహరి లో కేటాయించారు.

పుణ్యక్షేత్రమైన కాళహస్తికి దగ్గరలో ఒక బోయలగూడెం వుండేది. దాని పేరు "ఉడుమూరు" అందు శివభక్తి పరులైన ఒక దంపతుల కొడుకే "తిన్నడు". సూటి ప్రవర్తన కలిగి ఉండే అతనికి "తిన్నడు" అనే పేరు కూడా సార్ధకం అయింది.

ఒకనాడు అడవికి వేటకు వెళ్ళి నప్పుడు ఒక అడవిపంది అరుస్తూ ఒక పొదలో దూరి కనపడకుండా అంతర్ధాన మైంది. తిన్నడు దానికోసం వెళ్ళి వెదుకుతూ ఉంటే ఆ పొదల మధ్య శివలింగం ఒకటి కనపడింది.

ఆ శివలింగంలో సాక్షాత్తు శివుణ్ణే చూశాడు తిన్నడు. మనం ఎలా మాట్లాడు కుంటామో అలాగే శివలింగం తో మాట్లాడుతూ కబుర్లు చెప్పేవాడు. పూజ చేసేవాడు. శివునికి ఆకలి వేస్తోందని ఆకులను పొట్లంలా చుట్టి రుచి చూసిన మాంసపు ముక్కలను దాంట్లో ఉంచి - ఒక చేత్తో పట్టుకుని, రెండో చేతిలో అడవి పూలు ,బిల్వదళాలు పెట్టుకొని, నోటినిండా నీళ్ళు పుక్కిట పట్టి తిన్నగా శివలింగం దగ్గరకు వచ్చితన కాలిచెప్పుతో లింగంపై బడిన ఎండుపోయిన

Sri Maha Kameswari Seva Trust

ఆకులను చీపురుతో ఊడ్చి నట్లు తుడిచేవాడు. తన పుక్కిటిలో వున్న నీటిని ఉమిసి కడిగేవాడు. దళాలను,పూలను వేసి పూజించేవాడు. దొప్పలోని రుచి చూసిన మాంసాన్ని నైవేద్యం పెట్టేవాడు. తినకపోతే బ్రతిమాలు కొనేవాడు. ఇదీ శివునికి తిన్నడు చేసే పూజ .

మనం కనుక ఈ పూజ చూస్తే " హవ్వ హవ్వ " అంటూ రెండు చేతి వేళ్ళతో చెక్కిళ్ళు నొక్కుకొనేవాళ్ళం. శివుడు మాత్రం ఇవేం పట్టించుకోలేదు.

ఒకరోజు శివుడు తిన్నని పరీక్షిద్దామని ఒక కంటి నుండి నీరు కార్చాడు. తిన్నడు ఆ కన్ను ఆవిధంగా ఉండటం చూడలేక అడవిలోని ఆకురసాలనుతెచ్చి వైద్యం చేసాడు. అయినా నీరు రావడం తగ్గలేదు, పైగా రక్తం కూడా రావడం ప్రారంభించింది. ఆరక్తాన్ని ఆపడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. అయినా రక్తం కారటం ఆగలేదు. అప్పుడు శివుని ఆ కంటిని ఊడబెరికి తన కన్ను నొక దానిని అక్కడ పెట్టాడు.

ఇంతలో రెండవ కంటినుండి రక్తం కారడం ప్రారంభించింది. ఈసారి కూడా ఇదివరకు లాగానే తనకున్న ఆ రెండవ కంటిని శివుని రెండవ కంటి స్థానంలో పెడదామనుకొని శివుని రెండవ కన్నుని ఊడ బెరికాడు. తన కన్నును బాణంతో తీయబోతూ ఈ కన్ను కూడా తనకు లేకపోతే గ్రుడ్డి వాడై శివునికి కళ్ళెక్కడ ఉన్నాయో  గూడా తెలియక తికమక పడాల్సి వస్తుందని, రక్తం కాలే శివుని రెండో కంటి స్థానం వద్ద తన కాలి బొటన వేలుని గుర్తుగా ఉంచి, తన రెండవ కంటిని తీసి దాని స్థానంలో పెట్టడానికి ఉద్యుక్తు డయ్యాడు. అప్పుడు శివుడు వెనువెంటనే ప్రత్యక్షమై నాకు కన్నును అప్పగించి రక్షించిన తిన్నడివి - ఈరోజు నుండి నువ్వు "కన్నప్ప" గా ఖ్యాతి వహిస్తాను. నువ్వు తినకుండా నాకు నైవేద్యం పెడితే నేతింటానా?" అని చెప్పి నైవేద్యం ఆరగించకుండానే అంతర్ధానమయాడు. ఆ శివుడే కాళహస్తీశ్వరుడు. అప్పటి నుండీ ముందు కన్నప్ప కు నైవేద్యం పెట్టిన తరువాతనే కాళహస్తీశ్వరునికి నైవేద్యం పెట్టే ఆచారం ఇప్పటికీ అక్కడ కొనసాగుతోంది.

ముక్కంటిని ముగ్దుణ్ణి చేసిన ఆ మూఢభక్తి ఎంతటిదో ఆలోచించండి. ఒకరి భక్తిని,పూజను మరొకరు విమర్శించు కోకండి. ఎవరికి తోచిన మార్గంలో వారిని అర్చించుకోనీయండి. భక్తి ప్రధానం గాని తతంగం, మంత్రం, తంత్రం ముఖ్యం కాదు - అని ఈ శ్లోకము తెలియజేస్తుంది. ( న బుద్ధి భేదం జనయేత్ అజ్ఞానం

Sri Maha Kameswari Seva Trust

కర్మసంగినామ్" అనే భగవద్గీత లోని శ్లోకం కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తుంది. )

---

**64. వక్షస్తాడన మంతకస్య కఠినాపస్మార సంమర్దనం**
**భూభృత్పర్యటనం సమత్సురశిరః కోటీర సంఘర్షణమ్ |**
**కర్మేదం మృదులస్య తావకపద ద్వంద్వస్య గౌరీపతే**
**మచ్చేతోమణిపాదుకా విహరణం శంభో సదాంగీ కురు ||**

ఉమానాథా! నీవు యముని రొమ్ము తన్నవలెను. అపస్మారము నణగ ద్రొక్కవలెను. కొండమీద తిరుగవలెను. నమస్కరింప వచ్చిన దేవతాదుల కిరీటముల రాపిడి కోర్వవలెను. ఇదంతయు కఠినకృత్యము. నీపాదములతి కోమలములు. నా మనస్సను మణి పాదుక లను తొడుగు కొనుటకు దయచేసి యంగీకరింపుము.

హే సాంబశివా ! దృఢకర్కశకాయుడై యముని రొమ్మును తన్నడం ( మార్కండేయుణ్ణి రక్షించడం కోసం ), దట్టమైన అజ్ఞాన అపస్మారాన్ని మర్దించడం లాంటి కఠినమైన పనులు నిర్వర్తించడానికి, అతి మృదువుగా వుండే నీ పాదాలు తగవు కానీ - నా హృదయమనే మణిమయ పాదుకలను తొడుక్కొని ఈ పనులు చేసుకో - అంటూ నచ్చచెప్పి సదా తన హృదయంలోనే శివపాద పద్మాలు ఉండాలని కోరుకుంటున్నారు ఆది శంకరులు.

---

**65. వక్షస్తాడనశంకయా విచలితో వైవస్వతో నిర్జరాః**
**కోటీరోజ్వల రత్నదీపకలికా నీరాజనం కుర్వతే |**
**దృష్ట్వా ముక్తి వధూస్తనోతి విభృతాశ్లేషం భవానీపతే**
**యచ్చేయస్తవ పాదపద్మభజనం తస్యేహ కిం దుర్లభమ్ ||**

Sri Mahakameswari Seva Trust

ఉమానాథా ! నీవు మునుపటి వలె తన ఱొమ్మున తన్నుదు వేమోయని భయపడి నీ భక్తుని  జూచిన యముడు పారి పోవును. దేవతలు ఆ భక్తునికి తమ కిరీట మాణిక్య దీపములతో నీరాజనాలు లిత్తురు. ముక్తి కాంతి తనంత తాను వచ్చి ఆలింగన మొసంగును. ఇంక నీ భక్తునకేది దుర్లభము.

శివుడంటేనే కాదు శివ పాదాలను అర్చించే ఏ శివ భక్తుణ్ణి చూసినా - మార్కండేయుని విషయంలో తన ఱొమ్ముపై తన్నిన ఆ శివపాదాలు గుర్తుకు వచ్చి - యముడంతటి వాడు భయపడి పారిపోతాడట. దేవతలు ఆ భక్తుని చూసినపుడు శివపాదాలే గుర్తుకు వచ్చి తమ కిరీటాల్లోని మణుల కాంతులనే దీపాలతో నీరాజనాలిస్తారట. ముక్తి కాంత కూడా ఆలింగనం చేసు కుంటుందిట. అంటే అతి దుర్లభము అసాధ్యము, అపురూపము అయిన విషయాలు గూడా శివపాద  సేవనతో అవలీలగా జరుగుతాయి అని అర్థం.



**66. క్రీడార్థం సృజసి ప్రపంచమఖిలం క్రీడామృగాస్తే జనాః**

**యత్కర్మాచరితంమయా చ భవతః ప్రీత్యై భవత్యేవ తత్ |**

**శంభో స్వస్య కుతూహలస్య కరణం మచ్చేష్టితం నిశ్చితం**

**తస్మాన్మామక రక్షణం పశుపతే కర్తవ్యమేవ త్వయా ||**

శివా! నీవీ ప్రపంచ మంతయు సృజించుట విలాసార్థముగదా! ఈ ప్రజలందరు నీ వినోదార్థకమైన జంతువులు. వారివారి పెంపుడు జంతువుల నడవడులు వారికి ప్రేమా స్పదములే కదా! కావున నేను చేయు సత్కర్మములుగాని దుష్కర్మములుగాని నీకు తృప్తికరము లగును. కనుక నన్ను రక్షింపవలసినవాడ వగు చున్నావు.

ఈ శ్లోకములో శంకరాచార్యుల వారు చాలా లౌక్యంతో శివుణ్ణి మంచి చేసుకుని తర్కంతో ఆయన రక్షణ పొంద చూస్తున్నారు.

పరమేశ్వరుడు ఒంటరిగా తానొక్కడే ఉన్నప్పుడు - ఏమీ తోచక, తోడు ఎవ్వరూ లేరని, కాలక్షేపం కావడం లేదని ఆడుకోడానికైనా కనీసం ఇంకొకడు వుండాలని అనిపించి - తానే ఇంతమంది గా, ఇన్ని వస్తువులుగా ఇన్ని ప్రదేశాలుగా స్థావర జంగమాత్మక మైన యావత్ప్రపంచంగా అయిపోయాడని తైత్తిరీయోపనిషత్తు లో చెప్పబడుతుంది. అంటే కేవలం తన క్రీడార్థంగా, విలాసార్థంగా మాత్రమే ఈ విశ్వాన్ని శివుడు సృజించాడన్న మాట. అంటే ఈ విశ్వం లోని ప్రజలందరూ శివుడు ఆడుకోవడానికి - సర్కస్ లో వినోదార్థమై ఏర్పాటు చేసుకున్న జంతువుల్లాంటి వాళ్ళన్న మాట. మనం కొన్ని జంతువుల ను ఇళ్ళల్లో పెంచుకుంటాం. అలాగే ఈ ప్రపంచం అనే శివుని ఇంట్లో శివుడు మనందరినీ పెంపుడు జంతువుల్లా ఏర్పాటు చేసుకున్నాడు. పెంపుడు జంతువులు ఏం చేసినా మనం వాటి చేష్టలకు ఆనందిస్తామే గాని విసుక్కోముకదా! అలాగే మేము ఏమైనా తెలిసి గాని తెలియక గాని - సత్కర్మలు గాని, దుష్కర్మలు గాని చేస్తున్నప్పుడు నీకు అవి ఆనందాన్నే కలిగించాలి గాని తప్పుగా అనిపించకూడదు. పెంపుడు జంతువుల్ని యజమాని రక్షించుకున్నట్లే - నువ్వు మమ్మల్ని రక్షించాల్సిన వాడవే అవుతున్నావు . ఇంక మాకేం భయం ? అంటున్నారు శివునితో ఆది శంకరులు. చూశారా ఆయన తర్కం ? చూశారా ఆయన లౌక్యం ? శంకరుని ముందు శంకరుల వంటి వారికే ఈ తర్కం,లౌక్యం

Sri Maha Kameswari Seva Trust

సాధ్యం. 'శంకరశ్శంంకరస్సాక్షాత్' అని గదా ఆయన గురించి అందరూ చెప్పేది.

---

**67. బహువిధ పరితోష బాష్పపూర**
**స్ఫుట పులకాంకిత చారు భోగి భూమిమ్ ।**
**చిరపద ఫలకాంక్షి సేవ్యమానాం**
**పరమసదాశివ భావనాం ప్రపద్యే ।।**

అనేక విధములైన ఆనందభాష్పముల సమృద్ధి గలిగినదియు, ప్రస్ఫుటమైన గగుర్పాటు చిహ్నముగా గల గొప్ప సుఖమునకు స్థానమైనదియు, శాశ్వత పదవి అనెడి ఫలమును అపేక్షించు వారిచే సేవింపబడునదియు, సర్వోత్కృష్టమును అగు పరమేశ్వర భావనను శరణుజొచ్చుచున్నాను. అంటున్నారు శంకరులు.

---

**68. అమితముదమృతం ముహుర్దుహంతీం**
**విమలభవత్పదగోష్ఠ మావసంతీమ్ ।**
**సదయ పశుపతే సుపుణ్య పాకాం**
**మను పరిపాలయ భక్తిధేనుమేకామ్ ।।**

భూత నాథా ! నీవు అపార దయ గలవాడవు. నా పుణ్యవశమున నాకీ భక్తియను గోవు లభించినది. ఇది ఆనందరూపమైన పాలు పదేపదే యిచ్చును. నీ పాద రూపమైన పశువుల చావడిలో గట్టికొననిచ్చిఈ యావు నొక్కదానిని కాపాడుము.

భగవత్పాదులు శివునితో ఉభయతారకంగా ఉండే ఒక చక్కని ఒప్పందం చేసు కుంటున్నారు. అపరిమితమైన ఆనందమనే స్వచ్ఛమైన పాలను మాటిమాటికీ పితికడానికి వీలైనది అయిన భక్తి అనే గోవు తనదగ్గర వున్నదట. శివుని దగ్గఱ నిర్మలమైనటువంటి, పవిత్రమైనటువంటి ( శివుని) పాదమనే గోశాల ( పశువుల చావడి) ఉన్నదిట. తన భక్తి గోవుకి కావలసిన రక్షణ పోషణ శివుని పాద గోశాల

Sri Mahalakshmi Seva Trust

వద్ద చక్కగా లభిస్తుంది. కాబట్టి తన భక్తి గోవును శివుని పాద గోశాల వద్ద ఉండటానికి అనుగ్రహించి ఆ భక్తి గోవు సంరక్షణ, పాలను బాధ్యతను స్వీకరించి మహోపకారం చేసి పెట్టవలసినదిగా ఈ శ్లోకములో శివుణ్ణి అభ్యర్థిస్తున్నారు. అంటే - తన భక్తి శివపరంగానే ఉండాలి, ఆ భక్తి శివునికి ఆనందాన్నిచ్చే విధంగానే వుండాలి అని అర్థం.

---

**69. జడతా పశుతా కళంకితా కుటిల చరత్వం చ నాస్తి మయి దేవ |**

**అస్తి యది రాజమౌళే భవదాభరణస్య నాస్మి కిం పాత్రమ్ ||**

దేవా! నాకు జడత్వ పశుత్వ, కళంకితా కుటిల సంచారము లేదు. చంద్రునికి యున్నవి. అట్టి చంద్రుని శిరస్సున బెట్టుకొంటివి. అట్టి గుణము లున్నచో నేనును నీకు ఆభరణమయ్యేడి వాడినేమో!

శివుడు తన శిరస్సుపైన చంద్రుణ్ణి ఆభరణంగా ధరించడాన్ని గమనించిన శంకరులు ఆలోచనలో పడ్డారు. చూసి చూసి ఈ చంద్రుణ్ణి

నెత్తిపైకి ఎక్కించుకున్నారేమిటి అని ఆలోచించి ఆలోచించి - అయితే చంద్రుని లక్షణాలు, స్వభావాలు కనుక వుంటే తనను కూడా అలా ఆభరణంగా ధరిస్తారేమోననే నిర్ణయానికి వచ్చారు. చంద్రుని కుండేవన్నీ అవలక్షణాలే గాని ఒక్కటీ మంచి లక్షణం లేదు. సముద్రజలంలో పుట్టాడు, కాబట్టి, చంద్రుడు జడుడు. గురుపత్ని అయిన తారతో రమించాడు కాబట్టి పశువు. తనలో అందరికీ కనపడే కళంకం ఉన్నది కాబట్టి కళంకి. తను భూమి చుట్టూ తిరిగే మార్గం వంకర టింకరగా వుంటుంది కాబట్టి కుటిలచరుడు. ఇటువంటి చంద్రుణ్ణి నెత్తిన పెట్టుకొని శివుడు తాను చంద్రశేఖరుడని అందరిచేత పిలిపించు కుంటు న్నాడు. ఇన్ని అవలక్షణాలున్నా శివుని నెత్తిపైకి ఎక్కంగానే ఏ దోషము లేనట్లు అందరిచేత శివునికి భూషణుడని చంద్రుడు కూడా పిలిపించు కుంటున్నాడు. ఇంత మార్పు ఎందుకు వచ్చింది? చంద్రునికి ఎందుకిలా కలిసి వచ్చింది అని ఆలోచిస్తే బహుశః పనికిరాని వాణ్ణి సైతం గొప్పవాడని గా చేయగల గొప్ప దయాగుణం శివునిలో వుండి వుంటుంది. ఇలా దుర్లక్షణాలున్న చంద్రణ్ణే ఆభరణంగా నెత్తికెక్కించుకుంటే ఏ దుర్లక్షణము

Sri Maha Kameswari Seva Trust

లేని తాను అభ్యర్థిస్తే తనను గూడా ఆభరణంగా చేసుకోవడానికి శివునికి అభ్యంతరం ఏముంటుంది - అని - " ఓ సాంబశివా ! జడత్వం, పశు త్వం, కళంకత్వం, కుటిలచరత్వం లాంటి లక్షణాలు మరి నాలో ఏమాత్రం లేవు. ఏంచెయ్యను. అవి కనుక వుండి వుంటే చంద్రుని లాగా ఎప్పుడో నీకు ఆభరణమయే వాడినేమో" - అని వ్యంగ్యంగా శివునితో అనడానికి సిద్ధమై నట్లు ఈ శ్లోకములో పైకి కనపడుతుంది కాని, అసలు విషయం ఏమిటంటే -

ఎందుకూ పనికిరాని వాణ్ణి సైతం పైకి తీసుకువచ్చే సామర్థ్యం శివుని దగ్గర వున్నపుడు సగటు మంచి లక్షణాలున్న వాడికి శివుని పంచన చేరితే తరించవచ్చనే ఆశ పుడుతుంది గదా!

(ఉ: ఈ రోగానికి వైద్యం లేదని, చనిపోవడం ఖాయమని చెప్పించుకున్న మహారోగిని ఒక వైద్యుడు వైద్యసేవ చేసి బ్రతికిస్తే - సాదాసీదా రోగాలు న్న సగటు రోగులకు తామూ తేలిగ్గా బ్రతకగలమనే ఆశ పుట్టి ఎంతో ధైర్యం కలుగదూ! నిజంగా అలాంటి రోగాలని తగ్గించిన వాడే ఘనమైన వైద్యుడు. అతని పేరే దశదిశలా వ్యాపిస్తుంది. అందరూ అతని దగ్గరికే రావడానికి ప్రయత్నిస్తారు)

అందుకే - అవలక్షణాలున్న చంద్రునిలాంటి వాడిని నెత్తికెక్కించుకుని శివుడు కూడా అలానే చేశాడేమో' అని కాస్త వివేకంతో ఇలా కూడా ఆలోచించాలని శంకరులు మనకు రేఖామాత్రంగా ఈ శ్లోకములో సూచించారు. పైగా శివుడు చేసిన ఈ పనివలన ఇలా దోషాలను గుణాలుగా మార్చి గలిగితే దేవుడు శివుడు ఒక్కడేనేెమో అని కూడా వెంటనే గ్రహించి ఆయన పంచన జేరి తరిస్తాము.

---

**70. అరహసి రహసి స్వతంత్రబుద్ధ్యా**

**వరివసితుం సులభః ప్రసన్నమూర్తిః ।**

**అగణిత ఫలదాయకః ప్రభుర్మే**

**జగదధికో హృది రాజశేఖరోऽస్తి ।।**

Sri Maha Kameswari Seva Trust

సుముఖుడై సులభుడై యెల్లకోర్కెలు దీర్చుచు సర్వ సమర్థుడైన చంద్రశేఖరుడు నా హృదయమందే యున్నవాడు కనుక ఏకాంతముగను బహిరంగముగను కూడ స్వతంత్రముగ పూజించ వచ్చును.

సర్వాంతర్యామిత్వము, జగన్నాథ సార్వభౌమత్వమూ ఉన్నవాడూ అయిన శివుని వలన మనకు ఎంతో సౌకర్యం సౌలభ్యం చేకూరి నట్లే ! అని అంటున్నారు భగవత్పాదులు. ఎందుకంటే సర్వాంతర్యామి కాబట్టి అంతటా - అందరి లోనూ వుంటాడు. భక్తి నిండుగా వున్న వారికి ఎప్పుడూ హృదయంలోనే పిలిస్తే పలికేటట్లుగా వుంటాడు. కాబట్టి శివుణ్ణి ఏకాంతంగా ఉన్నా భజించవచ్చు. జనసమూహంలో వున్నా కూడా భజించవచ్చు.

ఎక్కడో అరణ్యాల్లోకి కొండగుహల్లోకి వెళ్ళి ధ్యాన జప తపాదులు చేయవలసిన పని లేదు. అలా నియమ నిష్టలతో గంటల తరబడి సేవించే మహర్షుల లాంటి వాళ్ళకు ఇచ్చే ఫలమే - కొలది కాలమే ఒంటరిగా వుండి సేవించినా జన సమూహంలో సేవించినా కూడా వస్తున్నప్పుడు ఇంక చిక్కేమిటి? నష్టమేమిటి ?

అందరినీ స్వంత బిడ్డలు లాగా నే చూసుకునే సమదృష్టి గల సర్వాంతర్యామి శివుడు అయినప్పుడు ఇక్కడే తన వద్దనే తన హృదయంలోనే వున్న ఆ శివుణ్ణి సేవించుకొని తరిస్తాను అని అంటున్నారు. మనం కూడా ఈసదుపాయాన్ని వినియోగించుకుని తరించమని సలహా ఏమో ఇది. భగవస్సాన్నిధ్యాన్ని పరిపూర్ణంగా పొందిన అనుభవంతో శంకరులిలా అంటున్నారు.

---

Sri Maha Kameswari Seva Trust



71. ఆరూఢ భక్తి గుణ కుంచిత భావ చాప
యుక్తైః శివ స్మరణ బాణగణైరమోఘైః ।
నిర్జిత్య కిల్బిషరిపూన్  విజయీ సుధీంద్రః
సానందమావహతి సుస్థిర రాజలక్ష్మీమ్ ।।

బుద్ధిమంతుడు భక్తిని వింటి నారిగను, అంతఃకరణ వృత్తిని విల్లుగను అమర్చుకొని, అందు ఈశ్వరధ్యానమును బాణముగా నెక్కుపెట్టి, పాపములను శత్రువుల నెల్ల జయించి, రాజు - రాజ్యలక్ష్మిని పొందునట్లు, పరమేశ్వర సారూప్య లక్ష్మిని పొందును.

మనలో పాపాలున్నంత వరకు పవిత్రులం కాలేము. అందుకని ముందు మనలోని పాపాలను పోగొట్టుకోవాలి. ఈ పాపాలు శత్రువుల్లాంటివి. వీటిని జయించాలంటే - అమోఘమైన అంటే - వృథాకాని మరి తిరుగులేని బాణాల్లాంటివి కావాలి. " శివ స్మరణ అమోఘమైన బాణం లాంటిది. దాన్ని ఉపయోగించి శత్రువుల్లాంటి పాపాలను పోగొట్టుకొని శుద్ధాంతరంగులై చింతలేని సుస్థిరమైన మోక్ష సామ్రాజ్యలక్ష్మిని పొంద వచ్చు కదా !" అని శంకరులు సలహా ఇస్తున్నారు. అయితే ఈశ్వర స్మరణ అనే బాణం ఒక్కటి వుంటే చాలుతుందా - దాన్ని సంధించడానికి వింటినారి కూడావుండాలి కదా ! - అంటే శుద్ధమైన అంతఃకరణ ప్రవృత్తిని ధనుస్సుగా చేసుకుని, ధృఢమైన భక్తిని వింటి నారిగా అమర్చుకొని, తిరుగులేని శివ స్మరణ అనే బాణాన్ని ఉపయోగించి పాపాలనే శత్రువులను పోగొట్టుకోండి - సరేనా! అని సందేహ నివృత్తిని చేస్తున్నారు.

---

**72.ధ్యానాంజనేన సమవేక్ష్య తమః ప్రదేశం**

**భిత్వా మహాబలిభి రీశ్వర నామమంత్రైః ।**

**దివ్యాశ్రితం భుజగ భూషణ ముద్వహంతి**

**యే పాదపద్మమిహ తే శివ తే కృతార్థాః ।।**

శివా ! నిధులు వెదుకువాడు కన్నుల కంజనము పూసి కొని కనిపెట్టి యానందించునట్లు - భక్తుడు ధ్యానాంజనముతో మీ పాదపద్మనిధిని గనుగొని, మీ నామ మంత్రముతో మహాబలి యొనర్చి, ఆవరణమైన అజ్ఞానము దొలగించి, మిమ్ముగొల్చి కృతార్థుడగును.

Sri Maha Kameswari Seva Trust

ఈ శ్లోకములో శివుని పాదాన్ని గొప్ప నిధిగా వర్ణించారు. భూమిలో అనేకమైన నిధినిక్షేపాలుంటాయి. ఈ నిధి నిక్షేపాలను దక్కించుకోవడం అంత సులువైన పనికాదు. సరిగ్గా శివపాదనిధిని పొందాలన్నా కూడా అంతగా నూ కష్టపడాల్సిందే ! నిధి ఎక్కడుందో తెలియాలంటే కంటికి అంజనం ( ప్రత్యేక మైన కాటుక) రాసుకొని చూడాలి. శివపాద నిధిని చూడాలంటే ముందు ధ్యానం చేసి దర్శించాలి. అంటే శివధ్యానం - శివపాదనిధిని పొందడానికి అంజనం లాంటిదన్నమాట. కనబడినంత మాత్రాన నిధి మనకు చేకూరి నట్లే అని భావించకూడదు. ఆ నిధి బట్టబయలై వుండదు. రాళ్ళూ రప్పలు చేత కప్పబడి, కొందరు దేవతల చేత సర్ప విశేషాల చేత కాపాడబడుతూ వుంటుంది. కొన్ని ప్రత్యేక మైన మంత్రాలనుచ్చరించి, నిధి రక్షకులను ప్రసన్నులుగా చేసుకొని, భూమిని త్రవ్వి, ఆ నిధులను పొందాలి. అలాగే శివపాద సన్నిధిని ధ్యానంలో దర్శించి నంత మాత్రాన మనకది చేకూరినట్లే అని భావించకూడదు. మన పాపాలే శివ ధ్యానానికి ప్రతిబంధ కాలవుతాయి. ముందు వాటిని తొలగించాలి. ఆ తరువాత మంత్రోచ్చారణ, నామస్మరణ లతో శివుని చుట్టూ కాపలా వుండే ప్రమధ గణాధి దేవతాదులను ప్రసన్నులను చేసుకోవాలి.

అటుపైన మరింత సాన్నిధ్యంలో బ్రహ్మాది దేవతలచే ఆశ్రయింపబడి వాసుక్యాది సర్పాలంకృతులతో ఉండే శివపాదనిధిని దక్కించు కోవాలి. ఇవన్నీ చేయగలిగితే తప్పక శివపాదనిధిని పొంది ధన్యులవవచ్చు- అంటున్నారు ఆది శంకరులు.

---

**73. భూదారతా ముదవహ ద్యదపేక్షయా శ్రీ**
**భూదార ఏవ కిమతః సుమతే లభస్వ |**
**కేదారమాకలిత ముక్తి మహౌషధీనాం**
**పాదారవింద భజనం పరమేశ్వరస్య ||**

ఓ సుబుద్ధీ ! మహావిష్ణువు సయితము శివుని పాద సందర్శనమునకై వరాహ రూపమెత్తి పలుశ్రమల కోర్చినాడు. నీవు గూడా అట్టి శివపాద భజన చేయుము.

Sri Maha Kameswari Seva Trust

పంటనేలయందు ఓషధులు ఫలించునట్లు దాని వలన సమస్త ముక్తులు లభించును.

ధర్మవిచికిత్స, కర్మవిచికిత్స వచ్చినప్పుడు ( అంటే - ఏది చెయ్యాలో ఏది చెయ్యకూడదో తేల్చుకోలేక పోయినప్పుడు)

భగవద్గీత లో -

యద్యదాచరతి శ్రేష్టః తత్తదేవే తరోజనః

స యత్ప్రమాణం కురుతే లోకస్తదను వర్తతే'- అని,

ఉపనిషత్తులో -

అథయదితే కర్మ విచికిథ్సావావృత్త చికిథ్సావాస్యాత్::::: యథాతే తేషు వర్తేథాః' - అని పరిష్కారం చెప్పబడుతుంది.

వీటి రెంటి అర్థం ఒక్కటే - ధర్మపరులు, ఉత్తములు అయినవారు ధర్మవిచికిత్స వచ్చినప్పుడు ఏం చేస్తారో దాన్నే ప్రమాణంగా తీసుకొని ఇతరులు కూడా చెయ్యాలని ఈ రెంటి యొక్క సారాంశం.

త్రిమూర్తులలో ఒకడు, స్థితి కారుడు, పోషకకారుడు, దేవదేవుడు అయిన విష్ణు మూర్తిని ప్రమాణంగా తీసుకుంటే - ఆ విష్ణుమూర్తి తాను భక్తిని ముక్తిని పొందడం విషయంలో ఏం చేశాడో మనమూ దాన్ని ఆచరించి తరించాలి.

శివుని పాదాలను చూసి తరించాలని విష్ణు మూర్తి వరాహ రూపమెత్తి ఎన్నో శ్రమలు పడడానికైనా వెనుకాడలేదు. కాబట్టి - ఆ విష్ణుమూర్తిని మనం కూడా అనుసరించి శివ పాదాలను భజించాలి. అవి సామాన్య మైన పాదాలని అనుకో కూడదు. సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్య ముక్తులనే దివ్య ఔషధాలకు పంటపొలం లాంటివి అని గుర్తుండాలి. అందుకే భూదేవిని, శ్రీ దేవిని భార్యలుగా కలిగిన మహావిష్ణువు కూడా ఆ పాదాలను దర్శించి తరించ డానికి వరాహరూపము ఎత్తాడు.

మనం ఇంక ఆలోచించవలసిన పనిలేదు. ఆ విష్ణుమూర్తి లాగా కష్టపడి ఫలాన్ని పొంది తరించాలి. అని ఆదిశంకరుల సలహా.

---

Sri Maha Kameswari Seva Trust

**74. ఆశాపాశ క్లేశ  దుర్వాసనాది భేదోద్యుక్తై ర్దివ్యగంధై రమందైః ।**

**ఆశాశాటీకస్య పాదారవిందం చేతః పేటీం వాసితాం మే తనోతు ।।**

దిగంబరుడగు పరమేశ్వరుని యొక్క పాదపద్మము నా మనః పేటిక యందు గల ఆశా పాశములు, పంచ క్లేశములు మొదలగు దుర్వాసన ల నడంచి దివ్యమైన సువాసన లతో నింపుగాక!

పాయసం ఎంత మధురంగా రుచిగా వున్నా అది వున్న పాత్ర మకిలిగా వుంటే ఆ పాయసం త్రాగినందువల్ల వచ్చేది అనారోగ్యమే కాని ఆనందం కాదు. అలాగే హృదయం నిండా దుష్ట సంస్కార దుర్వాసనలు,  ఆశాపాశాది క్లేశాలు నిండి వుంటే మునీశ్వరుల కైనా ముక్తి రాదు. ముందు ప్రక్షాళన కావలసినవి ఇవి గాని బాహ్యాంగ శుద్ధి కాదు. ఈ దుష్ట సంస్కార దుర్వాసన లను సమూలంగా పోగొట్టి సు సంస్కార సువాసనలతో హృదయం నింపబడాలంటే - ఆ హృదయంలో ఆ దుర్వాసన లను పోగొట్టగల సామర్ధ్యం ఉన్న పవిత్రమైన పరిమళాలను వెదజల్లే వస్తువేదైన వుంచాలి. శంకరులు శ్రీఘమే ఆచరణ యోగ్యమైన ఒక చక్కని సలహా ఇస్తున్నారు.

హృదయమనే పెట్టెలో దిక్కులే వస్త్రాలుగా గలిగిన పరమేశ్వరుని యొక్క పాదారవిందాన్ని ఎడబాయకుండా ఉండేటట్లు చూడమంటున్నారు. శివపాద

పద్మం నుండి వచ్చే పవిత్ర పరిమళాలు దుష్ట సంస్కార దుర్వాసనలను దూరం చేసీ ప్రక్షాళన చేస్తాయి. దిక్కులే వస్త్రాలైన పరమేశ్వరుని యొక్క పాద పరిమళాలు గూడా దిక్కుల వరకు విస్తరించగల సామర్థ్యాన్ని కలిగి వుంటాయి కదా!అందువల్ల హృదయపేటిక ఎంత పెద్దదైనా - దుష్ట సంస్కార దుర్వాసనలు ఎంత దట్టంగా దిట్టంగా కట్టుదిట్టంగా - విస్తరించి వున్నా ఏమీ పర్వాలేదు శివ పాదపద్మ పరిమళాలు వాటిని ప్రక్షాళన చెయ్యగలవు - అనే అంతరార్థం ను గూడా గ్రహించాలి

---

**75. కల్యాణినం  సరసచిత్రగతిం సవేగం**

**సర్వేంగితజ్ఞమనఘం ధ్రువలక్షణాఢ్యమ్ ।**

Sri Maha Kameswari Seva Trust

**చేతస్తురంగమధిరుహ్య చర స్మరారే**

**నేతః సమస్త జగతాం వృషభాధిరూఢ ||**

ఓ వృషభవాహనా ! బాణ వేగమున బోవుచు,చిత్రగతులు గలిగి, కళ్యాణి యై, ధ్రువ లక్షణములు గల్గి, పరేంగిత మెరింగి వర్తించు నా మనస్సను గుఱ్ఱము నెక్కి హాయిగా స్వారీ చేయుము.

ఎప్పుడూ అందరూ దేవుణ్ణి ఏదో కావాలని కోరి పొందేవారే గాని దేవునికి పనికొచ్చేదే మన్నా ఇస్తే బాగుంటుందనే ఆలోచన సాధారణంగా రాదు. అయితే ఆయనకు మన మిచ్చే పాటి వాళ్ళమా? అయినా 'విశ్వ సామ్రాజ్య సార్వభౌము డైన ఆయనకు ఇవ్వగలిగేది మన దగ్గర ఏముంటుంది?' అని గూడా అనుకుంటాం. కాని శంకర భగవత్పాదులు ధైర్యం చేసి ఎంతో భక్తితో, వినయంతో, చనువుతో శివుణ్ణి అడిగి తాను ఇచ్చేదాన్ని స్వీకరించేట్లుగా ఒప్పించేరు. ఆయనఅభ్యర్ధనని తెలుసుకుందాం.

విశ్వేశ్వరా ! అవడానికి నీవు విశ్వసామ్రాజ్యాధినేతవే. విశ్వం లో ఎక్కడికైనా,ఎప్పుడైనా ఆలస్యం లేకుండా వెంటవెంటనే వెళ్ళాలంటే ఎలా వెళ్ళ గల వయ్యా! " ఎద్దు ఉన్నది కదా" అంటే అదేం ఎద్దయ్యా?ఎప్పటి కాలం నాటిది? ముసలిదై పోలేదూ ? అదేం నిన్ను ఎక్కించుకుని త్రిప్పు తుందయ్యా? ఇదిగో చిన్నవాడినైనా నేను చెప్పేమాట విను. నువ్వు ఆ ఎద్దు గురించి ఇంక మరచిపో. అసలు ఎద్దు వాహన మేమిటయ్యా? విష్ణువు లాంటి సాటి వాళ్ళను చూసైనా నేర్చుకో! ఎద్దు కంటె గుఱ్ఱము వెయ్యి విధాల నయం కదా! దాన్ని మించి పరిగెత్తే సాధు మృగం ఏది చెప్పు? అయితే దాన్నెక్కడ తెద్దాం అని ఎదురు ప్రశ్న వేయవద్దు. నా దగ్గర సిద్ధం గా వుంది.అదే నా మనస్సు అనే గుఱ్ఱం. దీన్నెక్కి నీవు వెంటవెంటనే వెళ్ళాల్సిన ప్రదేశాలకు వెళ్ళి పనులు చక్కబెట్టుకో !

పంచ కళ్యాణి వంటి మంచి జాతి గుఱ్ఱానికి 5 శుభ లక్షణాలుంటాయి. నా మనస్సుగ్గూడా మంగళకర లక్షణాలు ఐదు ఉన్నాయి.( మంచిని వినడం,చూడటం, మంచివి తినడం, మంచివాటిని స్పృశించడం, ఆఘ్రాణించడం వంటి) గుఱ్ఱానికి యజమాని మనస్సు తెలిసి ఉండాలి గదా అంటావేమో - ఒక్క నువ్వేమిటి అందరి మనస్సులను తెలిసి

Sri Matha Kameswari Seva Trust

నడచుకుంటుంది. నువ్వంటే ఎంతో భక్తి, గౌరవము గూడా కలిగినది. నువ్వు చెప్పినట్టల్లా నడచుకుంటుంది. నా మనస్సు గుఱ్ఱం కన్నా వేగంగా, గాలి కన్నా కూడా వేగంగా పరుగెడుతుంది. " ధ్రువం" అనే మంచి సుడి ఉండి, గుఱ్ఱం దోషరహితంగా వుండాలి కదా అంటావేమో - నా మనస్సు పాపం రహితమై శుభ లక్షణాలను కలిగి వున్నది.

( నీ పరమైన భక్తి విషయంలో) మంచి స్థైర్యము, విశ్వాసము , పట్టుదల గలిగినదే! మరి ఇంకెందుకాలస్యం ? నా మనస్సు నే గుఱ్ఱం గా స్వీకరించి నీ పనులన్నీ వేగవంతంగా చక్కబెట్టుకో! అంటే - "వదలకుండా నిత్యం నా మనస్సులోనే నువ్వు విహరించు" అని అర్థం.



**76. భక్తిర్మహేశ పదపుష్కర మావసంతీ**

**కాదంబినీవ కురుతే పరితోషవర్షమ్ ।**

**సంపూరితో భవతి యస్య మనస్తటాక**

**స్తజ్జన్మసస్యమఖిలం సఫలం చ నాన్యత్ ।।**

భక్తి - మేఘమాలిక వలె మహాదేవుని పాదపద్మ మను గగనము నందు వ్యాపించినది యై యానందవర్షము కురియును. అట్టి ఆ వర్షమునకు ఏ పురుషుని మానస సరోవరమంతయు నిండునో వానిజన్మమను సస్యమే సఫలమైనది యగునుగాని తక్కినది కాదు.

భగవత్పరమైన భక్తిని శంకరులు ఈ శ్లోకములో ఒక మేఘముతో పోల్చి వర్ణించారు.

భక్తి అనే మేఘం ఈశ్వర పాదమనే ఆకాశము నందే విహారం చెయ్యాలిట. అటువంటి భక్తి మేఘం వల్ల ఆనందమనే వర్షం కురిసి మనస్సనే సరస్సునిండినప్పుడే జన్మ అనే పంట పండుతుంది గాని ఇతర విధానాల వల్ల కానేకాదు అంటున్నారు. అంటే - మనస్సంతా భగవత్పరమైన భక్తి వల్ల పొందే ఆనందం నిండాలి. జీవితం పండాలి అని అర్థం.

---

**77. బుద్ధిః స్థిరా భవితు మీశ్వరపాదపద్మ**

**సక్తా వధూర్విరహిణీవ సదా స్మరంతీ ।**

**సద్భావనా స్మరణ దర్శన కీర్తనాది**

**సంమోహితేవ శివమంత్ర జపేన వింతే ।।**

శివా ! నా బుద్ధి భర్తృవియోగమును పొందిన భార్య వలె నిరంతరము ధ్యానము చేయుచు, శివ మంత్రము జపించుచు మోహము నొందినదై - మీ పాదధ్యాన,

Sri Maha Kameswari Seva Trust

స్మరణ, సందర్శన, కీర్తన, పూజనాదులను గూర్చి విచారించుచున్నది. దీని నుద్ధరింపుము.

భర్తకు దూరమై విరహవేదనతో సతమతమయే భార్యతో - పూర్తిగా శివుని యందు నిరంతర ఆసక్తి కలిగిన తన బుద్ధిని పోల్చి - శివభక్తి ఎలా వుండాలో సూచిస్తున్నారు.

దూరమైన భర్తనే కలవరిస్తూ, బాహ్య ప్రపంచాన్ని పూర్తిగా విస్మరిస్తూ, ఒక మాట, ఒక పలుకు, ఒక చూపు, ఒక తలపు ఏమీ లేకుండా నిరంతరం భర్త మీదనే, భర్త సమాగం మీదనే దృష్టి ఉండి చూడ్డానికి ఒక పిచ్చిదాని వలె దుఃఖిస్తూ, వేదన పడుతూ వుండే భర్తృవిరహిణి లాగా బుద్ధి శివుని మీదనే లగ్నమై, శివ నామాన్నే స్మరిస్తూ, శివ నామాన్నే కలవరిస్తూ, ఇతర ప్రపంచంతో సంబంధం లేనట్లుగా - శివ పాద దర్శనానికి, శివ పాద పూజకు, సంకీర్తనానికి తపిస్తోంది. ఇంక ఆలస్యం చేస్తే పిచ్చి ముదిరిపోయి ఏమవుతుందో ననిపిస్తోంది. వెంటనే వచ్చి దానిని ఉద్ధరించు - అని శంకరులు శివుణ్ణి కోరు కుంటున్నారు. అంటే బుద్ధిని ప్రియురాలిగా స్వీకరించి దాని వేదనను పోగొట్టి జన్మను చరితార్థం చెయ్యి అని అర్థం.

భగవంతుని పై విరహం కూడా పరాకాష్ట భక్తిని సూచిస్తుంది.

రాధ, మీరా, గోపికలు, శ్రీ కృష్ణ చైతన్య ప్రభువు, రామకృష్ణ పరమహంస మొదలైన వారందరూ ఈ కోవకు చెందినవారే !

---

**78. సదుపచార విధి ష్వనుబోధితాం**

**సవినయాం సుహృదం సముపాశ్రితామ్ |**

**మమ సముద్ధర బుద్ధి మిమాం ప్రభో**

**వరగుణేన నవోఢవధూమివ ||**

జగత్ప్రభూ ! మీ పాదపూజ యందు సుశిక్షితమై, వినయముతో గూడిన నా బుద్ధికి - ఉపచారము చేయుట యందు సుశిక్షితురాలును, వినయవంతురాలు నగు క్రొత్తగా పెండ్లి చేసుకొనిన భార్యకు ను పోలె - నుపదేశించి యుద్ధరింపుము.

Sri Maha Kameswari Seva Trust

బుద్ధిని క్రొత్త పెళ్ళికూతురుతో పోల్చి భక్తి తత్త్వాన్ని వివరిస్తున్నారు. వరునికి వుండవలసిన కళ్యాణ గుణాలున్న నిన్ను - ఇతర ప్రేరణాలు నిర్బంధాలు లేకుండా ఉత్తమ వధూలక్షణాలున్న నా బుద్ధి - స్వయంగా వరించింది. ఈ బుద్ధి వధువు - వినయము, ఉపచారసేవాభిలాష, సహజ

మైన సిగ్గు, నిర్మలహృదయము వున్న సద్గుణ సంపన్నురాలు. ఈ క్రొత్త వధువుకు చెప్పవలసి నవి చెప్పేవిధంగా చెప్పి, బెరుకు తనం పోగొట్టి, ఉద్ధరించి నన్ను ధన్యుణ్ణి చెయ్యి - అంటున్నారు. అంటే - తన బుద్ధితో కాపురం చెయ్యడానికి శివుణ్ణి ఒప్పిస్తున్నారన్నమాట!

---

**79. నిత్యం యోగి మనస్సరోజ దళ సంచార క్షమస్త్వత్క్రమః**

**శంభో తేన కథం కఠోర యమరాడ్వక్షః కవాటక్షతిః ।**

**అత్యంతం మృదులం త్వదంఘ్రియుగళం హా మే మనశ్చింతయ**

**త్యేతల్లోచన గోచరం కురు విభో హస్తేన సంవాహయే ||**

చంద్రశేఖరా ! మునీశ్వరుల మనః పద్మములందు సంచరింపదగిన మీ మృదు పాదములతో నా కఠోరమైన యా యముని రొమ్ము ఎట్లు తన్నితివి ? అయ్యో! నా మనస్సునకు మిక్కిలి విచారము కలుగుచున్నది. నా కన్నుల కగపడునట్లు చేయుము. నా చేతులతో మీ పాదములొత్తి సేవ చేసెదను.

భగవంతుని చూడగానే భక్తి కలుగుతుంది. ఆ తర్వాత ఆ భగవంతుని పాదసేవ చేసినప్పుడు ముక్తి కలుగుతుంది. అంటే భగవంతుని ముఖం - భక్తిని, పాదాలు ముక్తిని కలుగచేస్తాయన్నమాట ! అందుకే ఎక్కువమంది భక్తులు భగవంతుని పాదాలకే ప్రాముఖ్యాన్నిస్తారు. అందుకే శంకరులు గురుపాదుకాస్తోత్రం వ్రాశారు. శ్రీ విద్యలో కూడా "పాదుకాంతదీక్ష" ప్రసక్తి వుంటుంది. శ్రీమద్రామాయణం లో కూడా " పాదుకా పట్టాభిషేక ఘట్టం " ఆధ్యాత్మిక రహస్య విషయాలతో ప్రాముఖ్యాన్ని కలిగి వుంటుంది. గుహుడు శ్రీరాముని పాదాలను నీళ్ళతో కడిగిే భాగ్యాన్ని చిత్రంగా దక్కించుకున్నాడు. శంకర భగవత్పాదులు

Sri Mahakameswari Seva Trust

కూడా శివునితో చిత్రమైన సంభాషణ చేసి ఆ అవకాశాన్ని దక్కించు కునేందుకు ఈ శ్లోకము ద్వారా ప్రయత్నించారేమోననిపిస్తుంది.

శివా ! నిన్ను నిరంతరం యోగులు మనస్సులలో ధ్యానిస్తూ వుంటారు. అప్పుడు నువ్వు వారి హృదయ కమలాలకు సంబంధించిన రేకులపై సంచరించాల్సి వస్తుంది. ఇది నీకు నిత్యమూ తప్పనిసరి పనే కదా! సహజంగానే నీ పాదాలు మృదువుగా వుంటాయి. యోగుల హృదయ పద్మాల రేకులపై నిత్యము నడవవలసి రావడంతో అవి మరింత సుకుమారంగాను సుతిమెత్త

గాను తయారై వుంటాయి. అటువంటి సుతిమెత్తని పాదాలతో బండరాయి లాంటి, తలుపు రెక్కలాంటి కఠినమైన యముని ఎదురు రొమ్మును ఎలా తన్నావయ్యా? అమ్మో! దీన్ని తలుచుకుంటేనే నాకు కడుపు తరుక్కుపోతోంది. మనస్సు చివుక్కుమంటోంది. హృదయం ద్రవించి పోతోంది. ఏదీ! ఆ పాదాలను ఒక్కసారి నా ముందు పెట్టు. చేతులతో మెత్తగా పట్టుకొని వత్తుతాను. అని - పాద సంసేవనా భాగ్యాన్ని దక్కించుకునే ప్రయత్నం చేసి తరించారు.

---

**80. ఏష్యత్యేష జనిం మనో2స్య కఠినం తస్మిన్నటానీతి మ**

**ద్రక్షాయై గిరిసీమ్ని కోమలపదన్యాసః పురా2భ్యాసితః |**

**నో చేద్దివ్యగృహాంతరేషు సుమనస్తల్పేషు వేద్యాదిషు**

**ప్రాయస్సత్సు శిలాతలేషు నటనం శంభో కిమర్థం తవ ||**

శివా! నీవు నన్ను గూర్చి ఈ పురుషుడు భూమిలో పుట్ట బోవును. వీని మనస్సుమిక్కిలి కఠినముగా నుండును. అప్పుడు నాకు దాని యందు సంచరింపవలసి వచ్చును అని ఆలోచించి నా రక్షణమునకై నేను పుట్టక పూర్వమే కఠిన మైన కొండలమీద నీ కోమల పాదములతో నడచుట కలవాటుచేసితివి. కానిచో మేడలు, మిద్దెలు, పూల పాన్పులు, మంచి మంచి అరుగులు ఉండగా నీకేల ఈ రాళ్ళమీద నాట్యము చేయవలసి వచ్చినది ?

Sri Mahakaleswari Seva Trust

క్రిందటి శ్లోకంలో శివుని పాదాలు సుకుమారంగా సుతిమెత్తగా వుంటాయని చెప్పిన శంకరులు అటువంటి సుతిమెత్తని పాదాలైనా గూడా రాళ్ళమీద అప్పలమీద ఎందుకు నాట్యం చెయ్యవలసి వచ్చిందో చాల చిత్రంగా ఈ శ్లోకములో చెప్తున్నారు - శంకరుల మాటలు వినండి.

ఓ పరమేశ్వరా! " కొంతకాలానికి  కలియుగం వచ్చినప్పుడు వీడొకడు 'కాలడి' లో జన్మిస్తాడని, కఠినమైన నిర్ణయాలు ఎన్నో వీడు తీసుకోవాల్సి వస్తుందని ( మాతృప్రేమ ఉన్నా తల్లిని వదిలి వెళ్ళడం, ఇంద్రియ సుఖాలను వదిలి సన్యసించడం, అభిమానానికి తావివ్వకుండా గురువును ఆశ్రయించడం మొదలైనవి) . అందుకు కావలసిన కఠినమైన మనస్సు వీడికి వుండి తీరుతుందని - అటువంటి మనస్సునందు సంచరించాల్సిన అవసరం కూడా రావచ్చనీ నీకు ముందే తెలుసునా?" లేకపోతే మిద్దెల్లోను, పాలరాతి సౌధాల్లోను, పూలపాన్పుల మీద సంచరించాల్సిన నువ్వు - వాటిని వదిలి, రాళ్ళమీద అప్పలమీద కొండల్లోను - గుట్టల్లోను నాట్యం చేసి నీ పాదాలకు కర్కశత్వాన్ని దృఢత్వాన్ని అలవాటు చేసుకోవాల్సిన అవసరం దేనికి ?

నువ్వెంత దయా సముద్రుడ వయ్యా ! నాపై నీకెంతటి  కరుణయ్యా ! ఎప్పుడో పుట్టబోయే నాకోసం, నా సంరక్షణ కోసం ముందునుంచే నీ పాదాలను ఎన్ని కష్టాలను ఓర్చుకొనేట్లు అలవాటు చేశావయ్యా! తండ్రీ !  నీ ప్రేమ రమ్యం.నా జన్మ ధన్యం.( ఈ శ్లోకములో శివుని అనుగ్రహం తన మీద ఎంతటిదో గూడా పరోక్షంగా చెప్పినట్లయింది.)



Sri Maha Kameswari Seva Trust

**81. కంచిత్కాల ముమామహేశ భవతః పాదారవిందార్చనైః**

**కంచిద్ధ్యానసమాధిభిశ్చ నతిభిః కంచిత్కథాకర్ణనైః |**

**కంచిత్కంచిదవేక్షణైశ్చ నుతిభిః కంచిద్దశా మీదృశీం**

**యః ప్రాప్నోతి ముదా త్వదర్పితమనా జీవన్స ముక్తః ఖలు ||**

ఉమానాథా! ఒకప్పుడు మీ పాదపూజలు, వేరొకప్పుడు మీ ధ్యానములు ఇంకొకప్పుడు మీ పాదవందనములు, మరొక్కప్పుడు మీ కధలు వినుట, కొన్ని వేళల మీ దర్శనము చేయుచు సంతోషము నొందువాడు జీవన్ముక్తుడగును.

జీవన్ముక్తులవాలంటే ఏం చెయ్యాలో ఈ శ్లోకములో చెప్తున్నారు. " కాలక్షేపోన కర్తవ్యం కర్తవ్యం హరి కీర్తనం" -అన్నట్లు కాలాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగ పరచుకోవాలి. ప్రాపంచిక విషయాలు చర్చించు కునేందుకు, ఇంద్రియ సుఖాలనుభవించేందుకు, వ్యర్ధ ప్రసంగాలకు, స్పర్ధ వాదాలకు, నినాదాలకు వ్యర్ధపరచే కాలాన్ని సద్వినియోగ పరుచుకోవాలి. వ్యక్తిగత, కుటుంబపరమైన బాధ్యతలు నిర్వర్తించడానికి పోగా మిగిలిన కాలాన్నంతా భగవత్సంబంధ విషయాలపై - కొంతకాలం పూజకు, కొంతకాలం స్తుతులకు, మరికొంతకాలం ప్రాణాయామ ధ్యానాదులకు కేటాయించాలి. నిర్లక్ష్యము, వైముఖ్యము రాకుండా త్రికరణాలైనమనోవాక్కాయాలను వినియోగించి ఎవరు ఇలా ఆనందంతో జీవితాన్ని వెళ్ళబుచ్చుతూ వుంటారో

వాళ్ళు జీవించి యుండి కూడా ముక్తులే' అని శంకర భగవత్పాదులు ఈ శ్లోకములో నిర్ధారిస్తున్నారు.

---

**82. బాణత్వం వృషభత్వ మర్ధవపుషా భార్యాత్వ మార్యాపతే**

**ఘోణిత్వం సఖితా మృదంగ వహతా చేత్యాదిరూపం దధౌ |**

Sri Maha Kameswari Seva Trust

**త్వత్పాదే నయనార్పణం చ కృతవాం స్త్వద్దేహభాగో హరిః**

**పూజ్యాత్పూజ్యతరః స ఏవ హి న చేత్కోవా తదన్యోఽధికః ||**

ఓ పార్వతీశ్వరా ! త్రిపుర సంహార కాలమందు విష్ణువు నీకు బాణ మయ్యెను. వృషభరూపమైన నీకు వాహనముగా నుండెను. ఆర్యా రూపముతో నీ యర్ధాంగమున భార్యయైన యొప్పారె. నీ పాద సందర్శనకై వరాహ రూప మెత్తెను. జగన్మోహినీ రూపమున నీవాల్లభ్యము పొందెను. నీ తాండవ సమయమున మద్దెల వాయించెను. తన నేత్రమును నీ పాదముల కడ నర్పించెను. మీ అనుగ్రహమునకు పాత్రుడై మీ యర్ధాంగ సంగియగుటను బట్టియే కదా బ్రహ్మాదులందర కంటె పూజ్యతరుడయ్యెను. కానిచో నంతవాడింకెవ్వడైన గలడా ?

(కనుక బ్రహ్మాదులు పూజ్యులు, విష్ణువు పూజ్య తరుడు, నీవు పూజ్యతముడవు అని భావము.)

స్థితి కారుడు, పోషక కారుడు - త్రిమూర్తులలో ఒకడు అయిన మహావిష్ణువంతటివాడు శివపాద దర్శనానికై చేసిన ఒక ప్రయత్నం గురించి 73వ శ్లోకములో చెప్పారు. ఇప్పుడు ఆ శ్రీమహావిష్ణువే ఇంకా ఎన్నెన్ని ప్రయత్నాలు చేసి శివుణ్ణి మెప్పించి దేవత లందరిలోను పూజ్యతరు డయ్యాడో చెప్తున్నారు.

విష్ణుమూర్తి - త్రిపురాసుర సంహార కాలంలో శివుని విల్లుకు బాణంలాగా మారాడు. వృషభమై శివునికి వాహన మయాడు, ఆర్యా రూపంతో శివుని సగం శరీరంగా భార్య అయాడు, పాద దర్శనానికి వరాహమయాడు, జగన్మోహినీ రూపంలో శివుని మోహానికి గురి అయాడు. శివుడు తాండవ నృత్యం చేస్తున్నపుడు మద్దెల వాయించాడు.

శివునికి సహస్ర కమలార్చన చేస్తున్నపుడు ఒక కమలం తగ్గితే తన నేత్రాన్నే కమలంగా శివునకు సమర్పించాడు. ఇన్ని విధాలుగా శివుని అనుగ్రహం పొందడానికి ప్రయత్నించి చివరకు శివానుగ్రహానికి పాత్రుడైన బ్రహ్మాది దేవత లందరి కంటె పూజ్యతరు డయ్యాడు. ఇలా అనుకోవడం తప్పైతే ఆ విష్ణువు తప్ప బ్రహ్మాదుల్లో అధికుడెవరు గలరు? అని అంటున్నారు శంకరులు.

Sri Maha Kameswari Seva Trust

దీన్నిబట్టి బ్రహ్మాదులు పూజ్యులని, విష్ణువు పూజ్యతరుడని, శివుడు పూజ్యతముడని అర్థం చేసుకోవలసి వుంటుందని అనుకోవచ్చు.

---

**83. జన సమృతి యుతానాం సేవయా దేవతానాం**

**న భవతి సుఖలేశః సంశయో నాస్తి తత్ర |**

**అజని మమృత రూపం సాంబమీశం భజంతే**

**య ఇహ పరమసౌఖ్యం తే హి ధన్యా లభంతే ||**

ఇతర దేవతలందఱు జనన మరణములు గలవారు. అట్టి వారిని సేవించు వారికి విషయా నందమైనను తృప్తిగా గలుగదు. జనన మరణములు లేని పార్వతీ సమేత పరమేశ్వరుని, శరీరవంతులై యుండగనే సేవించు వారు కృతార్థులై మోక్షానందమును పొందుదురు.

ఏ ఏ పనులకు ఎవరెవరి దగ్గరకు వెళ్తే పనులు సక్రమంగా జరిగి చివరకు ఫలం చేకూరుతుందో ముందు తెలుసుకోవడం అవసరం. జనన మరణాలకు అతీతమైన శాశ్వతానందాన్ని అంటే మోక్షానందాన్ని పొందాలంటే ఆ జనన మరణాలను జయించిన వారెవరైనా వుంటే - అంటే జనన మరణాలు ఎవరికి వుండవో లేదా పని చేయవో వారి దగ్గరకు వెళ్ళాలి. దిక్పాలకుల మని చెప్పుకున్న ఇంద్రాది దేవతలు, సృష్టి కర్త అయిన బ్రహ్మతో సహా ఇతర దేవతామూర్తులందరూ ప్రళయ కాలం ఆసన్నం కాగానే కాలవశులు కావాల్సిందే ! జనన మరణ క్లేశాలు పొందాల్సిందే ! వాళ్ళకి విషయానందమే తృప్తిగా వుండదు. ఇంక వాళ్ళు, శాశ్వతానందాన్నేం పొందగలరు ఇవ్వగలరు ? కానీ ప్రళయంలో కూడా సాక్షీభూతుడుగా నిలిచేది ఒక్క సదాశివుడే !

సదాశివునికి జననం లేదు, మరణం లేదు. జననమే వుంటే తల్లిదండ్రులుండేవారు, మరణమే వుంటే విషం మ్రింగేవాడు కాదు. యమధర్మరాజును బొమ్మపై తన్ని మార్కండేయుణ్ణి కాపాడ కలిగేవాడూ కాదు. ఎప్పుడూ 'ఉండటమే' ఆయన ' కీలక లక్షణము' . ఈ లక్షణం మరియే ఇతర దేవతలకీ లేదు. ఆయనలోంచి ఈ విశ్వం యావత్తూ వస్తూ, నిలుస్తూ, చివరకు ఆయన లోకే లీనమై పోతూ వుంటుంది. ఈ మూడు ప్రక్రియలు ఆయన యందు

Sri Maha Kameswari Seva Trust

జరుగుతూ వుంటే - ఆయన ఆ మూడింటినీ సాక్షీ భూతుడు గానే నేపథ్యంలో వుంటాడు. అందుకే ఆయన సదాశివుడు . 'అంటే ఎప్పుడూమంగళకరంగా మనగలిగేవాడు.' ఇటువంటి లక్షణం గలవారిని ఆశ్రయిస్తే శాశ్వతత్వం అంటే ఏమిటో, జనన మరణాతీతమైన స్థితి అంటే ఏమిటో, మోక్షానందమంటే ఏమిటో - తెలిసి ఇహలోకంలో శరీరంతో ఉన్నపుడే వాటిని పొందవచ్చు గాని - జన్మిస్తూ మరణిస్తూ కాలవశులైపోయే ఇతర దేవతల్ని ఆశ్రయిస్తే ప్రయోజనం ఏమొస్తుంది - అంటున్నారు శంకరులు.

---

**84. శివ తవ పరిచర్యా సంవిధానాయ గౌర్యా**

**భవ మమ గుణధుర్యాం బుద్ధి కన్యాం ప్రదాస్యే ।**

**సకల భువన బంధో సచ్చిదానంద సింధో**

**సదయ హృదయ గేహే సర్వదా సంవసత్వమ్ ।।**

శివా! సమస్త సద్గుణములు గల నా బుద్ధి కన్యను నీకిత్తును. అది గౌరిని గూడి నీకు నిరంతరము సత్సపర్యలు చేయగలదు. నా హృదయసీమ యందు గృహస్థుడవై సుఖముగా వసింపుము.

కైలాసంలో ఉన్న శివుణ్ణి ఊహించుకుని, ఎక్కడెక్కడి దేవాలయాలకు వెళ్ళి, ఆ దేవాలయాల్లోని విగ్రహాల్లో శివుణ్ణి ఊహించుకుని భజించడం కంటే ఎక్కడికీ కదలకుండా, ఒక్క చోటనే స్థిరంగా ఉండి ఆ శివుణ్ణి సేవించడానికి వీలుందా అని శంకరులు ఆలోచించారు.

ఒక గృహస్థుకు బాగా నచ్చిన కుర్రవాడొకడున్నాడు. ఆ కుర్రవాడు అన్నివిధాలా యోగ్యుడు. జ్ఞానవంతుడు. ఎలా అయినా ఆ కుర్రవాడు ఎప్పుడూ తన ఇంట్లోనే ఉంటే బాగుండుననుకున్నాడు. అంతే ! తనవద్ద అన్ని విధాలా సరిపోయే కూతురు ఉన్నాది. వెంటనే ఆ కూతుర్ని ఆ కుర్రవాని కిచ్చి ఇల్లరికపు టల్లునిగా తెచ్చుకున్నాడా గృహస్థు.

Sri Maha Kameswari Seva Trust

సరిగ్గా ఇలాగే శంకర భగవత్పాదులు కూడా శివుణ్ణి తన దగ్గరే తనలోనే శాశ్వతంగా ఉండిపోయే విధంగా చేసుకోగలిగేరు.

అయితే శంకరులకు పెళ్ళీ కాలేదు పిల్లలెక్కడున్నారు - శివునికి కట్టబెట్టడానికి ? అని అనుమానం రావచ్చు. ఆయన అంతకంటే ఇంకా విశేషమైన పద్ధతిలో శివుణ్ణి పొందగలిగేరు కారణం మేధస్సులో శంకరుని మించిన వారెవరున్నారు ? అంతటి బుద్ధి నైశిత్యం ఎవరికి ఉంటుంది ? అంతటి తన 'బుద్ధి' అనే కూతుర్ని శివుని కిచ్చి పెళ్ళి చేయడానికి శివుని తో ఒప్పందం చేసుకున్నారు.

ఇంతకీ పెళ్ళికి ముందు శివుని కి శంకరులకు మధ్య జరిగిన సంభాషణ ఎలా సాగిందో విందామా!

"ఇంతకు పూర్వమే పెళ్ళైన వాణ్ణి. పైగా ఇద్దరితో పెళ్ళైంది. ఆ ఇద్దరూ ఉండగా ఎలాగయ్యా" అన్నాడుశివుడు.

"ఎలాగూ ఒకరు కాకుండా ఇద్దరు వచ్చారు కాబట్టి మూడోదానికి అభ్యంతరం ఉండకూడదు " - అన్నారు శంకరులు.

భలేవాడివయ్యా అయితే - ఇల్లరికం అంటున్నావు - ఇంతకు పూర్వమే చేసుకున్న వారిద్దరికీ అన్యాయం చేసి, వాళ్ళను వదలి మీ ఇంటికి రమ్మంటున్నావు, ఇదేమన్నా నీకు న్యాయమనిపిస్తోందా ?"

అబ్బెబ్బే ! వాళ్ళిద్దరినీ వదిలేసి మా ఇంటికి రమ్మనడం లేదు. వాళ్ళిద్దరినీ కూడా తీసుకుని మా ఇంటికి వచ్చేయ మంటున్నాను. మా అమ్మాయి, చెప్పుకోకూడదు గాని చాలా బుద్ధి మంతురాలు. సుగుణాల రాశి.మీవంటి పెద్దలంటే ఎంత గౌరవముమో, భక్తో చెప్పలేను. మీ ముగ్గురే కాదు,- మీ ఇతర కుటుంబ సభ్యులు ( గణపతి, కుమారస్వామి) అంతా వచ్చినా ఏమీవిసుక్కోకుండా, అందరికీ సపర్యలు చేసి సేవించు కుంటుంది. మీకా భయం అక్కర్లేదు. ఇంతకీ మీ అమ్మాయి పేరేమంటున్నావు ?

బుద్ధి మంతురాలు కదండీ ! అందుకే మా అమ్మాయి పేరు బుద్ధా దేవి.

" ఓ! ఇంతకీ మీ ఇల్లెక్కడ? "

ఎంతో దూరం లేదండీ - నా హృదయమే ఆ ఇల్లు. నా బుద్ధి అనే కన్యను పెళ్ళి చేసుకొని నా హృదయమనే ఈ ఇంట్లోనే మీ యవత్కుటుంబం సంతోషంగా మా

Sri Maha Kameswari Seva Trust

అమ్మాయి బుద్ధి చేసే సపర్యలు పొందుతూ ఎంతకాలమైనా స్వేచ్ఛగా, ఆనందంగా వుండండి.

చాలా గట్టివాడవయ్యా! సరే !అలాగే కానీ! అన్నాడు శివుడు.

శంకరుల మేధస్సే మేధస్సు. మొత్తానికి శివుడంతటి వాణ్ణి ఇల్లరికపుటల్లునిగా చేసుకొని నిత్యం తన హృదయం లోనే ఆయన సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ సేవించుకున్నారు శంకరులు.

---

**85. జలధిమథన దక్షో నైవ పాతాళ భేదీ**

**న చ వనమృగయాయాం నైవ లుబ్ధః ప్రవీణః ।**

**అసన కుసుమ భూషా వస్త్ర ముఖ్యాం సపర్యాం**

**కథయ కథమహం తే కల్పయానీందుమౌళే ।।**

చంద్రశేఖరా ! నీ కిష్టమైన కాలకూటాహారము గాని, పుష్పము వలె శిరోభూషణ ముగ చంద్రుని గాని యిచ్చుటకు నేను సముద్రము మథింపగల వాడను గాను. నీకిష్టమైన భుజగభూషణము కల్పించుటకు పాతాళమును భేదింపలేను. గజచర్మ వస్త్ర మిచ్చుటకు అడవుల్లో వేటాడు బోయను కాలేను. ఇంక నిన్నెట్లు పూజింపగలను?

దేవతా పూజకు ఉపచారాలెన్నో కావాల్సి వుంటాయి. షోడశోపచార పూజ అయితే పదహారు రకాల ఉపచారాలు చెయ్యాల్సి వుంటుంది. ఆ పదహారింటిలో అతి ముఖ్యమైనవిగా అనుకుంటే కనీసం వస్త్రా భరణం, నైవేద్యం, పుష్పము ఈ మూడింటినైనా సమర్పించ గలిగి వుండాలి. శివపూజ విషయం అయితే - మరికొన్ని చిక్కులున్నాయి. ఆయనకు తగ్గ హోదాలో ఉపచారాలు చెయ్యగలమో లేదో ఆలోచించుకోవాలి. శంకరులు ఈ విషయంలో ముందే ఆలోచించి సందేహపడినట్లు చెప్తున్నారు ఈ శ్లోకములో.

శివుడంతటి వానికి వస్త్రాన్ని సమర్పించాలంటే - మనం సాధారణంగా కట్టుకునే నూలు బట్టలు, పట్టుబట్టలు నప్పుతాయా? ఆయన గజ చర్మాన్నో,

Sri Maha Kameswari Seva Trust

పులి చర్మాన్నో గాని కట్టడు. అవి తేవాలంటే ముందు వేటాడటం నేర్చుకుని దానిలో ప్రావీణ్యం సంపాదించి, అరణ్యాల్లోకి వెళ్ళి ఏ ఏనుగునో ఏ పులినో చంపి వాటి చర్మం ఒలిచి పట్టుకు రావాలి. ఇది తన వల్ల అయే పనేనా?

ఆభరణాన్ని దేన్నైనా ఇద్దామంటే శివునికి నాగాభరణాలంటేనే ఇష్టం. వాటిని తేవాలంటే పాతాళం లోని నాగలోకానికి వెళ్ళాలి ఈపని మాత్రం తను చెయ్యగలడా ?

ఆహారం ఇవ్వాలంటే - మనం తినే పప్పు, కూర, పచ్చడి, పిండివంట భోజనం ఏం బాగుంటుంది? ఆయన హెూదాకు తగ్గట్లు అమృతాన్ని భోజనం గా పెట్టాలి. ఆ అమృతాన్ని సాధించాలంటే సముద్రాన్ని మథించాలి. అదేమన్నా సామాన్య విషయమా?

పోనీ పుష్పాన్ని సమర్పిద్దామంటే - కనీసం కల్పవృక్ష కుసుమాలైనా వుండాలి కదా! వాటిని సాధించాలన్నా సముద్ర మథనం చెయ్యాల్సిందే కదా !

కాబట్టి, శివునికి తగ్గట్టుగా వుండే వస్త్రం , ఆభరణం, ఆహారం, పుష్పాలను సమర్పించగలిగే సామర్థ్యం తనకు లేదని ఒప్పుకుంటూ ఏదో యథాశక్తి ధ్యాన ఆవాహనాది షోడశోపచార పూజను మాత్రమే ప్రస్తుతానికి చేయగలనని ( నువ్వు కనుక నీకు సరిపోయే విధంగా షోడశోపచారాలను సమర్పించగల సామర్థ్యాన్ని నాకిస్తే నీకు తగ్గట్లు గానే అన్నింటినీ సమర్పించగలననే భావం కూడా "ప్రస్తుతాని"కి అన్నపదంలో ఉన్నది) ముందే సంకల్పం చెప్పుకుని నిత్యం శివపూజ చేసేవారుట.



Sri Maha Kameswari Seva Trust

**86.పూజాద్రవ్యసమృద్ధయో విరచితాః పూజాం కథం కుర్మహే**

**పక్షిత్వం న చ వా కిటిత్వమపి న ప్రాప్తం యా దుర్లభమ్ ।**

**జానే మస్తక మంఘ్రి పల్లవ ముమాజానే తే 2హం విభో**

**న జ్ఞాతం హి పితామహేన హరిణా తత్త్వేన తద్రూపిణా ।।**

పార్వతీ వల్లభా ! పూజా ద్రవ్యములు విశేషముగా నున్ననూ నిన్ను పూజించు టెట్లు? నీ శిరస్సు తెలియదు. నీ పాదములు తెలియవు. హంస వరాహ రూపములు ధరించి నిన్ను తెలిసికొన యత్నించిన బ్రహ్మవిష్ణువులే తెలిసికొనలేకపోయిరిగదా !

క్రిందటి శ్లోకంలో " యథాశక్తి ధ్యాన ఆవాహనాది షోడశోపచార పూజాం,కరిష్యే" అని సంకల్పించి పూజ చేయగలనని శంకరులు చెప్పారు. సరే అలాగే తనే శక్తికి తగ్గట్లు పూజా ద్రవ్యములను సంపాదించి, తీరా పూజ ప్రారంభించబోయే ముందు శంకరులకు ఒక అనుమానం వచ్చింది. పూజలందుకొనే దేవతను నఖశిఖ పర్యంతం చూస్తూ - అంగపూజ చేసి ప్రారంభించాలి కదా! మరి అలా చూడాలనుకున్నపుడు శివుని శిరస్సును పాదాలను గూడా చూడగలగాలి గదా ! అవి రెండూ ఎక్కడా కనబడటం లేదుట. శివుని దేహం యొక్క ఆద్యంతాలను అంటే శిరస్సు, పాదాలను చూడాలంటే బ్రహ్మలాగ హంసరూపం ఎత్తాలి.

విష్ణుమూర్తి లాగా వరాహ రూపం ధరించాలి. అలాంటి రూపాలను నేను పొందలేని వాడను గదా! అయినప్పటికీ హంస రూపం ధరించినా - బ్రహ్మ గాని, వరాహ రూపం ధరించినా - విష్ణువు గానీ నీ శిరస్సూ పాదాలను చూడలేకపోయారుగదా! ఆ రూపాలను ఎత్తి గూడ ఏం లాభం? - అంటున్నారు శంకరులు. అంటే - బ్రహ్మ, విష్ణువు లాంటి వాళ్ళే నీ తలను పాదాలను తెలుసుకోలేక పోయినప్పుడు వాళ్ళముందు అతి సామాన్యుడనైన నేను వాటిని చూసి పూజించగలనా? అని అర్థం.

విశ్వమంతా నిండి విశ్వమే తన ఆకృతిగా కలిగిన శివునికి నిజంగా అంగపూజ చెయ్యాలంటే సాధ్యమయే విషయం కాదని తాత్పర్యం.

---

Sri Maha Kameswari Seva Trust

**87. అశనం గరళం ఫణీ కలాపో వసనం చర్మ చ వాహనం మహోక్షః |**

**మమ దాస్యసి కిం కిమస్తి శంభో తవ పాదాంబుజ భక్తి మేవ దేహి ||**

నీలకంఠా ! నీవు భుజించునది విషము. అలంకరించుకొనునది పాము. కట్టుబట్ట ఏనుగు తోలు. వాహనము ఎద్దు. నీవేమి నాకు ఇచ్చెదవు. నీ పాద భక్తి యొక్కటే చాలు. అది ఇమ్ము.

దేన్నైనా ఇవ్వగల సామర్థ్యం ఉండే దేవుడే ప్రసన్నుడై వరం కోరుకోమంటే - సగటు మనిషి అవసరాలు మూడే, అవే ఆహారం, వస్త్రం,నివాసం. అయితే - ఇవికాక ఇంకా ఇస్తామంటే నగలు, వాహనాలు కోరుకుంటారు. సాక్షాత్తూ శివుడే - శంకర భగవత్పాదులన్నే అలా అడిగితే ఏం కోరుకుంటారో ఈ శ్లోకం ద్వారా తెలుపుతున్నారు.

ఎవరైనా తినడానికి పెట్టమని అడిగితే మనం ఏది తింటున్నామో అదే రకమైన దాన్ని పెడతాం - అంతేకదా ! మరి శివుణ్ణే అడిగితే ఆయన ఏం పెడతాడు - ఆయన తిన్నది విషం కాబట్టి మనకూ అదే పెడతాడు. అందుకనే శంకరులు నీ ఆహారం నాకు ఒద్దు అన్నారు.

ఎవరైనా కట్టుకోడానికి బట్ట అడిగితే మనం కట్టుకొనే నేత లేదా పట్టుబట్టల లాంటివే వారికీ ఇస్తాము. మరి శివుణ్ణే అడిగితే ఆయన ఏం ఇస్తారు. గజచర్మం ఇస్తారు. అందుకే శంకరులు నువ్వు ఇచ్చే వస్త్రం నాకొద్దు అంటున్నారు.

ఎవరైనా తల దాచుకోవడానికి ఆశ్రయం అడిగితే మనం గృహంలోని ఏ గదినో, అరుగునో ఇస్తాం. మరి శివుణ్ణే అడిగితే ఆయన వుండేది వల్లకాడు కాబట్టి అక్కడికే వచ్చి తనతోపాటు ఉండమంటాడు - అందుకే శంకరులు శివుడు ఇచ్చే ఆశ్రయం వద్దన్నారు.

పైన చెప్పిన కనీస అవసరాలు కాకుండా ఆభరణాలను బహుమతిగా ఇవ్వదలచు కొంటే మనమైతే మనం ధరించే లాంటివే అవతలవాళ్ళకూ ఇస్తాం. మరి శివుడైతే పాములన్నే పెట్టుకోమని ఇస్తాడు. అందుకే శంకరులు ఆయనిచ్చే ఆభరణాలను కూడా వద్దన్నారు.

ఇకపోతే మనవాళ్ళకు వాహనం కొనిద్దామనుకున్నా మనుకోండి, ఏంచేస్తాం ! ఏ స్కూటరో, కారో ఏదోఒకటి మన తాహతుకు తగ్గట్టు ఇస్తాంకదా! మరి శివుడైతే తన

Sri Maha Kameswari Seva Trust

ఎద్దు వాహనాన్ని వాడుకో మంటాడు, లేదా మరొక ముసలి ఎద్దునే ఇస్తాడు. అందుకే శంకరులు దీన్నీ వద్దన్నారు.

ఇలా వంకలు పెట్టుకుంటూ ఇచ్చేవేమీ వద్దంటూవుంటే మరి శివుని వద్ద ఇచ్చేందుకు ఏముంటుంది? మనకు నచ్చేవి వుండవు. ఆయనిచ్చేవి అలానే వుంటాయి మరి.

అందుకే శంకరులు అటువంటి వాటిని దేన్నీ కోరకుండా తనకు కావలసినది ఏదో అదే అడిగారు. ఏమిటది? శివుని పాదారవిందాలపై ఎడబాటు లేని భక్తిని తనకు అనుగ్రహించ మన్నారు.దాన్ని ఇవ్వడానికి శివునికి అభ్యంతరం ఏమీ ఉండదు గదా!

ఈ శ్లోకం పైకి ఏదో శివుణ్ణి కించపరచినట్లుగా వుంటుంది, కాని శంకరులు అడిగినది సామాన్యమైనది కాదు. శివుని పాదాల పై భక్తిని అడిగారు. అది కూడా ఎడబాటు లేని భక్తి . ఆ పాదాలు సామాన్యమైనవా? సకల సౌభాగ్య నిధులు. ఈశ్వర సంబంధమైనదే "ఐశ్వర్యం" ఐశ్వర్యం అంటే ఇంక అడగాల్సిన అవసరం ఏదీ వుండదో అది - దాన్నే ఈశ్వరానుగ్రహం అంటారు.

శివుని అనుగ్రహమే వుంటే ఇంక కావలసింది ఏముంటుంది ?

కాబట్టి మనం కూడా శివుణ్ణి అలాంటి అనుగ్రహాన్ని పొందగలిగే శివపాదపరమైన భక్తినే కోరుకోవాలని ఈ శ్లోకములో శంకరులు చెప్పుచున్నారు. అయినా నిజమైన భక్తులు, ముక్తులు, యోగులు ప్రాపంచిక సంబంధమైన వేమీ ఎప్పుడూ కోరుకోరు అని కూడా ఈ శ్లోకాన్ని బట్టి తెలుసుకోవాలి.

అసలైన మరొక విషయం ఈ శ్లోకములో అంతరార్థంగా ఇమిడి వుంది.

మనం ఏది తింటే మరణిస్తామో దాన్ని ఆయన మనకు దూరం చేసి తన వద్దనే ఉంచు కున్నాడు. అంటే - అది ఇంక బయటకు వచ్చి మన ప్రాణాలు తీయలేదు. శివుడే కనుక ఆ సాగరమథన వేళలో పుట్టిన గరళాన్ని తాను స్వీకరించ కుండా వుంటే మనమే కాదు ఇంద్ర, బ్రహ్మాది దేవతలు, యక్షరాక్షసకిన్నరాది జాతులతో వున్న ఈ సమస్త విశ్వం దాని మహోగ్రజ్వాలలకు మాడి బూడిదై పోయి వుండేది.

మనం దేనిని చూడగానే భయపడతామో అటువంటి పాముల్ని తనకు ఆభరణాలు గా చేసుకుని మనకు అభయాన్ని ప్రసాదించేడు.

Sri Maha Kameswari Seva Trust

మనం చూస్తున్నపుడు జుగుప్సగా కనపడే ఏనుగు చర్మాన్ని శివుడు తనకు వస్త్రం గా చేసుకుని మనకు నాజూకైన చీనాంబరాలను ఇచ్చి అనుభవించమన్నాడు.

మనం ఎక్కడకు వెళ్ళడానికి ఇష్టపడమో అలాంటి శ్మశానం వద్ద తాను నివసిస్తూ మనల్ని పట్టణాల్లోను, నగరాల్లోను బ్రతకమన్నాడు. అంతేకాదు తనవద్దకు వచ్చే ప్రతి జీవిని కొంతకాలం తన పొట్టలో పెట్టుకొని రక్షించి మళ్ళీ పునరుజ్జీవితుణ్ణి చేస్తున్నాడు.

"అసలు ఇటువంటి భగవంతుడు ఒకడున్నాడని తెలియకుండానే మనం బ్రతుకులు వెళ్ళ మారుస్తున్నాము. ఇది మరీ విచారించ తగ్గ విషయం."

---

**88. యదా కృతాంభోనిధి సేతు బంధనః**

**కరస్థలాధఃకృతపర్వతాధిపః|**

**భవాని తే లంఘిత పద్మ సంభవ**

**స్తదా శివార్చా స్తవ భావనక్షమః||**

శివా! సముద్రమునకు వంతెన గట్టిన శ్రీరాముడును, అరచేతితో వింధ్యను నేలకడచిన అగస్త్యుడును, బ్రహ్మదేవుని కన్న నెక్కుక వాడను నేనగుదునేని నీ పూజా స్తోత్ర ధ్యానములు చేయుటకు సమర్థుడనుగా నుందును.

శివుడంతవానికి పూజ చెయ్యగలిగే స్తోమత ఉండాలంటే సముద్రానికి వారధి గట్టిన శ్రీరామచంద్రు డంతవాడవాలిట. సముద్రానికి వారధి కట్టగలగడం సామాన్య విషయం కాదు. ఈపని చేసిన మొట్టమొదటి వాడు శ్రీరాముడే. శ్రీ రాముడు శివభక్తుడైన రావణుని వధించిన తరువాత సముద్ర తీరానికి వచ్చి ముందుగా శివ ప్రతిష్ట చేసి శివుని పై గల తన అత్యంత మైన భక్తిని చాటుకున్నాడు. (దుష్టత్వాన్ని నిర్మూలించడం కోసం రావణుణ్ణి చంపాల్సి వచ్చింది కాని, రావణుని శివభక్తిని వ్యతిరేకించి కాదని గూడా ఈ శ్లోకము తెలియచేస్తుంది.)

Sri Maha Kameswari Seva Trust

శివుడంతవానిని స్తుతించా లంటే తాను అగస్త్యు డంత వాడవాలిట. అగస్త్యుల వారిని దర్శించిన వెంటనే ఆకాశాన్నంటే ఎత్తుకెదిగిన వింధ్య పర్వత రాజు అగస్త్యుల వారి పాదాలవద్ద చాపచుట్టలా పడిపోయాడట! అదీ అగస్త్యుని విలువ. (శ్రీ రాముని నిరుత్సాహం(రావణయుద్ధం లో) చూచి అగస్త్యుడు వచ్చి వారి వంశకర్త అయిన సూర్య భగవానునికి  సంబంధించిన ఆదిత్య హృదయం స్తోత్రాన్ని ఉపదేశించడం ఆపైన శ్రీరాముడు రెట్టించిన ఉత్సాహంతో రావణుణ్ణి వధించడం జరుగుతాయి. అగస్త్యుడు ఉపదేశించిన ఈ స్తోత్రాన్ని కి అంతటి శక్తి వున్నాది. కాబట్టే - శంకరులు శివుణ్ణి స్తుతించాలంటే - అగస్త్యుడు డంతటి వాడవాలి - అన్నారు అనేది కూడా ఈ శ్లోకము సూచిస్తుంది.

శివుడంత వానిని ధ్యానించాలంటే బ్రహ్మంతవాడవాలిట! నారాయణుని నాభి లోంచి పుట్టిన పద్మంలోంచి బ్రహ్మ ఉద్భవించాడు. ఆ పద్మంలో వుండగా బ్రహ్మకు అనుమానం వచ్చిందిట. ఇక్కడకు నేను ఎలాగ వచ్చాను అని. ఆ పద్మనాళం గుండా క్రిందకు వెళ్ళి ధ్యాన నిమగ్నుడైతే నారాయణుడు దర్శనమిచ్చి వాత్సల్యంతో వరం కోరుకో మంటాడు. ప్రపంచంలో మొట్టమొదటగా ఇలా ధ్యానం అనేది చేసినవాడు బ్రహ్మ. ఆ ధ్యానానికి సాక్షాత్తు నారాయణుడే ప్రసన్నుడ యాడు. బ్రహ్మ చేసిన ఆ ధ్యానానికి అంతటి శక్తి ఉంటుందని చెప్పడానికి - శివుణ్ణి ఎవరైనా ధ్యానం చేయాలంటే బ్రహ్మంత వాడవాలని ఈ శ్లోకములో శంకరులు సూచించారు.

మనం కూడా త్రికరణ శుద్ధిగా శివుణ్ణి - పూజ - స్తుతి - ధ్యానాలతో ఆరాధిస్తే - ఈ శ్లోకములో చెప్పిన శ్రీరాముడు, అగస్త్యుడు, బ్రహ్మంత వాళ్ళం కాగలమనే సూచన కూడా ఈ శ్లోకములో వుంది.

---

**89. నతిభిర్నుతిభిస్త్వమీశ పూజా**

**విధిభిర్ధ్యానసమాధభిర్న తుష్టః|**

**ధనుషా ముసలేన చాశ్మభిర్వా**

**వద తే ప్రీతికరం తథా కరోమి ||**

Sri Maha Kameswari Seva Trust

ఈశ్వరా! నమస్కారములు, స్తోత్రములు, పూజలు, ధ్యానములు, సమాధులు మొదలగు వాటితో తృప్తి పడక, వింటి దెబ్బలు, రోకటి పోట్లు, రాళ్ళు రువ్వుట మొదలగు వానితో పరమప్రీతి నొందితివని పురాణగాథలు వింటిని. ఇందు నీకేమి ప్రియమో చెప్పుము. ఆ విధముగానే చేసెదను.

సామ దాన భేద దండోపాయాలున్నట్లే - భక్తి లో గూడా వివిధ రకాలున్నాయని శంకరులు ఈ శ్లోకము ద్వారా కొన్ని పురాణ గాధలను తెలియచేస్తున్నారు. సాత్త్విక మైన పూజలు, స్తుతులు, ధ్యానాలు ఒకరకమైతే - రోకటి పోట్లతో, రాళ్ళు రువ్వడంతో, వింటి దెబ్బలతో కూడా భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవడం రెండో రకం. ఇదెక్కడి భక్తి ' చాలా విడ్డూరంగా ఉందే' అని ముక్కు మీద వ్రేలు వేసుకోనక్కరలేదు. అలా చేసిన వాళ్ళున్నారు. అలా చేసి శివుని మెప్పు గూడా పొంది, పైగా అలా చేసినందుకు ప్రతిగా పెద్ద ప్రతిఫలాన్ని గూడా సంపాదించిన వారున్నారు.

" శివుణ్ణి మెప్పించి పాశుపతాస్త్రం సంపాదించు అది ముందు ముందు నీకు చాలా అవసరం అవుతుంది" అని - శ్రీకృష్ణుడు అర్జునుడికి సలహా ఇచ్చి ప్రేరేపిస్తాడు. అప్పుడు అర్జునుడు శివుని గూర్చి తపస్సు చేస్తాడు. పాశుపతాస్త్రం సామాన్యమైంది కాదు. ఎంతో అవసరమైతేనే తప్ప, అది గూడా సమస్త మానవాళికి రక్షణ జరుగు తుందంటేనే ఉపయోగించాలి. అందుకని దీన్ని స్వీకరించ డానికి అర్జునుడు తగినవాడా కాదా అని తెలుసుకునేందుకు శివుడు అతణ్ణి పరీక్షిద్దా మనుకున్నాడు. శివుడు

కిరాత రూపం దాల్చి - తపస్సు చేస్తున్న అర్జునుణ్ణి ఏదో విధంగా కయ్యంలోకి దింపాడు. ఆ కయ్యంలో అర్జునుడు తన బాణాలన్నీ వృథా చేసు కున్నాడు. విల్లు కూడా విరిగిపోయింది. ఆ విరిగిన వింటితో కిరాతరూపంలో వున్న శివుణ్ణి తలపై మోదాడు. అదీ పని చెయ్యకపోతే రాళ్ళు రువ్వాడు. అవీ వ్యర్థమయాయి. బలంగా పిడికిలి పోట్లు ఉపయో గించాడు. వాటివల్ల కూడా పని జరుగలేదు. అప్పుడు ఇక చివరకు పాలు పోక ఇద్దరూ ముఖాముఖీ కలియపడ్డారు. అప్పుడు అర్జునుని ధైర్యసాహసాలకు, బలానికి మెచ్చి, కిరాత రూపాన్ని వదలి స్వస్వరూపంతో ప్రత్యక్షమై పాసుపతాస్త్రాన్నిచ్చి - ఎలాంటి సమయాల్లో మాత్రమే దాన్ని వాడాలో చెప్పి ఆశీర్వదిస్తాడు. ఇదీ కథ .

ఈ కథలోని విషయాలనే - శంకరులు గమ్మత్తుగా ఈ శ్లోకములో ఉటంకించారు.

Sri Maha Kameswari Seva Trust

" చెప్పు శివా! మామూలుగా అందరు భక్తులు చేసే సాత్త్విక మైన పూజలు, స్తోత్రాలు, ధ్యానాలు చేస్తే నువ్వు ఇష్టపడతావా ? లేకపోతే అర్జునుడిలా రోకటి పోట్లు, రాళ్ళు రువ్వడాలు, తల బ్రద్దలు కొట్టడాలు చెయ్య మంటావా? నీ ఇష్టం - నువ్వెలా చెప్పితే అలా చెయ్యడానికి నేను సిద్ధం. ఎలా చేసినా నువ్వు ప్రత్యక్షమై ప్రసన్నుడవు కావడమే నాకు ముఖ్యం. అంటున్నారు. ఈ శ్లోకము - కోపంతో, ప్రణయకోపంతో, ద్వేషంతో, పగతో గూడా భగవంతుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకోవచ్చని తెలుపుతోంది. అలా చేసుకోవచ్చని భాగవతం తెలుపుతోంది

---

**90. వచసా చరితం వదామి శంభో**

**రహముద్యోగవిధాసు తే 2ప్రసక్తః |**

**మనసా22కృతి మీశ్వరస్య సేవే**

**శిరసా చైవ సదా శివం నమామి||**

శివా! ఉత్తమ శివ యోగముల పరిచయము లేదు. మనస్సు స్థిరముగా నిలువదు. కనుక వాక్కుతో మీ చరిత్రలు పల్కుచు, మనస్సును మీ యాకృతి ధ్యానించుచూ శిరస్సుతో మీ పాద పద్మము లకు నమస్కరించుచు శక్తి వంచన లేకుండా సేవించెదను.

88వ శ్లోకంలో చెప్పిన శ్రీ రాముడు, అగస్త్యుడు, బ్రహ్మ వంటి వారు చేసినట్లు - పూజ, స్తోత్రం, ధ్యానం చెయ్యలేక పోవచ్చును గాని, యధాశక్తి - నాకున్నంతలో , నాకు తెలిసినంతలో, నా నిష్ఠ కుదిరినంతలో నీకు వాటిని చేయగలను. వాక్కు ద్వారా నిన్ను నీ చరిత్రను స్తుతిస్తాను. నోటిద్వారా నీ కథాచరిత్రలను గానం చేస్తాను. మనసారా నిన్ను ధ్యానం చేస్తాను. శిరస్సు వంచి నీకు పాదాభివందనం చేసి మ్రొక్కు తాను. నువ్వు నన్ను తక్కువ చేసి చూడ కుండా త్రికరణ శుద్ధిగా నేను చేసే మనోవాక్కాయ పూజను అంగీకరించి అనుగ్రహించు అని ఎంతో వినయంగా ఈ శ్లోకములో శంకరులు భక్తి ప్రపత్తులతో శివుణ్ణి అర్థిస్తున్నారు.

---

Sri Maha Kameswari Seva Trust



91. ఆద్యా2విద్యా హృద్గతా నిర్గతాసీ

ద్విద్యా హృద్యా హృద్గతా త్వత్ప్రసాదాత్ |

సేవే నిత్యం శ్రీ కరం త్వత్పదాబ్జం

భావే ముక్తేర్భాజనం రాజమౌళే ||

చంద్రశేఖరా ! నీ దయ వలన నా యజ్ఞానము తొలగిపోయి సుజ్ఞానము కలిగినది. సంపత్కరము మోక్షప్రదమగు నీ పాదయుగ్మమును సేవించెదను.

భగవద్గీతలో చివరిదైన మోక్ష సంన్యాస యోగంలో అర్జునుడు చిట్ట చివరకు -

నష్టో మోహః స్మృతిర్లబ్ధ్వా త్వత్ప్రసాదాన్మయాచ్యుత

స్థితోఽస్మి గత సందేహః కరిష్యే వచనం తవ ||

( నీ అనుగ్రహం వలన మోహం నశించి , స్మృతిని మళ్ళీ పొందాను. స్థిరత్వం చేకూరింది. సందేహాలు పోయాయి. నువ్వు చెప్పినట్లే చేస్తాను.)- అని అంటాడు. అలాగే ఈ శివానందలహరీ స్తోత్రం చివరి చివరకు వస్తుంటే శంకర భగవత్పాదులు కూడా పూర్తిగా అట్లాంటి అర్థమే వచ్చే విధంగా ఈ శ్లోకములో -

"ఇన్నాళ్లు గా చేసిన సాధనల వలన, నీ అనుగ్రహం వలన నా అదృష్టం పండి, ఎన్నో రోజుల నుండి హృదయమంతా నిండి ఉండి, హృదయగ్రంథిని హరించినట్టి అజ్ఞానం పూర్తిగా తొలగిపోయింది. ప్రస్తుతం హృదయం నిండా విద్యా గంధమే నిండి వుంది. మంగళకరము, మోక్ష ప్రదమూ అయిన నీ పాద పద్మాన్నే నిత్యం సేవిస్తాను" అన్నారు.

( హృదయగ్రంథిః విభేదనం జరిగితే వచ్చే శుభ పరిణామాలను -

భిద్యతే హృదయగ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః

క్షీయంతే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే -

అనే శ్లోకంలో చెబుతారు.

హృదయగ్రంథి విభేదనం జరిగితే - సర్వ సంశయాలు తీరి వైరుధ్యంగా , వైవిధ్యంగా వుండే వాటి మధ్య సమన్వయము కుదురుతుంది

కర్మ బంధాలు అన్నీ నశిస్తాయి. స్థూల-సూక్ష్మ; బ్రహ్మాండ - పిండాండ సమన్వయ దృష్టి ఏర్పడుతుంది.- అని ఈ శ్లోక సారాంశము.

అయితే - శంకర భగవత్పాదుల హృదయంలో ఇంతకు ముందు వరకు అజ్ఞానం నిండి వున్నదా? అనే అనుమానం రాకూడదు. ఈ శివానందలహరిని అర్థం చేసుకొని చదువుతూ, చదువుతూ వుంటే చివర చివరకు వచ్చేటప్పటికి హృదయగ్రంథి విభేదనం జరిగి పైన తెలిపిన శుభపరిణామాలు మనకు చేకూరుతాయి అని - పాఠకులకు శంకరుల ఉపదేశం అన్నమాట.

Sri Maha Kameswari Seva Trust

**92. దూరీకృతాని దురితాని దురక్షరాణి**

**దౌర్భాగ్య దుఃఖ దురహంకృతి దుర్వచాంసి |**

**సారం త్వదీయ చరితం నితరాం పిబంతం**

**గౌరీశ మామిహసముద్ధర సత్కటాక్షైః ||**

గౌరీ నాథా ! నుదుటవ్రాసిన బ్రహ్మవ్రాతకు సూచకములగు సమస్త దుఃఖములు నీ కటాక్షము వలన పోయినవి. నీ సార చరిత్రములనే విను నన్ను ఈ జన్మము నుండి తరింప జేయుము.

ఇంతకుముందు శ్లోకం లో చెప్పినట్లు గానే ఈ శ్లోకములో గూడా శివునికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు.

ప్రతి జీవిని బ్రహ్మ సృష్టించి భూమ్మీదకు పంపే ముందు ఆ జీవి భావి జీవితమెలా వుంటుందో నొసటి మీద సూక్ష్మంగా వ్రాసి పంపుతాడట. జీవి పూర్వజన్మలో చేసిన పాప పుణ్య ఫలితాల కనుగుణంగా ఆ వ్రాత వుంటుందిట. ప్రతి జీవి ఏవో లాభాలు నష్టాలు అదృష్టాలు దురదృష్టాలు, సుఖదుఃఖాలు ఇలా ఎన్నో పూర్వకర్మ ఫలాలను ప్రస్తుత జన్మలో అనుభవిస్తాడుట. శివుని అనుగ్రహం వలన శంకరులకు అటువంటి పూర్వజన్మ తాలూకు దురదృష్ట , దుఃఖాలన్నీ తొలగిపోయాయట. ఇంక ఈ జన్మలో శివ స్తోత్ర, సంకీర్తన, పూజనాదులు చేసి శివ చరిత్రలు, కథలే వింటారుట.

అందుకు ప్రతిఫలంగా - వచ్చే జన్మకు కర్మ మిగలకుండా క్షాళనమై ఈ జన్మలో వుండగానే తరింప చెయ్యమని ప్రార్థిస్తున్నారు. అంటే - తాను తరించడానికి ఏం చెయ్యదలచుకున్నారో చెప్పారు. అలా చెయ్యడం మనకూ నచ్చితే మనమూ అలా చేసి తరించవచ్చని సూచన అన్నమాట ! అంతేకాని మీరు ఇలా నేను చేసినట్లు చెయ్యండని తనసిద్ధాంతాలను మనమీద రుద్దడం కాదు. పెద్దవాళ్ళు అలాగే సలహా ఇస్తారు. 'విశ్వదాభిరామ వినురవేమ' అని వేమన తనకు తనే చెప్పుకున్నాడు గాని, వినుర జీవ' అని మనకు చెప్పలేదు.

Sri Maha Kameswari Seva Trust

**92. దూరీకృతాని దురితాని దురక్షరాణి**

**దౌర్భాగ్య దుఃఖ దురహంకృతి దుర్వచాంసి ।**

**సారం త్వదీయ చరితం నితరాం పిబంతం**

**గౌరీశ మామిహసముద్ధర సత్కటాక్షైః ।।**

గౌరీ నాథా ! నుదుటవ్రాసిన బ్రహ్మవ్రాతకు సూచకములగు సమస్త దుఃఖములు నీ కటాక్షము వలన పోయినవి. నీ సార చరిత్రములనే విను నన్ను ఈ జన్మము నుండి తరింప జేయుము.

ఇంతకుముందు శ్లోకం లో చెప్పినట్లు గానే ఈ శ్లోకములో గూడా శివునికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు.

ప్రతి జీవిని బ్రహ్మ సృష్టించి భూమ్మీదకు పంపే ముందు ఆ జీవి భావి జీవితమెలా వుంటుందో నొసటి మీద సూక్ష్మంగా వ్రాసి పంపుతాడట. జీవి పూర్వజన్మలో చేసిన పాప పుణ్య ఫలితాల కనుగుణంగా ఆ వ్రాత వుంటుందిట. ప్రతి జీవి ఏవో లాభాలు నష్టాలు అదృష్టాలు దురదృష్టాలు, సుఖదుఃఖాలు ఇలా ఎన్నో పూర్వకర్మ ఫలాలను ప్రస్తుత జన్మలో అనుభవిస్తాడుట. శివుని అనుగ్రహం వలన శంకరులకు అటువంటి పూర్వజన్మ తాలూకు దురదృష్ట , దుఃఖాలన్నీ తొలగిపోయాయట. ఇంక ఈ జన్మలో శివ స్తోత్ర, సంకీర్తన, పూజనాదులు చేసి శివ చరిత్రలు, కథలే వింటారుట.

అందుకు ప్రతిఫలంగా - వచ్చే జన్మకు కర్మ మిగలకుండా క్షాళనమై ఈ జన్మలో వుండగానే తరింప చెయ్యమని ప్రార్థిస్తున్నారు. అంటే - తాను తరించడానికి ఏం చెయ్యదలచుకున్నారో చెప్పారు. అలా చెయ్యడం మనకూ నచ్చితే మనమూ అలా చేసి తరించవచ్చని సూచన అన్నమాట ! అంతేకాని మీరు ఇలా నేను చేసినట్లు చెయ్యండని తనసిద్ధాంతాలను మనమీద రుద్దడం కాదు. పెద్దవాళ్ళు అలాగే సలహా ఇస్తారు. 'విశ్వదాభిరామ వినురవేమ' అని వేమన తనకు తనే చెప్పుకున్నాడు గాని, వినుర జీవ' అని మనకు చెప్పలేదు.

---

Sri Maha Kameswari Seva Trust

**93. సోమకళాధర మౌళౌ వకోమలఘనకంధరే మహామహసి |**

**స్వామిని గిరిజా నాథే మామక హృదయం నిరంతరం రమతామ్ ||**

పార్వతీ పరమేశ్వర రూపముతో వెలుగు చున్న పరంజ్యోతి స్వరూపమైన పరబ్రహ్మము నందు నా చిత్త మెప్పుడును విహరించుగాక !

వపూజలందుకోవాలన్నా, స్తుతులందుకోవాలన్నా, ధ్యానింపబడాలన్నా, ఏదేవతలైనా నామరూపాలతో వుండాలి. ఆత్మ దేహంగా రూపుకట్టుకుంటే మనం ఆ జీవిని చూడగలం. మాట్లాడగలం, స్పృశించి ఆనందించగలం. ఆత్మ ఆత్మలాగానే వుంటే ఇలా చెయ్యడానికి కుదరదు. మనం చేసే పూజలు, చెప్పే స్తోత్రాలు, చేసే ధ్యానాలు వాస్తవానికి ఆ నామరూపాల ద్వారా మాత్రమే ,నిర్గుణ తత్త్వానికి చెందుతాయి. మనం చూచే దేవతా విగ్రహాలన్నీ అంతే !

లోక వ్యవహారాల్లో కూడా ఒక ,వ్యక్తి యొక్క నామరూపాల ద్వారానే వానిని తెలుసుకుంటాం. సత్యము, ధర్మము, పితృవాక్య పరిపాలన, ఏకపత్నీ వ్రతం - మొదలైన కీలక లక్షణాలన్నీ ఒక రూపం కట్టుకొని ఒక పేరుతో పిలువబడితే ఆ పేరు 'శ్రీరాము' డౌతుంది. ఆ విగ్రహం శ్రీ రాముని రూపమౌతుంది. అంటే శ్రీ రాముని విగ్రహం చూడగానే ఆ లక్షణాలన్నీ గుర్తుకు రావాలన్నమాట ! విగ్రహారాధన లోని అంతరార్థం ఇదే !

(ఉదాహరణకు నాస్తికులు కూడా తమ భార్యాపిల్లల ఫొటోలను పర్సులో పెట్టుకు తిరుగుతారు. ఇది కూడ విగ్రహారాధనే కదా! అని విమర్శించుకుని విగ్రహారాధన అంతరార్థాన్ని గ్రహించాలి).

ప్రస్తుత శ్లోకంలో శంకరులు నిర్గుణుడైన శివుణ్ణి గుణమయమైన , నామరూపాత్మకమైన జ్యోతి స్వరూపంగా వర్ణించారు. ఆ రూపం - "శిరస్సుపైన ఒక చంద్రరేఖను,మనోహరమైన కోమలమైన మేఘం లాంటి కంఠాన్ని కలిగి, నియంతృత్వ ఠీవితో వుండే పార్వతీపతి రూపంతో మహాతేజ స్సంపన్నంగా" వుంటుందిట. ఆ తేజస్సు నందే తన హృదయం రమించి నిత్యానందము అనుభవించు గాక ! - అని అంటున్నారు శంకరులు . మన కిష్టమైతే మన హృదయాలు కూడా రమించి నిత్యానందాన్ని పొందవచ్చునని సూచన చేస్తున్నారు.

---

Sri Maha Kameswari Seva Trust

**94. సా రసనా తే నయనే  తావేవ కరౌస ఏవ కృతకృత్యః |**

**యా యే యౌ యో భర్గం  వదతీ క్షేతే సదా2ర్చతః స్మరతి ||**

సదా ఈశ్వర నామ ముచ్చరించు నాలుకయే నాలుక. ఈశ్వరుని చూచు కన్నులే కన్నులు. ఈశ్వరుని పూజించు చేతులే చేతులు. ఈశ్వరుని నిరంతరం ధ్యానించు భక్తుడే భక్తుడు. అతడే ధన్యుడు.

పుట్టినప్పటి నుంచి మనకు నాలుక ఉన్నా భగవంతుడు దాన్ని ఎందుకిచ్చాడో అందుకు వినియోగ పడినప్పుడే అది నిజమైన నాలుక అవుతుందట.

' భర్గ' నామాన్ని ఉచ్చరించడం ప్రారంభించి నప్పటినుండి మాంసఖండం లాగా వున్న నాలుక మహిమాన్వితమైన సార్థకమైన నాలుక ఔతుందట. అలాగే భర్గుని చూస్తూవుండే కళ్ళే సార్థకమైన కళ్ళుఅవు తాయిట ! చూడనంతవరకు అవి నీలి గోళాలే ! భర్గుని పూజించటం ప్రారంభించిన తరువాత చేతులు అసలైన సార్థకమైన చేతులు అవుతాయిట ! అంతవరకు అవి వెదురు ముక్కలే. భర్గుని స్మరించే జీవుడే కృతార్థుడైన జీవిట. పోతనగారు గూడా భాగవతంలో సరిగ్గా ఇలాగే - ' కమలాక్షు నర్చించు కరములు,కరములు - శ్రీ నాధు వర్ణించు జిహ్వ జిహ్వ ' అన్నారు. అంటే - శంకరాచార్యుల వారి బాణిని పోతనామాత్యుడు అనుసరించారన్నమాట ! ఈ శివానందలహరి చదువుకోక పోతే ఈవిధంగా పోతనే మొదట చెప్పనట్లనుకుంటారు ( అయితే ఇలా చెప్పడం నచ్చి శంకరులపై గౌరవంతో సరిగ్గా అలాగే పోతనగారు కూడా వ్రాసి వుండవచ్చు- అది వేరే సంగతి ) పై సీస పాదాల్లో మొదటి కరాలు వట్టి తోలుచేతులైతే, రెండో కరాలు సార్థకమైన చేతులు. అలాగే మొదటి జిహ్వ మాంసఖండం అయితే, రెండో జిహ్వ సార్థకమైన జిహ్వ ఇలాగే ఈ పద్యంలో మిగిలినవన్నీ అర్థం చేసుకోవాలి.

శివునికి ఇతర నామాలెన్ని వున్నా 'భర్గః ' అనే పదాన్ని శంకరులు ఈ శ్లోకములో వాడడంలో కూడా ఔచిత్యం వుంది. ' భర్గః' అనే పదాన్ని

భః + గః - అని విడదీస్తే, - భః - వెలుగుని సూచిస్తే, గః - గమనాన్ని అంటే చైతన్యాన్ని సూచిస్తుంది. దీనిని బట్టి 'భర్గః' అంటే " చైతన్యవంతమైన వెలుగు " లేదా 'చలించే వెలుగు రూపం' అని అర్థం.' భర్గః' అని నాలుక ఉచ్చరించినపుడు ఆ నాలుక చైతన్యవంతమైన వెలుగు తో సమన్వయాన్ని

Sri Maha Kameswari Seva Trust

కలిగివుండి, లో వెలుగు ఆ నాలుక ద్వారా బయటకు వ్యక్తమవుతుంది. అలాగే - భర్గుని కళ్ళు చూస్తున్నపుడు - భర్గుని చేతులతో అర్చిస్తున్నపుడు, జీవి ఆ భర్గుని స్మరించినపుడు ఆ జీవి కూడా చైతన్యవంతమైన వెలుగు అవుతాడు - అని సమన్వయించుకోవాలి.

---

**95. అతి మృదులౌ మమ చరణా**
**వతి కఠినం తే మనో భవానీశ |**
**ఇతి విచికిత్సాం సంత్యజ**
**శివ కథా మాసీద్గిరౌ తథా ప్రవేశః ||**

భూతనాథా! నీ భక్తుని మనస్సతికఠినము, కోమలమైన నా పాదములతో దానియందు సంచరించుటెట్లని సంశయ మక్కరలేదు. ఎంతో కఠినముగా నుండు పర్వతము మీద గౌరీసమేతులై మీరు సంచరించుట లేదా?

శంకరులు శివుణ్ణి ఈ శ్లోకములో నిలదీస్తున్నారు. నువ్వేదో నీ పాదాలు చాలా మృదువుగా వుంటాయని - నా హృదయం చాలా కఠినంగా వుంటుంది కాబట్టి అటువంటి కఠినమైన హృదయంలో విహరించడం నా వల్ల కాదని ఏదో వంక చెప్పి తప్పించుకునే ప్రయత్నం చెయ్యొద్దు. నా హృదయము కంటే కఠినంగా ను, కర్కశంగా ను ఉండే పర్వతాల రాళ్ళపైన గుట్టలపైన గౌరిని వెంటవేసుకుని నువ్వు ఆ పాదాలతోనే ఉత్సాహంగా తిరిగే సంగతి నాకేమిటి, లోకంలో అందరికీ తెలుసు. కాబట్టి అలాంటి సాకులు చెప్పి తప్పించుకుని నన్ను వదిలించుకోకుండా - వచ్చి నా హృదయంలో విహరించు - అని శంకరులు కాస్త గట్టిగానే శివుణ్ణి నిలదీశారు ఈ శ్లోకములో.

---

Sri Maha Kameswari Seva Trust



96. ధైర్యాంకుశేన నిభృతం

రభసాదాకృష్య భక్తి శృంఖలయా ।

పురహర చరణాలానే

హృదయమదేభం బధాన చిద్యంత్రైః ।।

నా మనస్సను మదపుటేనుగు ను ధైర్యాంకుశమున ఒంచి నీ పాదమను కట్టుకంబము నందు భక్తి యను గొలుసుతో గట్టిగా కట్టివేయుము.

ముప్పతిప్పలు పెట్టే మనస్సును అదుపులో పెట్టుకోవాలంటే ఈ శ్లోకములో ఒక ఉపాయం చెబుతున్నారు. మనస్సును అదుపులో పెట్టుకోలేకుండా వున్నాను. దాన్ని ఎదుర్కొనే ధైర్యం లేదు. ఎందుకంటే అది ఒక మదమెక్కిన ఏనుగు లాగా ఇష్టం వచ్చినట్టు తిరుగుతూ నానా హంగామా చేస్తోంది. ఎలా దీన్ని వంశంలో పెట్టకోగలగడం అని గాభరా పడక్కర్లేదు. మామూలు మదగజం అయితే ఏం చేస్తాం? అది బొందలో పడటానికి అడవిలోనే ఒక పెద్ద గొయ్యి తవ్వి , దాని మీద పల్చని వెదురు తడికలు లాంటివి వుంచి, దాని పై ఆకులు తీగలు కొమ్మలు కప్పి ఆ ఏనుగును అటువైపుగా వచ్చేటట్టుగా చేసి అది గొయ్యి లో పడేట్టు చేసుకోవాలి. అటుపైన దానికి ఇనుపగొలుసులు కట్టి అంకుశం తో నియంత్రిస్తూ కదలకుండా చేసి ఒక పెద్ద చెట్టుకు కట్టి వంశంలో పెట్టుకోవాలి.

మనస్సు గూడా మదపుటేనుగు లాగా విషయాలు అనే అరణ్యంలో ఎప్పుడూ తిరుగుతూ వుంటుంది కాబట్టి - దాన్ని మనం బుద్ధి అనే బోను ద్వారా ఆకర్షించాలి. భగవద్విషయాలు సంపూర్ణంగా తెలిసిన బుద్ధి అయితే మనస్సును నియంత్రించగల ఉపాయం చెప్పగలదు. అందుకని భగవత్సంబంధమైన జ్ఞానాన్ని బాగా పెంపొందించుకోవాలి. ఇక్కడ బుద్ధిని బోనులాగా మనోమదగజాన్ని ఆకర్షించే లా చెయ్యాలన్న మాట! ధృఢమైన భక్తిని ఇనుప సంకెళ్ళు గా ఉపయోగించాలి. ( భక్తిని బాగా పెంపొందించుకుంటే గాని సంకెళ్ళు ధృఢపడవు )

అప్పుడు మనో గజాన్ని నియంత్రించగలమనే ధైర్యం కలుగుతుంది. ఆ ధైర్యాన్నే అంకుశం లాగా ఉపయోగించి పూర్తిగా మనం చెప్పినట్లు వినేట్లుగా చేసుకోవాలి. అయినా అదితిరగబడుతూ ఉండవచ్చు. అందుకని చెట్టు ట్రమానులాంటి ఒక గట్టి గుంజకు దాన్ని స్థిరంగా పడివుండేట్లు కట్టాలి. పరమేశ్వరుని పాదాలనే ఆ గట్టి గుంజగా ఉపయోగిస్తే ఆ మనస్సనే మదగజాన్ని తప్పకుండా మన వశంలో పెట్టుకోవచ్చు. అందుకని పరమేశ్వరుని పాద సేవనం చేస్తూ గుంజను ధృఢపరచి, మనస్సు అనే మదగజాన్ని నియంత్రించు కోవాలి. అంటే - 'ఎప్పటికైనా మన మనస్సును పరమేశ్వర పాదాలకు శరణు జొచ్చేలా చెయ్యాలి. ఆ మనస్సును చెప్పుచేతల్లో పెట్టుకోవాలంటే అదొక్కటే మార్గం' అని శంకరులు సలహా ఇస్తున్నారన్నమాట.

Sri Maha Kameswari Seva Trust

**97. ప్రచరత్యభితః ప్రగల్భవృత్త్యా**

**మదవానేష మనఃకరీ గరీయాన్ |**

**పరిగృహ్య నయేన భక్తిరజ్జ్వా**

**పరమ స్థాణు పదం ధృఢంనయాముమ్ ||**

శంకరా! నా మనస్సను మదగజము పట్టుటకు వీలులేక పలువంకల పరుగులెత్తుచున్నది. దీనిని భక్తి యను త్రాటితో కట్టి, స్థిరమైనధ బ్రహ్మపదమున జేర్చుము.

మనస్సును నియంత్రించు కోడానికి క్రిందటి శ్లోకంలో చెప్పిన ఉపాయాన్నే ఈ శ్లోకములో గూడా చెప్పారు గాని - ఇక్కడ మన ప్రయత్నానికి స్వస్తి చెప్పి పూర్తిగా భగవంతునికే బాధ్యత అప్పచెప్ప మంటున్నారు.

సాధారణంగా ఒక పనిని సాధించడానికి ముందు అన్ని విధాలా మనం ప్రయత్నం చేస్తాము. అయినా అవకపోతే నావలన అవడం లేదు భగవంతుడా ఇంక నువ్వే రక్షించాలి అని పూర్తిగా శరణాగతుల మవుతాము. ద్రౌపది గూడా అలా చేస్తేనే కృష్ణుడు అక్షయ వస్త్రాలను అనుగ్రహించాడు కదా !

భగవద్గీతలో కూడా కృష్ణుడు చిట్టచివరకు చెయ్యాల్సిందేదో అర్జునునితో -

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ

అహం త్వా సర్వపాపేభ్య మోక్ష యిష్యామి మాశుచః - అన్నాడు.

అంటే - ధర్మాధర్మ నిర్ణయం తనకు వదిలి, మనం చెయ్యాల్సిన పనులన్నీ చేస్తూ తనకు పూర్తిగా శరణాగతులను కమ్మన్నాడు. అలా పూర్తిగా మనం శరణాగతుల మైతే, తప్పకుండా మన యోగ క్షేమాల విషయం తాను చూసుకుంటానని బాధ్యతాయుతంగా వాగ్దానం చేశాడన్నమాట.

శంకర భగవత్పాదులు కూడా చిట్టచివరకు ఇదే ఉపాయం చెబుతున్నారు. ఎందుకొచ్చిన వృధా ప్రయత్నాలు గాని, ఒక్క పని చెయ్యండి. - భక్తిని

ధృఢపరచుకొని పూర్తిగా పరమేశ్వర పాదాలకు శరణాగతులవండి. మీ మనస్సు సంగతి ఆయన చూసుకుంటారు - అని తేల్చి చెప్పేశారు ఈ

Sri Maha Kameswari Seva Trust

శ్లోకములో. అలా అయినప్పుడే మనకు స్థిరమైన బ్రహ్మపదం దక్కేది అని కూడా సూచించారు.

---

**98. సర్వాలంకారయుక్తాం సరళపదయుతాం సాధువృత్తాం సువర్ణాం**
**సద్భిః సంస్తూయమానాం సరసగుణయుతాం లక్షితాం లక్షణాఢ్యామ్ ।**
**ఉద్యద్భూషావిశేషా ముపగతవినయాం ద్యోతమానార్థ రేఖాం**
**కళ్యాణీం దేవ గౌరీ ప్రియ మమ కవితాకన్యకాం త్వం గృహాణ॥**

దేవా! నా కవితాకన్య కన్యకా లక్షణము గల్గి కళ్యాణమునకు తగియున్నది. సర్వాలంకార ములు, సరళ పదములు, సాధువృత్తము, సువర్ణము, సరసగుణములు వేయేల సర్వ లక్షణములు గలిగి ప్రకాశించుచున్న నా కవితా కన్యను పరిగ్రహింపుము.

శివానందలహరి లో దాదాపు చివరి శ్లోకం ఇది. ఈ శ్లోకములో ఈ శివానందలహరి కృతిని భగవంతుడైన శివునికే అర్పించుకుంటున్నారు. సాధారణంగా కవులు తమ కావ్యాలను ఒకరికి అంకితం ఇస్తుంటారు. కావ్య రచన చేసిన వారిని "కృతి కర్త" అనీ, కావ్యాన్ని అంకితం పుచ్చుకున్న వారిని "కృతి భర్త"అనీ అంటారు.

శంకర భగవత్పాదులు ఈ శివానందలహరి కృతిని తన కన్న కూతురుతో పోల్చుకుని, శివునికి ఆ కన్యకామణిని భార్యగా సమర్పించుకుంటూ కన్యాదానం చేస్తున్నారు.

ఈ కృతి కన్య ఆకృతి చాలా బావుంటుందిట. ఆకృతి బాగుంటే చాలా అని అడుగుతాడేమోనని ఆ కవితా కన్యను తాను ఎలా పెంచిందీ - ఆమె ఎలాంటి సల్లక్షణాలు కలిగినదీ ఈ శ్లోకములో చెప్తున్నారు. కన్యపరం గాను - కవితా పరంగానూ కూడా సరిపోయే విశేషణాలతో చెప్తున్నారు.

1. సర్వాలంకార యుక్తాం -

కన్యాపరంగా - కన్యాదానం చేసేటప్పుడు వంటిమీద నగలు (అలంకార, ఆభరణాలు) పెట్టి కన్యాదానం చెయ్యాలి. అలా చెయ్యడాన్నే ' సాలంకృత

Sri Maha Kameswari Seva Trust

కన్యాదానం' అంటారు. అప్పుడు ఆ కన్య వంటిపై వున్న నగల్ని కాపురానికి పంపేటప్పుడు ఇచ్చితీరాలి. అందుకనే మిగిలిన సమయాల్లో ముచ్చటకు ఆడంబరానికి ఎన్నో రకాల నగలు ఎక్కువగా పెట్టినా కన్యాదాన సమయంలో మాత్రం అవన్నీ తీసి తాము ముందు కాపురానికి పంపేటప్పుడు ఇచ్చి పంపబోయే నగలే వుంచుతారు. మొగపెళ్ళివారి తాలూకు ఆడవాళ్ళు ఈ విషయంలో చాలా గుర్తుపెట్టుకొనే ధోరణి లో వ్యవహరిస్తారు కూడా ! కాబట్టి 'సర్వాలంకార యుక్తాం' అంటే - అన్ని రకాల అలంకారాలు, ఆభరణాలతోను ఉన్నది' అని అర్థం.

కవితా పరంగా అయితే - కవిత్వంలో విషయాన్ని చిత్రంగా చెబుతారు. ఉపమ, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, రూపకము మొదలైన అలంకారాలతో చెప్తారు. కాబట్టి ఈ కవిత అటువంటి అలంకారాలతో వున్నది అని అర్థం.

2. సరళ పదయుతాం -

కన్యాపరంగా - ఈ కన్య పాదాలు చిగురుటాకుల్లాగా - మెత్తగా, కోమలంగా వుంటాయి. ఆ పాదాల్లో ఆమె నడక, నడత చాలా ఆహ్లాదకరంగా చూడ ముచ్చటగాను, తిన్నగాను వుంటుంది - అని అర్థం.

కవితా పరంగా - కవిత్వంలో వాడే పదాలు (మాటలు) వాక్యాలు చాలా తేలిగ్గా, చదువుతుంటే ఆనందాన్ని కలుగచేసే శబ్దాల నిచ్చవిగా వుంటాయి అనీ అర్థం.

3. సాధువృత్తాం -

కన్యాపరంగా - ఈ కన్య చాలా సాధువైంది. మెత్తని సాత్త్విక స్వభావం కలది. ప్రవర్తన వంక పెట్టలేనిది. గుండ్రంగా వంపులు తిరిగే శరీరం ఆకార నిర్మాణం కలిగి వున్నది - అని అర్థం.

కవితా పరంగా - కవిత్వాన్ని తెలుగు లో అయితే పద్యాలలోను, సంస్కృతంలో అయితే శ్లోకాల్లోను వ్రాస్తారు. సంస్కృతంలో శిఖరిణీ, మందాక్రాంతం, శార్దూలము, ఆర్యా మొదలైన శ్లోకాల్లో వ్రాస్తారు. ఇవన్నీ వేరువేరు ఛందస్సులలో ఉంటాయి. అందువల్ల ఒక్కొక్క శ్లోకం చదువుతున్నపుడు ఒక్కొక్కరకమైన నడకను ( బాణీని) కలిగి వుంటుంది. ఆ బాణీ తీరు చాలామనోహరంగా వుంటుంది అని అర్థం. ఈ శివానందలహరి లో అన్నిరకాల ఛందస్సులు కలిగిన శ్లోకాలు వున్నాయి - అని కూడా అర్థం.

Sri Maha Kameswari Seva Trust

( సౌందర్య లహరి లో అన్నీ శిఖరిణీ వృత్తాల శ్లోకాలే ).

4. సువర్ణాం -

కన్యాపరంగా - ఈ కన్య వంటి రంగు పసిమి. అంటే తప్త కాంచన వర్ణం లేదా దబ్బపండు రంగు కాంతులు విరజిమ్ముతూ చాలా ఆకర్షణీయంగా వుంటుంది. ఉత్తమ వర్ణంలో జన్మించింది కూడా ! - అని అర్థం.

కవితా పరంగా - ఈ కవిత్వంలో వాడిన అక్షర సముదాయ మంతా శుభాన్ని సూచించే విధంగానే రచింపబడి వుంటుంది. ఎక్కడా వ్యర్థాక్షరం, అశుభసూచకమైన అక్షరం వంటివి లేనిది అని అర్థం.

5. సద్భిః సంస్తూయమానం -

కన్యా పరంగా - సాముద్రిక శాస్త్ర వేత్తలు, సౌందర్య, సౌశీల్య విజ్ఞత కలిగిన వారిచేత చక్కగా కొనియాడబడినది - అని అర్థం.

కవితా పరంగా - పండితుల చేత, విమర్శకుల చేత చక్కగా ప్రశంసించబడినది అని అర్థం.

6. సరసగుణయుతాం -

కన్యా పరంగా - సమయసందర్భాలు తెలుసు కుని అందుకు తగ్గట్టుగా సరస సల్లాపాలతో, మనస్సుకు హత్తుకుపోయే విధంగా విజ్ఞతతో మసలుకునే సుగుణాలరాశి - అని అర్థం.

కవితా పరంగా - ఈ కవిత శృంగారాది నవరసాలతో హృదయాన్ని ద్రవింప జేసే విధంగా సరసంగా వుంటుందని , కావ్యం నిండా మాధుర్యాది గుణాలుంటాయని అర్థం.

7. లక్షితాం -

కన్యా పరంగా - సాముద్రిక శాస్త్రానికి సరిపోయే విధమైన మంచి లక్షణాలు కలది - అని అర్థం.

కవితా పరంగా - మంచి కావ్య లక్షణాలు ( శిల్పము, అర్థము, శబ్దము, శైలి మొదలైనవి) కలవి అని అర్థం.

8. లక్షణాఢ్యాం -

Sri Maha Kameswari Seva Trust

కన్యా పరంగా - సల్లక్షణాలు కలవారు ఎంచుకునే విధంగా ఉండేది - అని అర్థం.

కవితా పరంగా - దీనిలో చక్కని విషయాలు ప్రతిపాదింప బడ్డాయి, ఈ కావ్యం చదివి తీరాలి అని సత్కవులు, పండితులు ఒక - లక్ష్యాన్ని పెట్టుకునే విధంగా వ్రాయబడింది - అని అర్థం.

9. ఉద్యద్భూషా విశేషాం -

కన్యా పరంగా - చూడంగానే మంచి పవిత్రమైన భావాలు కలిగే విధంగాను - ఆదరంగా ఉండే అలంకారాల శోభను కలిగినది - అని అర్థం.

కవితా పరంగా - కావ్యం చదువుతున్న కొలదీ క్రొత్త క్రొత్త భావాలు, అర్థాలు ద్యోతకమయే విశేషమైన అలంకారాల శోభతో వుండేది - అని అర్థం.

10. ఉపగత వినయాం -

కన్యా పరంగా - ఎంతో కష్టపడి విశ్లేషించి విమర్శించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేకుండా - చూడంగానే చాలా వినయ విధేయతా సంపన్నురాలు - అని తెలిసే విధంగా వుండేది - అని అర్థం.

కవితా పరంగా - ఎవర్నీ విమర్శించకుండా, చదవంగానే ఎవరి హృదయానికీ బాధ కలగని రీతిలో, ఆలోచించ కుండా వెంటనే ఆస్వాదించ డానికి వీలుగా ఉండేది అని అర్థం.

11. ద్యోతమానార్థ రేఖాం -

కన్యా పరంగా - హస్తాల్లోనూ, అరికాళ్ళలోనూ సుస్పష్టంగా కనపడే భాగ్యరేఖా చిహ్నాలు కలిగినది - అని అర్థం. ( ఈ కన్యను పెళ్ళి చేసుకుంటే నీకు బాగా కలిసివస్తుంది అని అర్థం ).

కవితా పరంగా - కావ్యంలో వాడిన పదాలకు చాలా ప్రముఖమైన అర్థాలు - అంతరార్థాలు కలిగే విధంగా వ్రాయబడింది - అని అర్థం.

12. కళ్యాణీ -

కన్యా పరంగా - మీ ఇంటికి రాంగానే మీకూ, మీ కుటుంబ సభ్యులందరికీ శుభ పరంపరలు చేకూర్చేది అని అర్థం.

Sri Maha Kameswari Seva Trust

కవితా పరంగా - ఈ కావ్యం శుభాన్ని చేకూర్చి , జీవితాలను చక్కదిద్ధి, మోక్షాన్ని కూడా కలుగజేసే విధంగా వ్రాయబడినది -అని అర్థం.

ఇటువంటి ద్వాదశ సద్గుణ శోభిత అయిన నా కవితా కన్యను నీకు పాణిగ్రహణార్థం సమర్పించుకుంటున్నాను. నాపై దయతో నువ్వు అంగీకరించి ఈ కావ్యానికి కృతి భర్తగా నన్ను కృతార్థుణ్ణి చెయ్యి - అని శంకర భగవత్పాదులు శివుణ్ణి ప్రార్థించారు.

---

**99. ఇదేం తే యుక్తం వా పరమ శివ కారుణ్య జలధే**

**గతౌ తిర్యగ్రూపం తవ పద శిరోదర్శనధియా |**

**హరిబ్రహ్మాణౌ తౌ దివి భువి చరంతౌ శ్రమయుతౌ**

**కథం శంభో స్వామిన్కథయ మమ వేద్యోऽసి పురతః||**

మీ పాద దర్శనమునకై వరాహరూపము దాల్చి శ్రీ హరియు, శిరోదర్శనమునకై హంసరూపము దాల్చి బ్రహ్మయు భూమ్యంతరిక్షము లదంతటా తిరిగి ఫలమునంద లేకపోయిరి. ఇప్పుడు నాయెదుట ప్రసన్నులై నాకెట్లు తెలియనగుదురో సెలవిండు.

ఈ శ్లోకములో శివుణ్ణి 'పరమశివ' ! 'కారుణ్య జలధే' ! - అని రెండు విశేషాలతో సంబోధించారు. హరిబ్రహ్మలకు సైతం ఎంత శ్రమ పడినా దర్శన మివ్వని శివుడు తనకు ఎదురుగా ప్రత్యక్ష మైనందుకు, ' శివ' అని గూడా కాకుండా 'పరమశివ ' అనీ, కరుణకలిగినవాడా!' అని కాకుండా 'కరుణాసముద్రుడా' అనీ సంభోధించారు.ఈ సంబోధనలు ఆయన పొందిన ఆనందాన్ని, సంతృప్తినీ పారవశ్యాన్నీ తెలియచేస్తాయి. అంటే శివానందలహరి పూర్తి అవడానికి ఒక శ్లోకం ముందుగానే ఆయనకు శివదర్శనం జరిగిందన్నారు ! ఇదీ ఈ శివానందలహరి స్తోత్ర మహాత్మ్యం. రచించిన వారికే కాదు చదివిన వారికి, విన్నవారికి, చెప్పిన వారికి గూడా ఈ ఫలం దక్కుతుంది. దీన్నే ' సద్యఃఫలం' అంటారు. అమ్మవారికి కూడా వ్యాసులవారు శ్రీ లలితా సహస్రనామ స్తోత్రంలో

Sri Maha Kameswari Trust

'క్షిప్రప్రసాదినీ' అనే నామం చెప్పారు. అంటే - ఈ ఆది దంపతులు ఇద్దరూ అలాంటి వారే అని అర్థం.

శివుని పాదాలను చూడ్డానికి హరి వరాహ రూపమెత్తి పాతాళం దాకా కూడా చొచ్చుకుంటూ వెళ్ళాడు. అయినా ఫలితం దక్కలేదు. అలాగే బ్రహ్మ కూడా శివుని శిరస్సును చూడ్డానికి హంస రూపం ఎత్తి ఆకాశం అంతా గాలించినా ఫలితం దక్కలేదు. లక్ష్యాన్ని సాధించడం కోసం హరిబ్రహ్మ లిద్దరూ తిర్యగ్జంతురూపాలను ధరించడానికి కూడా వెనుకాడక పోయినప్పటికీ, అలసట,శ్రమే తప్ప దర్శనం దక్కలేదు. కాని, ఇక్కడే కదలకుండా వుండి, నీ పద ధ్యాన్నం చేస్తున్న నాకు - దర్శనమిచ్చే వాడవు ఎలా అవుతున్నావో నాకు అర్థం కావడం లేదు. దీన్ని నా యోగ్యత అనుకోను. కేవలం నామీద వుండే నీ వాత్సల్యం మాత్రమే ! పెద్ద మహర్షులకు , బ్రహ్మాదులకు చిక్కని కృష్ణుడు యశోదకు చిక్కలేదా, పెద్దవారి పట్ల కంటే కూడా నీకు నీ భక్తులయందే మక్కువ ఎక్కువ. నీవు శంకరుడవే కాదు, (శంకర) భక్తవశంకరుడవు - అని శివుణ్ణి ప్రస్తుతించారు.

( ఈ 'భక్తవశంకర' సంబోధన లో సాయుజ్యముక్తి సూత్రప్రాయంగా సూచించబడింది.)

---

**100. స్తోత్రేణాలమహం ప్రవచ్మి న మృషా దేవా విరించాదయః**

**స్తుత్యానాం గణనా ప్రసంగ సమయే త్వామగ్రగణ్యం విదుః|**

**మాహాత్మ్యా గ్రవిచారణ ప్రకరణే ధానాతుష స్తోమవ**

**ద్ధూతాస్త్వాం విదురుత్తమోత్తమ ఫలం శంభో భవత్సేవకాః ||**

దేవా! బ్రహ్మాదులగు ముప్పది మూడు కోట్ల దేవతలును స్తోత్రార్హులను లెక్కించు నప్పుడు నిన్ను మొట్టమొదటి వానిని గా లెక్కించు చున్నారు. సృష్టి స్థితి లయ రూపమైన మహాత్మ్యమును గురించి చర్చించునప్పుడు ధాన్యపు రాశి యెగురబట్టునపుడు పొట్టు అంతయు దూరముగా పోవునట్లు తామందరు దూరమై పోయి సారమైన ధాన్యము వలె నిన్నుత్తమోత్తమునిగా

Sri Matha Kameswari Seva Trust

గనుగొనుచున్నారు. ఇది వట్టి స్తుతిపాఠము కాదు. నేను చెప్పినదంతయు నిజముగా యిసుమంతయు నసత్యము గాదు.

ఈ చివరి  శ్లోకములో ఒక విషయాన్ని నిర్ధారించి చెప్పడం జరిగింది. లోకంలో పూజించ తగిన వారెవరని లెక్కించే ప్రస్తావన వచ్చినప్పుడు - బ్రహ్మాది దేవతలు శివునికి అగ్రస్థానమిచ్చి, అగ్రతాంబూలం ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చారు ట. మాహాత్మ్యమును గురించి చర్చకు వచ్చినప్పుడు గూడా అలాగే నిర్ణయించాల్సి వచ్చిందిట. వాళ్ళు ధాన్యాన్ని తూర్పారపెడుతున్నప్పుడు  - మిగతా దేవతలందరూ పొల్లు లాగా కొట్టుకుపోయారుట. శివుడొక్కడే నికరంగా అసలైన నిండు ధాన్యం లాగా నిలబడ్డాడుట. అందువల్లనే శివుణ్ణి బ్రహ్మాది దేవతలందరూ ఉత్తమోత్తమునిగా నిర్ణయించారు.  ' ఇలా నేను చెప్పడం నిన్ను పొగిడేందుకు కాదు. నేచెప్పేదంతా పచ్చినిజం. దీంట్లో ఇసుమంత కూడా అసత్యం లేదు - అని ఈ శివానందలహరి స్తోత్రాన్ని ఆది శంకర భగవత్పాదులు ముగించారు.

పోతనగారు కూడా ' 'చేతులారంగ శివుని పూజించడేని......'- అన్నారు.

హరి కీర్తనం, హర పూజనం తప్పకుండా దురితాలను దూరం చేస్తాయి. సుకృతాలను ఫలింపచేస్తాయి - అని తెలుసుకుని - హరిహర భేదం చూడకుండా మన కీర్తన, అర్చన కొనసాగాలి. అవే మనకు భక్తిని, ముక్తిని కలుగచేస్తాయి. శుభాన్ని కలుగచేసి ఆయుష్షును పెంచుతాయి. అందుకే సంధ్యావందనం లో కూడా -

' శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే

శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః

యథాశివమయోవిష్ణుః ఏవం విష్ణుమయశ్శివః


యథాంతరం నపశ్యామి తథామే స్వస్తి రాయుషి'

అని చెప్పడం జరిగిందని గుర్తు పెట్టుకోవాలి.

' పంచాయతన పూజ' అంటే - శివవిష్ణురవిగణేశాంబిక' లను పూజిస్తే మరీ మంచిది. శంకరులు కూడా ఈ పద్ధతిని ప్రవేశపెట్టి  తప్పుత్రోవలు, వెఱ్ఱి త్రోవలు పడుతున్న హిందూ జాతిని ఒక త్రాటి మీద నిలిపారు. మేధస్సులో శంకరాచార్యుల వారిని మించినవారు ఇంతవరకు పుట్టలేదు. ముందు పుట్టరు

Sri Maha Kameswari Seva Trust


కూడా! కాబట్టి, అట్టి మేధా సంపన్నులను ఆశ్రయించి, వారి మాటలను విశ్వసించి, అనుసరించి, ఆచరించి తరిద్దాం !!



శివార్పణమస్తు

'సమస్త సన్మంగళాని భవంతు.'

# వివరణ: డా.జి.ఎల్.ఎన్. శాస్త్రి గారు



గ్రంథకర్త

## G.L.N. శాస్త్రి

(గొర్తి లక్ష్మీనారాయణ శాస్త్రి)

| | | |
|---|---|---|
| తల్లిదండ్రులు | : | శేషారత్నం, హనుమచ్ఛాస్త్రి. |
| జన్మస్థలము | : | వెంకటాపురం (కైకలూరు తాలూకా, కృష్ణాజిల్లా) |
| జన్మదినము | : | విక్రమ, ఆశ్వయుజశుద్ధ ద్వాదశి (12-10-1940) |
| విద్యాభ్యాసము | : | **B.Sc.,**- హిందూ కళాశాల, మచిలీపట్నం.<br>**M.Sc., M. Phil, Ph.D.**- ఆంధ్రవిశ్వవిద్యాలయము, విశాఖపట్టణము |
| వృత్తి | : | గుంటూరులోని **T.J.P.S.** కళాశాలలో భౌతికశాస్త్ర విభాగాధ్యక్షులు (రిటైర్డ్) |
| పరిశోధనారంగము | : | వివిధ జాతీయ, అంతర్జాతీయ వైజ్ఞానిక సదస్సులలో పాల్గొని, నూతన పరిశోధనా విషయ వ్యాసములను ఇప్పటికి 18 వఱకు వివిధ వైజ్ఞానిక పత్రికలలో ప్రచురించి, భారతీయ ధ్వనిశాస్త్ర **(ACOUSTICS)** అతి ధ్వనిశాస్త్ర **(ULTRASONICS)** పరిషత్తులలో సభ్యులుగా గౌరవించబడిరి.<br>ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే 1996-97 సంవత్సరములో ఉత్తమ అధ్యాపక పురస్కార గౌరవమును పొందిరి. |
| అర్ష విజ్ఞాన రంగము | : | 1965 సం.లో కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య గారికి శిష్యులై వేద, ఇతిహాస, జ్యోతిష, కావ్య, క్రతు విద్యా, యోగ, హోమియో, వాస్తు శాస్త్రములలో సుశిక్షితులైరి. అంతర్జాతీయ అధ్యాత్మిక సేవా సంస్థ అయిన జగద్గురు పీఠమునకు పాలకవర్గ సభ్యులుగా ఉన్నారు. |
| రచనావ్యాసంగము | : | సంగీత రూపకములు-రేడియోలో ప్రసారమై, ఆర్షవిజ్ఞాన వ్యాసములు- 'నావాణి', 'మిహిర', 'ఋషిపీఠము' 'ఆర్షధర్మము' మొదలగు మాసపత్రికలలో ప్రచురించబడుచున్నవి. |
| ముద్రిత రచనలు | : | ప్రేయరు, గాయత్రి, శాంతి పాఠము, రుద్రాభిషేక సంకలనము, జాతక చక్రమును గుణించుపద్ధతి, పాదుకా పట్టాభిషేకము. శ్రీమద్రామాయణము,. అరణ్య, కిష్కింధా, సుందర కాండలు, రామోవిగ్రహవాన్ ధర్మః, శ్రుతి గ్రీత-1, శ్రుతి గీత-2, అక్షర గణపతి - కుండలినీపతి, లీలా మాధవమ్, శ్రీ లలితా సహస్ర నామ వివరణ (నాలుగు భాగములు) |
| అముద్రిత రచనలు | : | శివానందలహరి, **HOMOEO & ASTROLOGY,** సంక్షిప్త గృహ వాస్తు ప్రభోధాత్మక హాస్యకథాలహరి |
| సేవా కార్యక్రమాలు | : | రాష్ట్ర, రాష్ట్రేతర పట్టణములలో అర్ష విజ్ఞాన ప్రసంగములు చేయుచు, వేద జ్యోతిష శిక్షణా తరగతులు నిర్వహించిరి. గుంటూరు 2/9 బ్రాడీపేటలోని స్వగృహము నందు ఒక ఉచిత వేద, జ్యోతిష, హోమియో వైద్యాలయమును నిర్వహించుచున్నారు. |

(శివానుగ్రహం తో ఏ విఘ్నాలు లేకుండా శివానందలహరి 100 శ్లోకములకు శ్లోకం,తాత్పర్యం, వివరణ అందించగలిగాము.

ఇది కేవలం శివానుగ్రహమే !

నమస్కారములతో ఆకుండి శకుంతల

